ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

ప్రజా కలం

Published From Nizamabad

PRGI No.TELTEL/2010/33275

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
5 Lines Rs.250 only
&
Public Notice Advertising
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

మంగళవారం | 27-09- 2026 | సంపుటి: 17, సంచిక: 178, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ

విద్యా విధానాన్ని

గాడిలో పెడుతున్నాం

జనాభా పెరుగుతుంటే ఓట్లు తగ్గుతున్నాయి - మొత్తం 30 కోట్ల ఓట్లకు ఎసరు పెట్టారు
డీలిమిటేషన్‌ను మళ్లీ ఫ్రీజ్ చేయాల్సిందే : 'ప్రతిదిన్' సదస్సులో సీఎం రేవంత్



హైదరాబాద్, సెప్టెంబర్ 28 (ప్రజాకలం) : సైమన్ గోబ్యాక్ నినాదంతో వందేండ్ల కింద దేశమంతా ఏకమైనట్లే ఇప్పుడు 'సర్' గో బ్యాక్ నినాదంతో ఏకమవుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్నికల కమిషన్‌ను సైమన్ కమిషన్ మాదిరిగా ఉపయోగించుకునేందుకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని, ఎస్ఐఆర్ పేరిట ఓట్లను తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారతీయ జనతా పార్టీ కాస్తా బ్రిటిష్ జనతా పార్టీలా తయారైందని ఆయన విమర్శించారు. దేశంలో 30 కోట్ల ఓట్లు తొలగించాలని కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. మోదీని ఎవరైతే వ్యతిరేకించారో వాళ్ల ఓట్లు తొలగించాలని ప్రయత్నం జరుగుతున్నదని మండిపడ్డారు. ఢిల్లీలో సోమవారం 'ప్రతిదిన్ కాంక్లేవ్'లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడారు. గతంలో బూత్ లెవల్ అధికారం బూత్ లెవల్ అధికారికి, కలెక్టర్ అధికారం కలెక్టర్‌కు ఉండేదని, ఇప్పుడు అన్ని అధికారాలు ఎన్నికల కమిషన్ గుప్పిట్లో పెట్టుకున్నదని దు య్యబట్టారు. భారత రాజ్యాంగ నేతలు ఈ దేశంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలని అభిలాషిస్తే.. ప్రధాని మోదీ మాత్రం ఎన్నికల సంఘం పేరుతో పెద్ద ఎత్తున కుట్ర చేస్తున్నారని, ఇది కాంగ్రెస్ పార్టీ సమస్య కాదని, దేశ ప్రజాస్వామిక సమస్య అని తెలిపారు.

'సర్' పేరిట కుట్ర... '1919లో భారత ప్రభుత్వ చట్టం అమలు, దేశంలో పాలనా నిబంధనలు సమీక్షకు 1928లో సైమన్ కమిషన్‌ను నియమించారు. అందులో ఏడుగురికి ఏడుగురు బ్రిటిషర్లు ఉంటే మాకు ఏం న్యాయం ఏం జరగుతుందని లాలా లజపతిరాయ్ ఉద్యమం లేవదీ శారు. సైమన్ గో బ్యాక్ నినాదాన్ని ఇచ్చారు. దేశమంతా ఏకమైంది. ఆందోళనలపై లాఠీఛార్జీ చేశారు. అందులో లాలా లజపతిరా య్ చనిపోయారు. అప్పుడు భగత్ సింగ్ జెండా ఎత్తారు.

తరువాయి 2వ పేజీలో...



బీసీ సంక్షేమానికి ప్రాధాన్యం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
రూ. 60 కోట్లతో 50 వేల మందికి కాటమయ్య రక్షణ కవచాలు
రూ. 450 కోట్లతో 1.30 లక్షల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు జమ
నవంబర్ నుంచి 'రాజీవ్ యువ వికాసం' ప్రారంభం
ఓవర్సీస్ స్కాలర్‌షిప్ దరఖాస్తుల గడువు అక్టోబర్ 15 వరకు పెంపు

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (ప్రజాకలం) : రాష్ట్రంలో బీసీ సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సోమవారం ప్రజాభవన్‌లో బీసీ సంక్షేమ శాఖపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బాలామాయదేవి, ఎంజేపీ సెక్రటరీ సైదులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్, పద్మ, ఇందిరా, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ సిఎం మాట్లాడుతూ.. ప్రీ-మెట్రిక్, పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ నిధులను నేరుగా విద్యార్థుల బ్యాంక్ ఖాతాల్లోకే (ణదీ పద్ధతి ద్వారా) జమ చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఈ నూతన విధానం ద్వారా ఇప్పటివరకు 1,30,000 మంది విద్యార్థులకు 450 కోట్ల నిధులను నేరుగా వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. అలాగే హాస్టల్ విద్యార్థుల డైట్, కాస్మోటిక్ ఛార్జీలను

తరువాయి 2వ పేజీలో...

ఈసీ బీజేపీ చేతిలో

కీలుబొమ్మ

- మోదీ, అమిత్ షా కనుసన్నల్లోనే ఎన్నికల కమిషన్ పనితీరు
- ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు నిప్పులు
- కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ భారీ ధర్నా.. ఈసీ దిష్టిబొమ్మ దహనం



పెద్దపల్లి: సెప్టెంబర్ 28: (ప్రజాకలం జిల్లా ప్రతినిధి) కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తమ స్వార్థ రాజకీయాల కోసం రాజ్యాంగబద్ధమైన ఎన్నికల కమిషన్‌ను పావుగా వాడుకుంటూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఆయన భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ ప్రధానినరేంద్రమోదీ, కేంద్రహోం మంత్రి అమిత్ షా ఆదేశాలకు అనుగుణంగా ఎన్నికల కమిషన్ నడుచుకుంటోందని ఆరోపించారు.

తరువాయి 2వ పేజీలో...



బుల్లెట్ ట్రైన్‌కు వ్యతిరేకం కాదు
బహదూర్‌పల్లిలో పట్టాలు ఇప్పించే బాధ్యత నాదే
రైతులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసా

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (ప్రజాకలం): బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్‌లో భూములు కోల్పోతున్న బహదూర్‌పల్లి రైతుల భూములపై 4 వేల మంది పోలీసులను పంపి దండయా త్ర ఎందుకు చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ప్రశ్నించారు. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్‌పై బీఆర్ఎస్‌కు ఎలాంటి వ్యతిరేకత లేదని స్పష్టంచేశారు. కానీ ఆ పేరు మీద రియల్ ఎస్టేట్ దందా చేస్తే ఊరుకునేది లేదు అని హెచ్చరించారు. ప్రాజెక్టుల అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, అయితే అభివృద్ధి పేరుతో రైతుల భూములకు అన్యాయం చేయడాన్ని మాత్రం అంగీకరించబోమని స్పష్టం చేశారు.

తరువాయి 2వ పేజీలో...

మూన్నాళ్ల ముచ్చట

అర్ధంతరంగా నిలిచిపోయిన షాదీఖానా నిర్మాణం
శంకుస్థాపనలు జరిగాయి.. నిధుల హామీలు అందాయి.. అయినా పూర్తికాని నిర్మాణం
ఏండ్లుగా నిలిచిన పనులు.. నిరాశలో ముస్లిం మైనార్టీలు



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి సెప్టెంబర్ 28 (ప్రజాకలం) పట్టణంలోని ముస్లిం మైనార్టీల చిరకాల స్వప్నమైన షాదీఖానా నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోయింది. ఏళ్ల తరబడి హామీలు, పలుమార్లు శంకుస్థాపనలు జరిగినా నిర్మాణం మాత్రం పూర్తి కాలేదు. ఏడాదిన్నర కాలంగా పనులు నిలిచిపోవడంతో షాదీఖానా అందుబాటులోకి వస్తుందన్న ఆశలు ఆవిరవుతున్నాయి. పేద, మధ్యతరగతి ముస్లిం కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉండాల్సిన ఈ భవనం అనంవూర్తిగా దర్శనమిస్తోంది. పాలకుల నిర్లక్ష్యంతోనే నిర్మాణం ముందుకు సాగడం లేదని స్థానిక మైనార్టీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిధుల మంజూరు..

పలుమార్లు శంకుస్థాపనలు

మెట్‌పల్లి పట్టణంలో షాదీఖానా నిర్మాణానికి 2005 ఏప్రిల్ 17న

తరువాయి 2వ పేజీలో...

భూ సమస్యల శాశ్వత పరిష్కారమే

భూముల రీసర్వే ప్రక్రియ లక్ష్యం

భూ రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి
120 ఏళ్ళ కింద భూ సర్వే జరిగింది.. మళ్ళీ మేము ఇప్పుడు నిర్వహిస్తున్నాం
ఈ విషయంలో అలసత్వం ప్రదర్శించే అధికారులపై చర్యలు తప్పవు
రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి


మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్ 28: రెవెన్యూ భూ రీసర్వే, ఇందిరమ్మ ఇండ్లు తదితర అంశాలపై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సమీక్షలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలు. జారీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే ప్రక్రియ భూ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం చూపే మార్గమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి అన్నారు. సోమవారం వనపర్తి ఐడీఓసీ సమావేశ మందిరంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని రెవెన్యూ, గృహ నిర్మాణం, భూముల సర్వే తదితర అంశాలపై సమీక్షా



సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తన సహచర మంత్రులైన ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు,

తరువాయి 2వ పేజీలో...

కలం కౌంటర్



యువత సృజనాత్మకతకు బతుకమ్మ ఛాలెంజ్ వేదిక

- ఇన్ఫ్లుయెన్సర్లకు ప్రత్యేక పిలుపు : యువ ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యం..
- ప్రభుత్వ పథకాలు, తెలంగాణ సంస్కృతిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఇన్ఫ్లుయెన్సర్లదే కీలక పాత్ర

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (ప్రజాకలం) : బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్-2026లో భాగంగా ఇన్ఫ్లుయెన్సర్ల సమావేశం సోమవారం ఎఫ్‌డీసీ కార్యాలయంలో విజయవంతంగా జరిగింది. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) చైర్మన్ దిల్ రాజు, ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. ముకుంద రెడ్డి, ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ కొండా రాజు ఆధ్వర్యంలో, ఇన్ఫ్లుయెన్సర్ జీలా అనిల్ సమన్వయంతో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్ లక్ష్యాలు, పోటీ విధివిధానాలు, వివిధ విభాగాలు, పాల్గొనే విధానం తదితర అంశాలను ఇన్ఫ్లుయెన్సర్లకు వివరించారు. తెలంగాణ



ప్రభుత్వం యువ కళాకారులు, కంటెంట్ క్రియేటర్లు, ఫిల్మ్ మేకర్లను ప్రోత్సహించే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఇన్ఫ్లుయెన్సర్లు విస్తృతంగా భాగస్వాములు కావాలని సూచించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, బతుకమ్మ పండుగ విశిష్టతతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజా పాలనకు సంబంధించిన సమాచారాన్ని సృజనాత్మక డిజిటల్ కంటెంట్ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఇన్ఫ్లుయెన్సర్లు కీలక పాత్ర పోషించగలరని సమావేశంలో పేర్కొన్నారు. ఇన్ఫ్లుయెన్సర్ల విభాగంలో తెలంగాణ ప్రభుత్వ పథకాలు, ప్రజా పాలనపై రీల్స్, డిజిటల్ స్టోరీటెల్లింగ్ ద్వారా కంటెంట్ రూపొందించేందుకు అవకాశం కల్పించారు. యువ ఫిల్మ్ మేకర్లు, ఇన్ఫ్లుయెన్సర్లు, కంటెంట్ క్రియేటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్ బాబు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా. మామిడి హరికృష్ణ, సినీ నటుడు రచ్చ రవి, అనిల్, అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా విధానాన్ని గాడిలో పెడుతున్నం

మొదటి పేజీ తరువాయి...

వందేండ్ల అనంతరం ఇప్పు డు ప్రధాని మోదీ ఎన్నికల కమిషన్‌ను సైమన్ కమిషన్ మాదిరిగా ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్నారు. నాటి ఎత్తుగడలనే బ్రిటిష్ జనతా పార్టీ వేస్తున్నది. దేశంలో ఎన్నోసార్లు సర్ ప్రక్రియ జరిగినప్పటికీ ఇప్పు డు మాత్రం ఓటు హక్కును తొలగించేందుకే చేస్తున్నారు' అని సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సర్'కు వ్యతిరేకంగా దేశమంతా ఏకమవుతుందని.. మమతా బెనర్జీ, శరద్ పవార్, ఉద్దవ్ ఠాక్రే, స్టాలిన్‌తో పాటు అందరూ ఉద్యమిస్తారని, కుట్రలు సాగబోవని ఆయన అన్నారు.

జనాభా పెరిగితే ఓట్లు పెరగవా?

'దేశంలో జనాభా పెరిగితే ఓట్లు పెరుగుతాయి. నాడు దేశంలో 35 కోట్ల జనాభా ఉంటే ఇప్పుడు 140 కోట్ల జనాభా. ఏటా జనాభా పెరుగుతున్నది. మన ఓటు హక్కు ను 21 ఏండ్ల నుంచి 18 ఏండ్లకు తగ్గించుకున్నాం. ప్రధాని మోదీ, సీఈసీ జ్ఞానేష్ కుమార్ కలిసి ఓట్లను ఎందుకు తొలగిస్తున్నారు. 2014లో మోదీ ప్రధాని అయిన ప్పుడు 81 కోట్ల ఓట్లు, ఆ తర్వాత 2019లో 91 కోట్ల ఓట్లు, 2024లో 97 కోట్ల ఓట్లు ఉంటే.. ఇప్పుడు 30 కోట్ల ఓట్లు తొలగించాలని మోదీ చూస్తున్నారు. తనను ఎవరైతే వ్యతిరేకించారో వాళ్ల ఓట్లు తొలగిస్తారు. బీజేపీ వాళ్లకు ఉన్న ఆయుధం వాట్సాప్, సోషల్ మీడియా. ఎవరైతే వాళ్లకు వ్యతిరేకంగా పోస్టులు పెడతారో ఆ పోస్ట్ పెట్టిన వారి ఓట్లు తొలగిస్తారు' అని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఏఐ టెక్నాలజీ వాడి ఓట్లు తీసివేస్తున్నారని, ముగ్గురు ఎన్నికల కమిషనర్లలో ఇద్దరు కమిషనర్లకు తెలియకుండా సీఈసీ జ్ఞానేష్ కుమార్ అన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారని మండిపడ్డారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను నార్త్‌కొరియా అధ్యక్షుడు కిమ్ వద్దకు శిక్షణకు పంపిస్తే.. ఇక్కడికి వచ్చి మోదీకి వందకు వంద శాతం ఓట్లు వేయిస్తారని ఆయన విమర్శించారు.

ఎన్ఎస్‌యూఐ ప్రభావం లేదు

తెలంగాణలో బీజేపీకి పెద్దగా ప్రాధాన్యం లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 'తెలంగాణలో విద్యార్థి సంఘాలు చాలా తక్కువ.. లెఫ్ట్, రైట్ సంఘాలున్నాయి. ఎన్ఎస్‌యూ ఐ ప్రభావం పెద్దగా లేదు. ఉత్తర భారతదేశంలో, దక్షిణ భారతదేశంలో రాజకీయాల శైలి వేరు. మా దగ్గర యూనివర్సిటీ లా కా లేజ్, ఆర్ట్స్ కాలేజీ నాయకునిగా ఏబీవీపీలో గెలిచిన వారు తర్వాతకాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తారు' అని పేర్కొన్నారు. 'రాష్ట్రంలో 2014 ఎన్నికల తర్వాత పోటీ కేసీఆర్, రేవంత్ మధ్య అన్నట్లు మారింది. కేసీ ఆర్ నన్ను అనేక సార్లు జైలుకు పంపారు. నేను అసెంబ్లీకన్నా జైలుకే ఎక్కువ సార్లు వెళ్లాను' అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

విద్యా విధానాన్ని గాడిలో పెడుతున్నం

రాష్ట్రం విద్యా విధానాన్ని గాడిలో పెడుతున్నామని.. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ నుంచి 12వ తరగతి వరకు భాష, నైపుణ్యా లు నేర్పుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అ న్నారు. '12వ తరగతిలోపు ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పుతున్నాం. 12వ తరగతి తర్వాత నైపుణ్యాలు నేర్పుతున్నాం. మా రా ష్ట్రం నుంచి ఏటా దాదాపు 1.80 లక్షల మం ది ఇంజినీరింగ్ విద్యార్థులు బయటకు వస్తున్నారు. అందులో కేవలం 20 వేల మంది ఉద్యోగాలు పొందుతున్నారు. మిగతా వాళ్లు వాళ్ల చదువు, స్థాయికి తగని ఉద్యోగాలు చే స్తున్నారు.

ఎందుకంటే వాళ్లకు అవసరమైన నైపుణ్యాలు లేవు. అందుకే యంగ్ ఇండి యా స్కిల్స్ యూనివర్సిటీ పెట్టాం. సర్టిఫికెట్ల కోసం చదువు వద్దు.. నైపుణ్యాలు నేర్చుకోవాలని సూచిస్తున్నా. ఉ ద్యోగాలు కల్పించే నై పుణ్యాలకు సంబంధించిన కోర్సుల రూపకల్పన చేశాం. ఐటీఐలను ఏటీసీలుగా మార్చ డంతో ఉద్యోగాలు వస్తున్నాయి' అని ఆ యన వివరించారు. దేశంలో సగటున 30 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉంటే, తెలంగాణలో 17 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉన్నా టీచర్లను నియమిస్తున్నామన్నారు.

రాష్ట్రాభివృద్ధికి మోదీ సహకారమేదీ?

గుజరాత్ సీఎంగా మోదీ ఉన్నప్పుడు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ హుందాతనంతో వ్యవహరించి గుజరాత్ అభివృద్ధి చాలా సహకరించారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. "నాడు మన్మోహన్ సింగ్ మోదీకి ఇచ్చిన మద్దతులో 10 శాతం కూడా మోదీ మాకు ఇవ్వడం లేదు. మేం కలిసినప్పుడు ఆయన మంచిగానే ఉంటారు. కానీ మా రాష్ట్రానికి మెట్రో రైలు, రీజినల్ రింగు రోడ్డు, జాతీయ రహదారుల విస్తరణకు ఏమాత్రం సహకరించడం లేదు. 360 కిలోమీటర్ల రీజినల్ రింగు రోడ్డుకు టెండర్లు పిలిచాం. రెం డేండ్లవుతున్నా పీఎం కార్యాలయంలోనే ఉ ండిపోయింది. మేం నితిన్ గడ్కరీని ఎప్పు డూ అడిగినా.. 'నా చేతిలో ఏమీ లేదు, మోదీ దగ్గర ఫైల్ ఉంది' అంటారు. సెమీ కండక్టర్ ప్రాజెక్టును చివరి నిమిషంలో గుజరాత్ తీసుకెళ్లారు. ఇది ఉత్తరాది, దక్షిణాది అంశం కాదు.. గుజరాత్, మిగతా దేశం వ్యవహారంలా ఉంది. మోదీ ఉ త్తరప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నా గుజరాత్‌కే అన్నీ తీసుకెళ్లుతున్నారు" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

చిన్న రాష్ట్రాలను ఖతం చేస్తారేమో!

నియోజకవర్గాల పునర్విభజన సమస్య అనేది రాజకీయాల అంకెల ఆటలా మారిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. "రాజకీయా ల్లో మీ దగ్గర సంఖ్యా బలం ఉంటేనే ఢిల్లీకి పిలిచి మాట్లాడుతుంది. లేకపోతే గేటు దగ్గరకు రానివ్వరు. అందుకే నేను సాధారణ మైన పరిష్కారం చూపుతున్నాను. 1976లో ఇందిరా గాంధీ 543 సీట్లకు లోక్‌సభ స్థానాలను ఫ్రీజ్ చేశారు. కేంద్రం కుటుంబ నియం త్రణ పిలుపునిస్తే దక్షిణాది రాష్ట్రాలు అమలు చేశాయి. ఉత్తరాదిలో అది జరగలేదు. దీం తో జనాభాలో హెచ్చుతగ్గులు పెరిగా యి. అందుకే ఇందిరా గాంధీ 25 ఏళ్లు ఆ సంఖ్య ను ఫ్రీజ్ చేశారు. తర్వాత వాజ్‌పేయి మరో 25 ఏళ్లు దాన్ని పొడిగించారు. 2026లో మోదీ అలానే మరో 25 ఏళ్లు పొడిగిస్తే ఎవరికీ ఇబ్బంది రాదు. కానీ, మోదీ మాత్రం డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల పేరుతో పెద్ద రాష్ట్రాలకు మరింత ప్రాతినిధ్యం పెంచుతూ, చిన్న రాష్ట్రాలను ఖతం చేయాలని చూస్తున్నారు" అని ఆరోపించారు.

మేం శివభక్తులం.. వాళ్లు రామ భక్తులు

'మేం (దక్షిణాది) ద్రావిడులం. వా ళ్లు (ఉత్తరాది) ఆర్యులు. మేం శివ భక్తులం. వాళ్లు రామ భక్తులు. వాళ్లు రాముని సొమ్ము తిన్నారు. మోదీ ఎందుకు హరహర మహదేవ్ అనరు. బీజేపీ నేతలు వేదికలపై జై శ్రీరాం అంటా రు, హరహర మహదేవ్ ఎందుకు అనరు. శివుడు పేదల దేవుడు.. శ్రీరాముడు సంపన్నుల దేవుడు. బీజేపీ సంపన్నుల పార్టీ" అని వ్యాఖ్యానించారు.

మూనాళ్ల ముచ్చట

మొదటి పేజీ తరువాయి...

అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నగరబాట కార్యక్రమంలో భాగంగా పర్యటించిన సమయంలో మైనార్టీ నాయకులు విజ్ఞప్తి చేశారు. షాదీఖానా నిర్మాణానికి స్థలం, నిధులు మంజూరు చేయాలని కోరడంతో అప్పట్లో మైనార్టీ సంక్షేమ శాఖ నుంచి రూ.10 లక్షలు మంజూరయ్యాయి. అనంతరం స్థలం ఎంపిక చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.60 లక్షలు కేటాయించింది. 2006లో అప్పటి ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు భూమిపూజ చేశారు.అయితే, నిర్మాణం ఆశించిన వేగంతో ముందుకు సాగలేదు. 2022 ఏప్రిల్ 1న అప్పటి కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు మరోసారి అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అనంతరం నత్తనడకన ప్రారంభమైన పనులు చుట్టూ గోడల నిర్మాణం వరకే పరిమితమయ్యాయి. నిధులు మంజూరు కావడం లేదని కాంట్రాక్టర్ పనులు నిలిపివేయడంతో షాదీఖానా నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది.

పేద కుటుంబాలకు తప్పని ఆర్థిక భారం

మెట్‌పల్లి పట్టణంలో ముస్లిం మైనార్టీ జనాభా గణనీయంగా ఉంది. వారిలో ఎక్కువ మంది పేద, మధ్యతరగతి కుటుంబాలే. ఇళ్లలో వివాహ వేడుకలు నిర్వహించుకోవాలంటే ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. షాదీఖానా నిర్మాణం పూర్తయితే తక్కువ ఖర్చుతో వివాహ వేడుకలు నిర్వహించుకోవచ్చని ఎన్నో కుటుంబాలు ఆశించాయి. అయితే, నిర్మాణం పూర్తికాకపోవడంతో వారి ఆశలు నెరవేరడం లేదు.

ఎన్నికల హామీలకే పరిమితమైన షాదీఖానా

ప్రతి ఎన్నికల సమయంలో షాదీఖానా నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేయిస్తామని ప్రజాప్రతినిధులు హామీలు ఇస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఎన్నికల అనంతరం మాత్రం ఈ అంశాన్ని పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముస్లిం పెద్దలు పలుమార్లు ప్రజాప్రతినిధులను కలిసి నిర్మాణ పనులు పూర్తి చేయాలని విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పిచ్చి మొక్కల మధ్య అసంపూర్తి భవనం

ఏళ్ల తరబడి పూర్తవుతుందని ఎదురుచూస్తున్న షాదీఖానా నేడు అసంపూర్తి భవనంగా మిగిలిపోయింది. భవనం చుట్టూ పిచ్చి మొక్కలు మొలవడం నిర్మాణ పనుల పరిస్థితికి అద్దం పడుతోంది. ప్రజాధనం వెచ్చించినా భవనం అందుబాటులోకి రాకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి అవసరమైన నిధులు మంజూరు చేసి షాదీఖానా నిర్మాణాన్ని పూర్తిచేయాలని మెట్‌పల్లి ముస్లిం మైనార్టీ ప్రజలు కోరుతున్నారు.

ఈసీ బీజేపీ చేతిలో కీలుబొమ్మ

మొదటి పేజీ తరువాయి...

స్వయం ప్రతిపత్తి కలిగిన ఎన్నికల సంఘం ఇలా పాలకుల అడుగులకు మడుగులొత్తడం దేశ చరిత్రలోనే తొలిసారని మండిపడ్డారు.అనుకూలంగా లేని చోట్ల ఓట్ల గల్లంతు బీజేపీ గతంలో పలుమార్లు అడ్డదారుల్లో అధికారంలోకి వచ్చిందని,ఇప్పుడు సర్ ప్రోగ్రాం పేరుతో తమకు ప్రతికూలంగా ఉన్న ప్రాంతాల్లో ఏకంగా13 కోట్ల ఓట్లను తొలగించేందుకు భారీ కుట్ర పన్నిందని విమర్శించారు.లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గతంలోనే ఈసీ పక్షపాత వైఖరిపై హెచ్చరించారని,తోటి కమిషనర్ల వ్యాఖ్యలతో రాహుల్ గాంధీ చెప్పిన మాటలు అక్షరసత్యాలని దేశానికి స్పష్టమైందన్నారు.చివరకు ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు సైతం సర్' తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు.ప్రజల ఓటు హక్కును కాలరాస్తున్న సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతిపక్షాలు,మేధావులు, ప్రజాస్వామ్యవాదులు ముక్తకంఠంతో పోరాడాలని విజయరమణారావు పిలుపునిచ్చారు.ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్,మున్సిపల్ చైర్మన్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు,డైరెక్టర్లు, సింగిల్ విండో పాలకవర్గ సభ్యులు,కౌన్సిలర్లు, సర్పంచులు,వివిధ మండల,పట్టణ,బ్లాక్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు,పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ సమస్యల శాశ్వత పరిష్కారమే

భూముల రీసర్వే ప్రక్రియ లక్ష్యం

మొదటి పేజీ తరువాయి...

రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి హాజరై సమీక్షించారు. ఈ సమావేశంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి లోకేష్ కుమార్, రిజిస్ట్రేషన్లు, స్టాంప్స్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ఎండీ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉమ్మడి జిల్లాలోని మండలాల వారీగా భూముల రీ సర్వే ప్రక్రియపై తహసిల్దార్లు, సర్వేయర్లతో ఒక్కొక్కరిగా సమీక్షించి, పురోగతిపై ఆరా తీశారు. అదేవిధంగా సర్వే ప్రక్రియ పై రైతుల నుంచి వ్యక్తమవుతున్న అనుభవాలపై ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, దాదాపు 120 ఏళ్ల క్రితం భూముల సర్వే నిర్వహించారని, మళ్లీ ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించాలనే లక్ష్యంతో సమగ్ర రీసర్వే ప్రక్రియను చేపట్టిందని తెలిపారు. ఈ ప్రక్రియను అధికారులు అత్యంత ప్రాధాన్యతతో, పూర్తి బాధ్యతతో నిర్వహించాలని ఆదేశించారు.భూముల రీసర్వే ద్వారా భూముల హద్దులు, యాజమాన్యానికి సంబంధించిన సమస్యలతో పాటు సాదా బైనామా వంటి దీర్ఘకాలిక సమస్యలకు కూడా పరిష్కారం లభించే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో రీసర్వేను పకడ్బందీగా నిర్వహించి ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించాలని అధికారులకు సూచించారు.రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో తొలి దశలో రీసర్వే ప్రక్రియ చేయడంతో పాటుగా, రాష్ట్రంలోని 413 నక్షాలో లేని గ్రామాలను సైతం రిసర్వే నిర్వహిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ముందుగా గ్రామాల సరిహద్దులను పక్కాగా నిర్ధారించుకుని, ఆ తర్వాత భూముల సర్వేను పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. తహసీల్దార్ స్థాయి నుంచి జిల్లా కలెక్టర్ వరకు అధికారులందరూ క్షేత్రస్థాయికి వెళ్లి సర్వే ప్రక్రియను తప్పనిసరిగా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.రీసర్వే కోసం ఆధునిక రోవర్లను అన్ని జిల్లాలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. నిర్దేశిత ప్రణాళిక ప్రకారం, నాణ్యతతో రీసర్వే ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని, నవంబర్ 15వ తేదీలోపు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వే విషయంలో అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అటవీ అధికారులు భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలి. రీసర్వే ప్రక్రియకు సంబంధించి రైతులకు ఎప్పటికప్పుడు సమగ్ర సమాచారాన్ని అందించాలని, సర్వే విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ఏవైనా సందేహాలు ఉంటే క్షేత్రస్థాయిలోనే వాటిని నివృత్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించినా, అవినీతికి పాల్పడినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో రీసర్వే ప్రక్రియ ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవడంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకు అనుగుణంగా అధికారులు రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. లైసెన్స్ సర్వేయర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీకి మించి ఎకరానికి రూ.60 చొప్పున చెల్లిస్తున్నామని, ప్రతి 15 రోజులకు ఒకసారి చెల్లింపులు చేస్తున్నామని తెలిపారు. సర్వేయర్లకు నెలవారీ వేతనం ఇస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వలేదని, అలాంటి విధానం సాధ్యం కాదని మంత్రి స్పష్టం చేశారు. రైతులను అనవసర కారణాలతో కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడం సరికాదని, వారి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను హెచ్చరించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న న్యాయమైన సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నిజమైన అర్హులైన లబ్ధిదారులకు మంజూరు చేయాలని సూచించారు. ఇప్పటికే మొదటి దశలో ప్రతి నియోజకవర్గానికి 3,500 కేటాయించడం జరిగిందని తెలిపారు. రెండో దశలో ప్రతి నియోజకవర్గానికి 2000 ఇళ్లను కేటాయిస్తున్నట్లు తెలిపారు. తొలి దశలో చేసిన తప్పులు రెండో దశలో పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు.

వనపర్తి భూ సమస్యలను త్వరగా పరిష్కరించాలి

వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సమావేశంలో ప్రస్తావించిన రెవెన్యూ, భూ సమస్యలపై మంత్రి పొంగులేటి స్పందించారు. వనపర్తి పట్టణ శివారులోని సర్వే నంబర్ 9లో రెవెన్యూ, దేవాదాయ శాఖల మధ్య ఉన్న సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అదేవిధంగా వనపర్తి బైపాస్ రహదారికి సంబంధించి అటవీ శాఖకు ఇప్పటికే ప్రత్యామ్నాయ భూమి (సీఏ ల్యాండ్) కేటాయించినందున, ఈ అంశంలో మిగిలి ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ రెండు అంశాలకు సంబంధించి రెండు వారాల్లోగా పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు.లిప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలు,కళాశాలలు,నైపుణ్య అభివృద్ధి కేంద్రాలకు భూములు కేటాయింపు సమస్యలు ప్రాధాన్యత నిచ్చి పరిష్కరించాలని అన్నారు.విద్యార్థుల భవిష్యత్ ముఖ్యమని,డిజిటల్ ,కృత్రిమ మేధ యుగంలో విద్యార్థులను ప్రపంచంతో. పోటీ పడేలా వారికి విద్య ను అందించవలసిన బాధ్యత ఉందని అన్నారు.రైల్వే బ్రిడ్జి ,రోడ్ల నిర్మాణం కు భూములు త్యాగం చేసిన వారికి పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.వెంకటాపూర్ గ్రామంలో అటవీ,రెవెన్యూ శాఖలు సర్వే చేసి భూ సమస్య పరిష్కారం చేయాలని అన్నారు.మహబూబ్ నగర్ లో రాజీవ్ స్వగృహ శిథిలావస్థకు చేరుకుందని, అక్కడ ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేయాలని సూచించారు.జిల్లా కలెక్టర్ లు ప్రతి నెల నియోజకవర్గ సమస్యలపై సంబంధిత శాసన సభ్యులు,అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. మహబూబ్ నగర్ పట్టణం లో ఇసుక సరఫరాకు రీచ్ ల రవాణా చేసి డంప్ చేస్తే ఇసుక సమస్య పరిష్కారం చేయాలని అన్నారు.

దేవరకద్ర నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి ఆదేశాలు

దేవరకద్ర ఎమ్మెల్యే ప్రస్తావించిన పలు సమస్యలపై మంత్రి పొంగులేటి స్పందిస్తూ, కొత్తకోట మండలం రాఘవేంద్ర కాలనీలోని టెనెంట్ ల్యాండ్ సమస్య పరిష్కారానికి మార్గాలు అన్వేషించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదే విధంగా కొత్తకోట మండలం ఈదులబావితండాలో దేవాదాయ శాఖ అదీనంలో ఉన్నట్లు చూపిస్తున్న భూముల సంబంధించిన సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి నియోజకవర్గం లో పలు రెవెన్యూ భూమి సంబంధిత సమస్యలు సమావేశంలో మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు.జడ్చర్ల లో దేవదయా భూములు గురించి,నిషేధిత జాబితా లో పెట్టిన వాటి పై సమావేశంలో ప్రస్తావించారు.

ప్రజల అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి: మంత్రి జూపల్లి

మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చే అర్జీలను జిల్లా అధికారులు క్రమబద్ధమైన విధానంలో పరిశీలించి పరిష్కార మార్గాలు చూపాలని సూచించారు. ప్రతి నెలలో ఒక్కో మండలానికి ఒక రోజును కేటాయించి, ఆ మండలానికి సంబంధించిన ప్రజా సమస్యలపై సమీక్ష నిర్వహించాలని తెలిపారు.

సాధ్యమైన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలు, అర్జీల స్వీకరణ కోసం ప్రత్యేక వాట్సాప్ నంబర్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు. తెలియజేయాలని అన్నారు. ప్రజలు పంపించే అర్జీలను పరిశీలించి, వాటిపై సమీక్షలు నిర్వహిస్తూ పరిష్కార మార్గాలను చూపాలని సూచించారు.ప్రజల నుంచి వచ్చిన అర్జీలు వారం రోజులకు మించి పెండింగ్‌లో ఉండకూడదని, ప్రతి అర్జీకి తగిన పరిష్కారం చూపేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటు, ఇతర సమస్యలపై మంత్రి వాకిటి విజ్ఞప్తి...మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, తన నియోజకవర్గంలో మక్తల్, ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా, గతంలో తన నియోజకవర్గం లో ప్రతిపాదిత పవర్ ప్లాంట్‌కు సంబంధించిన భూ సమస్యను పరిష్కరించే దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజల భూ సమస్యలు, రెవెన్యూ అంశాలు, గృహ నిర్మాణ పథకాలకు సంబంధించిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రులు ఈ సందర్భంగా ఆదేశించారు.

బీసీ సంక్షేమానికి ప్రాధాన్యం

మొదటి పేజీ తరువాయి...

సైతం ఏ నెలకు ఆ నెల ఖచ్చితంగా విద్యార్థుల ఖాతాల్లోనే జమ చేయాలని అధికారులను ఆదేశించారు.

60 కోట్లతో 'కాటమయ్య రక్షణ కవచాలు'

గీత కార్మికుల సంక్షేమానికి ఉ ద్దేశించిన 'కాటమయ్య రక్షణ కవచాలు' పథకం కింద ఇప్పటివరకు 50 వేల మందికి కిట్స్ మంజూరు కాగా, ఇప్పటికే 40 వేల కిట్లను అందించినట్లు వివరించారు. ప్రస్తుతం శిక్షణ పొందుతున్న మరో 10 వేల మందికి కూడా శిక్షణ పూర్తయ్యాక కాటమయ్య రక్షణ కవచం కిట్లు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈ పథకం కోసం మొత్తం ?60 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు.

నవంబర్‌లో 'రాజీవ్ యువ వికాసం'

రాష్ట్రంలోని బీసీ నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి, ఉన్నతి కల్పించే లక్ష్యంతో రూపొందించిన 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని నవంబర్ నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఈ పథకానికి సంబంధించి స్వీకరించిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ల సమక్షంలో పారదర్శకంగా పరిశీలించి అర్హులైన వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని అధికారులను సూచించారు. ఎంజేపీ (మహాత్మా జ్యోతిబా పూలే) గురుకులాల్లో ఉన్న పెండింగ్ బిల్లులను త్వరలోనే క్లియర్ చేస్తామని డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు. గురుకుల విద్యాలయాలకు స్వంత భవనాలు మంజూరు చేయాలని ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేయగా, ఆ అంశాన్ని పరిశీలిస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ ఏడాది ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కింద మొదటి, రెండవ విడతల రూపంలో 180 మంది విద్యార్థులకు 18 కోట్ల 40 లక్షల నిధులను విడుదల చేశామని చెప్పారు. అర్హులైన విద్యార్థులందరికీ అవకాశం కల్పించేందుకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువును అక్టోబర్ 15 వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా, బీసీ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి కూడా త్వరలోనే నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

యంగ్ ఇండియా స్కూళ్ల నిర్మాణాలను పరుగులు పెట్టించండి

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్' భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేసి, ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రజాభవన్ లో సోమవారం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల భవన నిర్మాణ పురోగతిపై ఇంజనీరింగ్ విభాగం ఉన్నత స్థాయి అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్న ఈ పథకాన్ని త్వరితగతిన పూర్తి చేయడానికి ఇంజనీరింగ్ అధికారులు రాత్రింబవళ్లు శ్రమించి పనుల్లో పురోగతి చూపాలన్నారు. రాష్ట్రంలోని పేద విద్యార్థులకు కులమతాలకు అతీతంగా ఒకే ప్రాంగణంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నాణ్యమైన విద్యను, సకల సౌకర్యాలను అందించడమే ఈ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు.

బుల్లెట్ ట్రైన్‌కు వ్యతిరేకం కాదు

మొదటి పేజీ తరువాయి...

బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్‌లో భూములు కోల్పోతున్న బహదూర్‌పల్లి రైతులతో సోమవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్న కేటీఆర్, ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈసారి వస్తే మీ సెల్‌ఫోన్‌తో ఆ పోలీసోడి ఫొటో కొట్టండి.. మా కేసీఆర్ సార్ వస్తుండు.. మీ ఫొటో చూపెడ్తం అని చెప్పండి అని రైతులకు పిలుపునిచ్చారు. పోలీస్ స్టేషన్‌లో ఫొటోలు పెట్టాలంటే ఎవరివి పెట్టాలని ప్రశ్నించారు. రౌడీ షీటర్లు, లంగలు, దొంగలు, మాట ఇచ్చి మోసం చేసినవారి ఫొటోలు పెట్టాలని ఎద్దేవా చేశారు. తులం బంగారం ఇస్తామని చెప్పి మోసం చేస్తే వారి ఫొటోలు పోలీస్ స్టేషన్‌లో పెట్టాలన్నారు. 'ఆడవాళ్లందరికీ నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పి మోసం చేస్తే వారి ఫొటోలు పెట్టాలి. అత్తలకు రూ.4 వేలు, కోడళ్లకు రూ.2,500 ఇస్తామని లంగమాటలు చెప్పి ఓట్లు వేయించుకుంటే వారి ఫొటోలు పెట్టాలి. రైతులకు రూ.15 వేలు ఇస్తామని కథలు చెప్పి మోసం చేసి ఓట్లు వేయించుకుంటే వారి ఫొటోలు పెట్టాలి' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో అందరికీ పట్టాలిస్తామని చెప్పారా? లేదా? అని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. గతంలో ఇందిరమ్మ ఇచ్చిన భూములను ఇప్పుడు మళ్లీ ఇస్తామని చెప్పారని, పట్టాలు ఇవ్వాల్సిన వ్యక్తి మోసం చేస్తే పోలీస్ స్టేషన్‌లో ఆయన ఫొటో పెట్టాలా? లేక రైతుల ఫొటోలు పెట్టా లా? అని నిలదీశారు. 420 హామీలు, 420 మాటలు చెప్పి గెలిచి గద్దెనెక్కి ఇవాళ గద్దలెక్క ప్రవర్తిస్తున్నోడి ఫొటో పోలీస్‌స్టేషన్‌లో పెట్టాలన్నారు. రైతుల భూముల విషయం లో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు.

రైతుల ఇండ్ల మీదికి ఏదో పక్క దేశం మీద దండయాత్రకు పోయినట్టు 4 వేల మంది పోలీసోళ్లను పం పారని, నిజంగా నీతి, నిజాయితీ ఉంటే నీ దగ్గర, ప్రభుత్వం దగ్గర కాగితాలుంటాయి.. 4 వేల మంది పోలీసులను పంపే అవసరం ఏముంది? అని ప్రశ్నించారు. ప్రభుత్వం వద్ద భూములకు సంబంధించిన పత్రాలు ఉంటే వాటిని రైతులకు చూపించాలన్నారు. నిజంగా ప్రభుత్వం వద్ద కాగితాలు ఉంటే, భూమి తమదేనన్న విషయం స్పష్టంగా ఉంటే, ఇంతమంది పోలీసులను ఎందుకు పంపాల్సి వచ్చిందని ప్రశ్నించారు. రైతుల భూముల విషయంలో ప్రభుత్వం వద్ద ఉన్న ఆధారాలను బహిరంగంగా చూపించాలని డిమాండ్ చేశారు.

ఆ బాధ్యత నాదే...

రైతులకు పట్టాలు ఇవ్వకపోతే రాళ్లతో కొట్టాలని ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ గతంలో చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ ప్రస్తావించారు. మీకు పట్టాలివ్వకపోతే రాళ్లతో కొట్టమని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అంటే.. రేవంత్ రెడ్డి ఏమో ఎమ్మెల్యేలు పార్టీ మారితే రాళ్లతో కొట్టుమన్నడని గుర్తు చేశారు. మరి ఇప్పుడు ఎవరిని కొట్టాలి? రేవంత్ రెడ్డిని రాళ్లతో కొట్టాలా? ప్రకాశ్ గౌడ్‌ను కొట్టాలా? అని ప్ర శ్నించారు. రైతులకు ఇచ్చిన హామీలను ప్ర భుత్వం నిలబెట్టుకోవాలని, భూముల సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చే శారు.

ప్రజల ఆశీర్వాదంతో సంవత్సరం తర్వాత కేసీఆర్ సీఎంగా వస్తారని, బహదూర్గూడలోనే మీటింగ్ పెట్టి, ఇదే కార్తీక్ రెడ్డి ఎమ్మెల్యేగా మీకు పట్టాలిస్తరు అని వెల్లడించారు. రైతుల తరఫున హైకోర్టుకు వెళ్లి న్యా యం కోసం పోరాడిన కార్తీక్ రెడ్డి ప్రస్తావిస్తూ, ఏ కార్తీక్ రెడ్డి అయితే ఇవాళ హైకో ర్టుకు పోయి మీకు న్యాయం చేసిండో.. ఇదే కార్తీక్ రెడ్డి చేతుల మీదుగా మీకు పట్టాలిప్పించే బాధ్యత నాది అని కేటీఆర్ హామీ ఇచ్చారు. బహదూర్‌పల్లి రైతుల భూముల సమస్య పరిష్కారం కోసం బీఆర్ఎస్ వారి తరఫున నిలబడుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు, వారి పక్షాన పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య



గొల్లపల్లి సెప్టెంబర్ 28 ప్రజా కలం ప్రతినిధి గొల్లవల్లి మండలంలోని శంకర్రావుపేట గ్రామానికి చెందిన గాజుల లత 48 బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు గత కొన్ని సంవత్సరాలుగా క్యాన్సర్ తో బాధ పడుతూ జీవితంపై విరక్తి చెంది సోమవారం ఉదయం వారి వ్యవసాయ బావి లో దూకి ఆత్మహత్య చేసుకోగా మృతురాలు తమ్ముడు గోలి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



జగిత్యాల ప్రతినిధి సెప్టెంబర్ 28 (ప్రజాకలం) : గ్రీవెన్స్ డే సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 14 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఫిర్యాదులపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఎస్పీ.. తక్షణమే చర్యలు తీసుకొని బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడంతో పాటు ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి, వారి వినతులను స్వీకరించాలని సూచించారు. ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి వేగంగా స్పందిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

- మండల వ్యవసాయ అధికారి రాజ్ కుమార్


ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 28(ప్రజా కలం ప్రతినిధి)

ఇబ్రహీంపట్నంమండలపరిధిలోని ఎరువుల విక్రయ కేంద్రాలను మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ నందర్భంగా దుకాణాల్లోని ఎరువుల భౌతిక నిల్వలు, ఈపాస్ నిల్వలు, విక్రయ రికార్డులు మరియు స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎరువుల డీలర్లకు పలు ముఖ్యమైన సూచనలు చేశారు.ప్రతి ఎరువు విక్రయాన్ని తప్పనిసరిగా ఈపాస్ లో నమోదు చేసి విక్రయించాలి. ఈపాస్ లో విక్రయం నమోదు చేసిన ప్రతి లావాదేవీకి నిబంధనల ప్రకారం బిల్లు/ఫారమ్-యమ్ జారీ చేయాలి. ప్రభుత్వం అనుమతించిన అధీకృత ఎరువులను మాత్రమే విక్రయించాలి.ఎరువుల స్టాక్ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు సక్రమంగా నవీకరించాలి.ఈపాస్ లో చూపించే నిల్వలు మరియు దుకాణంలో ఉన్న భౌతిక నిల్వలు సరిపోలేలా చూసుకోవాలి.ఎరువుల విక్రయానికి సంబంధించిన రికార్డులు, బిల్లులు మరియు ఇతర పత్రాలను సక్రమంగా నిర్వహించాలి. ఎరువుల విక్రయంలో నిబంధనలను ఉల్లంఘించినట్లు గుర్తించిన పక్షంలో సంబంధిత డీలర్లపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి హెచ్చరించారు. రైతులకు ఎరువులు సక్రమంగా, పారదర్శకంగా అందేలా డీలర్లు వ్యవసాయ శాఖ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు

ఆధారాలు ఉన్నాయి నిరూపిస్తే రాజీనామా చేస్తావా

బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ కు సవాలు విసిరిన 6వవార్డ్ కౌన్సిలర్ సల్ల కృష్ణవేణి....

బెల్లంపల్లి టౌన్, సెప్టెంబర్ 28, (ప్రజాకలం) ప్రతినిధి..బెల్లంపల్లి పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం బీఆర్ఎస్ కౌన్సిలర్స్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కౌన్సిలర్ సల్ల కృష్ణవేణి మాట్లాడుతు



ఛైర్పర్సన్ దావ స్వాతి రమేష్ ప్రెస్ మీట్ నిర్వహించి తన పై తప్పుడు ఆరోపణలు చేశారు . వారికి ఎట్టి పరిస్థితిలో కూడా క్షమాపణ చెప్పనని ,ఆమెకు నేనే సవాల్ విసిరుతున్నాను... వారు ఏదైతే కక్షపూరితంగా మా పై చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు సమర్పిస్తానని ఒకవేళ ఆధారాలతో నీరూపిస్తే మున్సిపల్ చైర్ పర్సన్ పదవికి ఆమె రాజీనామా చేస్తారా, నిరూపించకుంటే నా కౌన్సిలర్ పదవికి రాజీనామా చేస్తానని మీడియా ముఖంగా సవాల్ విసిరారు. తాను ఆర్పి గా విధులు నిర్వహిస్తుండగా 10 లక్షల రూపాయలు దుర్వినియోగం చేశానని చేసిన ఆరోపణ లో ఎలాంటి నిజం లేదన్నారు.జస్ట్ కౌన్సిలర్ అని సంబోధించినప్పుడు ఆమె కూడా ఒక కౌన్సిలర్ అని,పలు కౌన్సిలర్స్ మద్దతు తో చైర్ పర్సన్ గా ఎన్నికవ్వడం మరిచిందా,ఇటీవల నేను ఏదైతే ప్రెస్ మీట్ ద్వారా తెలిపానో ప్రతిదానికి ఆధారాలు ఉన్నాయని, నిజాని నిర్ధయంగా అందరి ముందు చెప్పడానికే ప్రెస్ మీట్ నిర్వహించామన్నారు.ఒక ఆర్పి కోసం బిఆర్ఎస్ కౌన్సిలర్స్ ఆమె వెంట ఎందుకు ఉన్నారని మున్సిపల్ చైర్ పర్సన్ దావా స్వాతి చేసిన వ్యాకలను ఖండిస్తూ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్స్, ఒక ఆర్పి కోసమే కాదు ప్రజలకు ఎవరికి సమస్య ఏర్పడ్డ వారికి మద్దతుగా నిలుస్తారన్నారు.... ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, బిఆర్ఎస్ టౌన్ ప్రెసిడెంట్ నూనేటి సత్యనారాయణ, కౌన్సిలర్స్, నాయకులు పాల్గొన్నారు....

ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి

త్వరగా పరిష్కరించాలి



- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల జిల్లా//ప్రజాకలం జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 28 ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జైపూర్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన సుందిళ్ల రాజయ్య తనకు చెందిన పట్టా భూమి నిషేధిత జాబితాలో ఉందని, సవరించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కవ్వాల్ ఫిషర్మెన్ కో- ఆపరేటివ్ సొసైటీ సభ్యులు తమ సంఘంలో అనర్హులను తొలగించి అర్హత కలిగిన వారికి సభ్యత్వం కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాసిపేట మండలం కోమటిచేను గ్రామానికి చెందిన జాడి అనసూర్య తన భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కొరకు దరఖాస్తు చేసుకున్నానని, కాగా తన దరఖాస్తు కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాకు వెళ్లిందని, మంచిర్యాల జిల్లాకు మార్పు చేసి పథకం ప్రయోజనం అందించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి పట్టణంలోని అంబేద్కర్ నగర్ కు చెందిన ఆలేటి భాగ్యలక్ష్మి తనకు ఇందిరమ్మ ఇల్లు పథకం వర్తింపచేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాజీపేట మండలం సోమగూడెం ట్యాంక్ బస్తీకి చెందిన భుఖ్య జ్యోతి కాజీపేట ఓపెన్ కాస్ట్ లో తన భూమి కోల్పోయానని, ఎంజాయ్మెంట్ సర్వేలో తన పేరు వచ్చినప్పటికీ కొందరు వ్యక్తులు తన పేరును తొలగించారని, ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. దండేపల్లి మండలం రెబ్బెనపల్లి గ్రామానికి చెందిన తౌట సువర్ణ తనకు గ్రామ శివారులో భూమి ఉందని, రిజిస్టర్డ్ కొనుగోలు దస్తావేజు ద్వారా నేను కొనుగోలు చేసిన భూమిని కొందరు అక్రమంగా ఆక్రమించుకుని దౌర్జన్యానికి పాల్పుడుతున్నారని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దండేపల్లి మండలం మేదరిపేట గ్రామానికి చెందిన షేక్ తాజుద్దీన్ తమ గ్రామంలోని బస్టాండు సమీపంలో అమర్చిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ కు సంబంధించి విద్యుత్ తీగలు తెగిపడడం, అగ్గి రవ్వలు రావడంతో స్థానిక ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. చెన్నూర్ మండలం కొమ్మెర గ్రామానికి చెందిన నోముల సుప్రజ తాను ఎం పి హెచ్ డబ్ల్యు పూర్తి చేశానని, తనకు చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్య కార్యకర్తగా ఉపాధి అవకాశం కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణం జాఫర్ నగర్ ప్రాంతానికి చెందిన నసీం బేగం తన ఇంటి ప్రాంతంలో పారిశుధ్యం, మురుగు కాలువ శుభ్రతపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. నస్పూర్ మండలం శ్రీరాంపూర్ కు చెందిన బొడ్డుపల్లి రజిత తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరై చివరి విడత ఫోటో అప్లోడ్ చేయడం జరిగిందని, బిల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హత గల లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో 49 దరఖాస్తులు అందాయని, ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

భగత్ సింగ్ 119వ జయంతి వేడుకలు



ధర్మారం, సెప్టెంబర్ 28 : (ప్రజా కలం ప్రతినిధి) మండల కేంద్రం లో పీపుల్స్ యువసేన 892/2025 సర్వ్ టు సొసైటీ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యం లో భగత్ సింగ్ 119వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. దేశ స్వాతంత్ర చరిత్ర లో తనదైన ఆలో చనలతో ప్రత్యేకమైన ఆచరణ తో ప్రజలను యువతను ప్రేరేపించి స్వాతంత్ర చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న టువంటి విప్లవ వీరుడు భగత్ సింగ్ అని, భగత్ సింగ్ సమ సమాజ స్థాపన కోసం అన్యాయాన్ని ఎదిరించి, దేశ ప్రజలందరూ సమాన అవకాశాల తో ఎదగాలని నిరంతరం తను నమ్ముకున్న సిద్ధాంతాలతో నవనిర్మాణం స్థాపన కోసం, దేశ స్వాతంత్రం కోసం తన ప్రాణాన్ని సైతం త్యాగం చేసినటువంటి గొప్ప త్యాగధనుడు అని, భగత్ సింగ్ ఆలోచనలకు ఆశయాలకు అడుగులు వేయాల్సిన బాధ్యత ప్రతి యువతలో ఉందని పీపుల్స్ యువసేన అధ్యక్షులు సంజీవరావు వివరిస్తూ, ఈ సందర్భంగా యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలనే ఉద్దేశంతో గంజాయి వద్దు-గ్రంథాలయాలు ముద్దు, మద్యం మత్తు పదార్థాలను వీడండి- మైదానాలకు చేరువకండి అనే సందేశం తో భగత్ సింగ్ జయంతి సందర్భంగా ధర్మారం పట్టణ కేంద్రంలో 2 కే రన్ నిర్వహించి విజేతల కు బహుమతులను అందించడం జరిగింది. ఈ కార్యక్రమం లో పీపుల్స్ యువసేన వ్యవస్థాపకులు అధ్యక్షులు మేకల సంజీవ రావు, యువసేన సభ్యులు కొమురయ్య, తిరుపతి, సిద్దు, మహేష్, నాగరాజు, రంజిత్ సామజిక కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

76 జీవోని వెంటనే ప్రారంభించాలి

సింగరేణి స్థలాలో నివాసముంటున్న అర్హులకు శాశ్వత ఇంటి పట్టాలు అందచేయాలి: బెల్లంపల్లి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్....



బెల్లంపల్లి టౌన్, సెప్టెంబర్ 28, (ప్రజాకలం) ప్రతినిధి..

గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో బెల్లంపల్లి లోనీ సింగరేణి స్థలాలలో నివాసముంటున్న అర్హులకు 76జీవో ద్వారా శాశ్వత ఇంటి పట్టాలు అందించామని ,అప్పుడు ఉన్న పరిస్థితుల్లో ఇంటి మరమ్మత్తులు చేయడానికి కూడా సింగరేణి వారికి భయపడే పరిస్థితిలో ప్రజలు ఉండేవారని.ఈ విషయంపై అప్పుడున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లగా 76 జీవో ద్వారా సింగరేణి స్థలాలో నివాసము ఉంటున్న ప్రజలకు శాశ్వత ఇంటి పట్టాలు అందించామని బెల్లంపల్లి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్ పేర్కొన్నారు.బెల్లంపల్లి పట్టణంలో ఈ మధ్యకాలంలో ఇంటి నిర్మాణం చేపడుతున్న ఒకరిపై 5లక్షల79 వేల పెనాల్టీ వేసి మున్సిపల్ అధికారులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. బెల్లంపల్లిని అభివృద్ధి చేయకుండా ఇలాంటి చర్యలు తీసుకోవడం సరికాదన్నారు.. బెల్లంపల్లి సింగరేణి స్థలాల్లో నివాసముంటున్న 7000 మంది 76 జీవో ద్వారా శాశ్వత పట్టాల కోసం దరఖాస్తు చేసుకోగా,4000 మంది అర్హులకు బిఆర్ఎస్ ప్రభుత్వంలో పట్టాలు అందచేశామన్నారు.3000 మంది దరఖాస్తు చేసుకొని శాశ్వత పట్టాల కోసం వేచి ఉన్నారన్నారు.. వెంటనే 76 జీవోనీ,58,59 జీవోలను ప్రారంభించి అర్హులైన ప్రతి ఒక్కరికి శాశ్వత ఇంటి పట్టాలు అందచేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ అధికారులు ఇంటి నిర్మాణం చేపడుతున్న ప్రజలపై పెద్ద మొత్తంలో జరిమానా వేస్తుంటే ప్రజా ప్రతినిధులు ప్రజల పక్షాన ఉండాలి కానీ,అధికారులకు మద్దతు పలుకుతూ ప్రజలను భయాందోళనలకు గురిచేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ బెల్లంపల్లి టౌన్ ప్రెసిడెంట్ నూనేటి సత్యనారాయణ, నాయకులు, కౌన్సిలర్స్ పాల్గొన్నారు.


వరంగల్ విమానాశ్రయానికి దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలి



మెట్పల్లి టౌన్ ప్రతినిధి సెప్టెంబర్ 28 (ప్రజాకలం): వరంగల్ అంతర్జాతీయ విమానాశ్రయానికి తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య పేరు నామకరణం చేయాలని కోరుతూ కురుమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కురుమ సంఘం రాష్ట్ర నాయకులు కోట రమేష్ మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి, తొలి తూటాలకు ఎదురొడ్డి తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడైన దొడ్డి కొమురయ్య పేరును వరంగల్ అంతర్జాతీయ విమానాశ్రయానికి పెట్టాలని కోరారు. ఆయన త్యాగాన్ని తెలంగాణ ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకునేలా ఈ నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు కోట నర్సింలు, గడ్డం మల్లేశ్, కోట కుమార్, ముద్దుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



జగిత్యాల ప్రతినిధి సెప్టెంబర్ 28 (ప్రజాకలం): ప్రజావాణి ద్వారా ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులు, వినతులపై సమగ్ర విచారణ జరిపి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుంచి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతాయుతంగా తీసుకుని, సంబంధిత సమస్యపై సమగ్ర విచారణ జరిపి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, దరఖాస్తుదారులకు సమస్య పరిష్కారంపై తగిన సమాచారం అందించాలని తెలిపారు. ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈరోజు నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 62 ఫిర్యాదులు, వినతులు అందాయి. వాటిని సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.కార్యక్రమంలో డీఆర్వో కె. వై. ప్రసాద్, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

- ధర్మపురి జూనియర్ సివిల్ జడ్జ్ వై. జానకి
- రూ. 5 లక్షల లోపు చెక్ బౌన్స్ కేసుల సత్వర పరిష్కారమే లక్ష్యం
- ధర్మపురి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులతో సమావేశం



ధర్మపురి, ప్రతినిధి సెప్టెంబర్ 28(ప్రజా కలం) : రాబోయే అక్టోబర్ 17వ తేదీన నిర్వహించనున్న ప్రత్యేక లోక్ అదాలత్‌ను అందరూ కలిసి విజయవంతం చేయాలని ధర్మపురి జూనియర్ సివిల్ జడ్జ్ వై. జానకి పిలుపునిచ్చారు. సోమవారం ధర్మపురి కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ న్యాయవాదులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జ్ వై. జానకి మాట్లాడుతూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా రూ. 5 లక్షల లోపు ఉన్న చెక్ బౌన్స్ కేసులను ఇరుపార్టీలు పరస్పర సమన్వయంతో, తమ న్యాయవాదుల సహకారంతో రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సద్వినియోగాన్ని కక్షిదారులు ఉపయోగించుకునేలా న్యాయవాదులు చొరవ చూపాలని కోరారు. ఈ సమావేశంలో ధర్మపురి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామడుగు రాజేష్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఇమ్మడి శ్రీనివాస్, సీనియర్ న్యాయవాదులు రౌతు రాజేష్, అలుక వినోద్ కుమార్, అప్పల నిరంజన్, అలాగే ఇతర న్యాయవాదులు కస్తూరి శరత్, హరిప్రసాద్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

లిల్లిపూల సాగును పరిశీలించిన

ఉద్యానవన శాఖ అధికారి అర్చన

గొల్లపల్లి సెప్టెంబర్ 28 ప్రజాకలం ప్రతినిధి

గొల్లపల్లి మండలంలోని ఇబ్రాహీంనగర్ గ్రామంలో లిల్లీ పూల సాగును సోమవారం ఉద్యానవన శాఖ అధికారి అర్చన పరిశీలించారు. ఎల్ నీ నో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని ఉద్యానవన శాఖ అధికారి అర్చన సలహా మేరకు రైతు నరసాని హన్మాంతరెడ్డి 20 గుంటలలో లిల్లీ పూల సాగును చేశారు.రైతు హన్మంతా రెడ్డి చేస్తున్న లిల్లీ పూల తోట సాగుకు నబ్సిడీ కింద 17000 రూపాయలను ప్రోత్సాహం అందించారు. 20 గుంటల లిల్లీ పూల సాగుకి లక్ష రూపాయలు ఆదాయం సమకూరినట్లు రైతు తెలిపారు.రైతులు ప్రత్యామ్నాయ పంటల పై దృష్టి పెట్టి ఆదాయం పెంచుకోవాలని సూచించారు.



ప్రజావాణి ఫిర్యాదులు తక్షణమే చర్యలు చేపట్టాలి

- ఇబ్రహీంపట్నం ఎంపీడీవో గణేష్..

ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 28(ప్రజా కలంప్రతినిధి) తెలంగాణ ప్రభుత్వం ప్రజల సమస్యలను స్థానిక స్థాయిలోనే త్వరితగతిన పరిష్కరించేందుకు చేపట్టిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం ఈ రోజు ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయం, ఇబ్రహీంపట్నం నందు నిర్వహించబడింది. ప్రజల నుండి 2 వరకు వినతులులను స్వీకరించడం జరిగింది. ఇట్టి వినతులు దేవాదయ శాఖ డిపార్ట్మెంట్ కి 1, హోసింగ్ డిపార్ట్మెంట్ కి - 1 చొప్పున వచ్చాయి. వాటిని సంబంధిత శాఖలకు పంపడం జరిగింది. వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ చెప్పు గణేష్ అదేశించారు.. ఈ కార్యక్రమంలో మండల స్థాయిలో గల వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రజా కలం
మంగళవారం, సెప్టెంబర్ 29, 2026

మంత్రులకు అసలైన అగ్ని పరీక్ష

న్యూఢిల్లీలోని ప్రధానమంత్రి కార్యాలయం సేవా తీర్థ్ వేదికగా కేంద్ర మంత్రులందరితో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల పాటు నిర్వహించిన ఉన్నత స్థాయి మేధోమథన సదస్సు హాట్ టాపిక్ అయింది. ఎన్డీయే-3 ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పూర్తి స్థాయి మంత్రుల మండలితో ప్రధాని ఇంతటి సుదీర్ఘ అంతర్గత సమీక్ష నిర్వహించడం ఇదే ప్రథమం. కేవలం విధానపరమైన నిర్ణయాలకే పరిమితం కాకుండా.. గత కొన్ని నెలలుగా వివిధ మంత్రిత్వ శాఖల పనితీరు, ప్రజా సమస్యల పరిష్కారంలో చూపిస్తున్న వేగం, వికసిత్ భారత్ రోడ్‌మ్యాప్ అమలుపై మోదీ లోతుగా సమీక్షించారు. కేంద్ర మంత్రులను ఎనిమిది ప్రత్యేక బృందాలుగా విభజించి, ప్రతి గ్రూపుతో విడివిడిగా సంభాషిస్తూ క్షేత్రస్థాయి ఫలితాలు ఎలా ఉన్నాయో కూలంకషంగా ఆరా తీశారురెండు రోజుల మేధోమథన సదస్సు ప్రధానంగా పరిపాలనా సంస్కరణలు, ప్రజా సంక్షేమ పథకాల డెలివరీ మెకానిజం చుట్టూనే తిరిగింది. బ్యూరోక్రసీపై పూర్తిగా ఆధారపడటం మానుకోవాలని, మంత్రులు స్వయంగా ప్రాజెక్టుల పురోగతిని పర్యవేక్షించాలని మోదీ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. యువత, మహిళలకు ఉద్దేశించిన కేంద్ర ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయికి ఎంతవరకు చేరుతున్నాయన్న దానిపై గ్రౌండ్ రిపోర్టులు తెప్పించుకుని పరిశీలించారు. శాఖల మధ్య సమన్వయ లోపం ఉండకూడదని, ఫైళ్ల క్లియరెన్స్‌లో జాప్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు. తాజా సమీక్షలో పలువురు మంత్రుల పనితీరు ఆశాజనకంగా లేదని తేలడంతో పాటు, కొందరి పోర్ట్‌ఫోలియోల్లో ఆశించిన వేగం కనిపించలేదన్న నివేదికలను ప్రధాని నేరుగా వారి ముందే ఉంచినట్లు సమాచారం.ఈ భారీ కసరత్తు పూర్తవడంతో కేంద్ర కేబినెట్‌లో ఎవరిని ఉంచాలి? ఎవరిని సాగనంపాలి? అనే అంశంపై ప్రధాని మోదీ, అమిత్ షా, బీజేపీ జాతీయ నాయకత్వానికి ఒక స్పష్టమైన క్లారిటీ వచ్చినట్లు చెబుతున్నారు. గత ఎన్నికల తర్వాత కూటమి భాగస్వామ్యాల లెక్కలతో ఏర్పడిన మంత్రివర్గంలో కొందరికి అదనపు బాధ్యతలు ఉండగా, మరికొందరు ఆశించిన స్థాయి పనితీరును కనబరచలేకపోయారు. రాబోయే పలు కీలక రాష్ట్రాల శాసనసభ ఎన్నికల సమీకరణాలు, సామాజిక సమతుల్యత, పాలనా సామర్థ్యమే గీటురాయిగా మంత్రుల ర్యాంకింగ్‌లు, రిపోర్ట్ కార్డులను సిద్ధం చేశారు. ఆశించిన ఫలితాలు ఇవ్వని పలువురు మంత్రులను కేబినెట్ నుంచి తప్పించి పార్టీ సంస్థాగత బాధ్యతలకు పరిమితం చేయవచ్చని తెలుస్తోందికేంద్ర మంత్రివర్గంలో పెను మార్పులు, చేర్పులు త్వరలోనే ఉండబోతున్నాయన్న సంకేతాలు బలంగా కనిపిస్తున్నాయి. దాదాపు 15 నుంచి 17 కొత్త ముఖాలకు కేబినెట్ లేదా సహాయ మంత్రుల హోదాలో చోటు కల్పించవచ్చని, యువ నాయకత్వానికి ప్రాధాన్యత ఇస్తూనే పనితీరు బాగున్న కొందరు సహాయ మంత్రులకు పదోన్నతులు కల్పించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. సంస్కరణల అమలు, వికసిత్ భారత్-2047 ప్లాన్ అమలుపై సమీక్ష నిర్వహించి,, కీలక నిర్ణయాలు తీసుకునేందుకు ఈ చింతన్ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. అలాగే జాతీయ స్థాయిలో తాజా రాజకీయ పరిణామాలు, మంత్రుల పనితీరు సమీక్ష, భవిష్యత్ ప్రణాళికలు రూపొందించడం, ప్రభుత్వ ప్రాధాన్యతలు మార్చుకోవడంపై ఫోకస్ చేసే అవకాశం ఉంది. మరోవైపు విజన్-2047 స్వల్పకాలిక, దీర్ఘకాలిక రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేయడానికి రంగాల వారీగా 10 కార్యదర్శుల బృందాలను ఇప్పటికే ఏర్పాటు చేసిన ప్రధాని మోడీ.. వాటిపై ఇవాళ మరోసారి ప్రజంటేషన్లు తీసుకునే అవకాశం ఉంది. అలాగే జంతర్ మంతర్ ఆందోళనల తర్వాత మంత్రుల పనితీరుపై ప్రధాని మోడీ రెగ్యులర్ గా సమీక్షలు నిర్వహిస్తున్నారు. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండాలని కోరుతున్నారు. అంతే కాదు వీటిపైనా నివేదికలు తెప్పించుకుంటున్నారు. తాను కూడా స్వయంగా సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. తాజా నివేదికల ఆధారంగా మంత్రుల పనితీరును ప్రధాని కొలవబోతున్నారు. అలాగే దీంతో పాటు రాబోయే రోజుల్లో మరిన్ని చింతన్ శిబిర్ లు కూడా ఏర్పాటు చేస్తామని సంకేతాలు ఇస్తున్నారు. ఇవన్నీ అంతిమంగా కేబినెట్ లో మార్పులపై మంత్రుల్లో వస్తున్న వ్యతిరేకతను వాడుకుంటూ ప్రక్షాళనకు ప్రధాని దారులు తెరుస్తారనే చర్చ కూడా జరుగుతోంది. అదే జరిగితే త్వరలో చేపట్టే కేబినెట్ ప్రక్షాళనపై చింతన్ శిబిర్ రిపోర్టుల ప్రభావం కూడా ఉండబోతోంది. సమయంలో కీలక భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, జేడీయూలతో పాటు ఇతర ఎన్డీయే మిత్రులకు ప్రాతినిధ్యం పెంచడం లేదా అదనపు శాఖలు కేటాయించే కసరత్తు కూడా కొలిక్కి వచ్చినట్లు సమాచారం. ఈ చింతన్ శివిర్ కేవలం సమీక్ష మాత్రమే కాదని, మోదీ మార్క్ నిర్దాక్షిణ్య ప్రక్షాళనకు వేసిన బలమైన పునాది అని గట్టిగానే గుసగుసలు వినిపిస్తున్నాయి.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం



- అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు

పెద్దపల్లి,సెప్టెంబర్ 28:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

మాదకద్రవ్యాల మహమ్మారి బారిన పడకుండా యువతను కాపాడుకోవాలని,డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు పేర్కొన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన జిల్లా స్థాయి నార్కోటిక్ కోఆర్డినేషన్ సెంటర్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు మాట్లాడుతూ సరదాగా మొదలయ్యే చెడు అలవాట్లు చివరికి వ్యక్తిగత జీవితాన్ని, కుటుంబాన్ని,సమాజాన్ని పూర్తిగా నాశనం చేస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగంపై నిరంతరం నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు.ఎక్కడైనా గంజాయి సాగు గుర్తిస్తే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు,వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందకుండా చర్యలు తీసుకోవాలని,డ్రగ్స్ విక్రయం,కొనుగోలు,నిల్వ అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసు,ఎక్సైజ్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలి.అన్ని చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండి వాహనాల తనిఖీలను ముమ్మరం చేయాలని అన్నారు.మాదకద్రవ్యాలకు సంబంధించిన ప్రతి సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లోనమోదు చేయాలని,పాఠశాలలు, కళాశాలలు,హాస్టళ్లు,రవాణా కేంద్రాల వద్ద తరచూ తనిఖీలు నిర్వహించడంతో పాటు,విద్యార్థులకు డ్రగ్స్ దుష్పరిణామాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలి.పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.డ్రగ్స్‌కు బానిసైన వారు రామగుండం ప్రభుత్వ ఆసుపత్రిలోని డీ-అడిక్షన్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇక్కడ చికిత్స పొందే రోగుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని, మాదకద్రవ్యాల విక్రయం,అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు లేదా అధికారులకు సమాచారం అందించాలని కోరారు.సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని,డ్రగ్స్ నిర్మూలనలో ప్రజల సహకారం ఎంతో కీలకమని ఆయన స్పష్టం చేశారు.అనంతరం నషా ముక్తి భారత్ అభియాన్ పోస్టర్ జిల్లా అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు కలిసి ఆవిష్కరించారు.ఈ సమావేశంలో పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య,సెక్షన్ పర్యవేక్షకులు ధీరజ్,జిల్లా వైద్య అధికారి వై.పవిత్ర,పోలీసు,ఎక్సైజ్,రెవెన్యూ శాఖల అధికారులు,తదితరులు,పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ విద్యాసంస్థలను పటిష్టంగా పర్యవేక్షించాలి

దసరా నాటికి రెండు జతల యూనిఫారాలు అందించాలి - రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



పెద్దపల్లి,సెప్టెంబర్ 28 (ప్రజాకలం జిల్లా ప్రతినిధి): రాష్ట్రంలోని పాఠశాల విద్యతో పాటు ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల పరిధిలోని రెసిడెన్షియల్ విద్యాసంస్థలను నిరంతరం పర్యవేక్షిస్తూ,విద్యార్థులకు అన్ని రకాల వసతులు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.సోమవారం రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణ, విద్యార్థుల సౌకర్యాలపై కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పెద్దపల్లి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ విద్యార్థుల భద్రత,ఆరోగ్యం, విద్య,మౌలిక వసతులపై కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించి,క్రమం తప్పకుండా ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని సూచించారు.ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటున్నప్పటికీ అక్కడక్కడా ఆహార విషబాధ,పాముకాటు,ఎలుకలు కరవడం వంటి ఘటనలు జరగడంపై ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారని గుర్తు చేస్తూ, ఇలాంటివి పునరావృతం కాకుండా కఠిన ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.ఆహార తయారీ,నిల్వల్లో ప్రామాణిక నిబంధనలు పాటిస్తూ నాణ్యత,పారిశుధ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన చోట వంటశాలలను వెంటనే ఆధునీకరించాలని స్పష్టం చేశారు.క్షేత్రస్థాయి సమస్యలు, పరిష్కారాలను ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, ప్రతికూల నివేదికలు వస్తే తక్షణమే విచారణ జరిపి తప్పుడు ప్రచారాలపై చర్యలు తీసుకోవాలని, నిజమైన సమస్యలను వెనువెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వం ఇప్పటికే డైట్ ఛార్జీలను పెంచి, కాస్మెటిక్ ఛార్జీలను డీబీటీ ద్వారా అందిస్తోందని తెలిపారు. రానున్న శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు స్నానానికి వేడి నీరు,తగినన్ని దుప్పట్లు ముందుగానే సమకూర్చాలని,అద్దె భవనాల మరమ్మతులపై యజమానులతో మాట్లాడాలని, ఉపాధ్యాయులకు తగిన శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు.ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రోజూ లక్ష యూనిఫారాలు కుట్టేలా చర్యలు తీసుకుంటూ,దసరా నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫారాలు అందేలా పనులను వేగవంతం చేయాలని పేర్కొన్నారు.ఈ సమీక్షా సమావేశంలో డీఈవో శారద,ఎస్సీ సంక్షేమ అధికారి ఎం.రవీందర్,బీసీ గురుకులాల కోఆర్డినేటర్ మణిదీప్తి, జీసీడీవో కవితతో పాటు సాంఘిక,మైనారిటీ, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల అధికారులు శ్రీనాథ్, భాగ్యలక్ష్మి,శ్రీలత,అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై విద్యార్థులు దృష్టి సారించాలి



- మెట్ పల్లిలో క్రీడా అవగాహన ర్యాలీ

మెట్ పల్లి టౌన్ ప్రతినిధి సెప్టెంబర్ 28 (ప్రజాకలం):- విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై కూడా దృష్టి సారించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని మెట్ పల్లి సీఐ బి. సురేష్ బాబు అన్నారు. జాతీయ అంతర్ జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ మీట్ లో భాగంగా నిర్వహించనున్న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలపై అవగాహన కల్పించేందుకు మెట్పల్లి పట్టణంలో సోమవారం క్రీడా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని సీఐ బి. సురేష్ బాబు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. తల్లిదండ్రులు పిల్లలను క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని కోరారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్య రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీయడమే లక్ష్యంగా జిల్లాస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 2న కోరుట్ల మినీ స్టేడియంలో జగిత్యాల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-16 బాలబాలికలకు వివిధ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు.
ఈ పోటీల్లో రన్నింగ్, జంప్స్, త్రోస్ తదితర విభాగాల్లో ప్రతిభను ప్రదర్శించే అవకాశం ఉంటుందని తెలిపారు. హైదరాబాద్‌లో నవంబర్ 14 నుంచి 16 వరకు జరగనున్న జాతీయ అంతర్ జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ మీట్ కు ప్రతిభావంతులైన క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 800 జిల్లాలకు చెందిన ప్రతిభావంతులైన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉందన్నారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు వివిధ జాతీయ క్రీడా అకాడమీలు, సాయి స్పోర్ట్స్ అకాడమీ తదితర సంస్థల్లో శిక్షణ పొందే అవకాశాలు లభిస్తాయని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
మెట్పల్లి పట్టణంలోని ప్రధాన పురవీధుల మీదుగా సాగిన ర్యాలీలో విద్యార్థులు "ప్రతి ఒక్కరూ ఆటలు ఆడాలి" అంటూ నినాదాలు చేస్తూ క్రీడలపై అవగాహన కల్పించారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు అక్టోబర్ 2న ఉదయం 7 గంటలకు కోరుట్ల మినీ స్టేడియంలో రిపోర్ట్ చేయాలని నిర్వాహకులు సూచించారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది గజెల్లి రాందాస్, క్రీడా ఉపాధ్యాయులు బి. కొమురయ్య, ఎం. ప్రశాంత్, కార్తీక్, సాగర్, వినోద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాటమయ్య కిట్లను సద్వినియోగం చేసుకోవాలి..



మల్లాపూర్, సెప్టెంబర్ 28 (ప్రజా కలం ప్రతినిధి): గౌడ కుల వృత్తిదారుల భద్రతకు ప్రభుత్వం అందిస్తున్న కాటమయ్య కిట్లను గౌడ సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. సోమవారం మల్లాపూర్ మండల కేంద్రంలో మండలంలోని గౌడ సంఘ సభ్యులకు కాటమయ్య కిట్లను పంపిణీ చేశారు.కిట్లలోని పరికరాల వినియోగం, వాటి ద్వారా కలిగే ప్రయోజనాలు, చెట్లపై కల్లు గీసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కాటమయ్య కిట్ శిక్షకులు సభ్యులకు అవగాహన కల్పించి, ప్రాక్టికల్‌గా శిక్షణ ఇచ్చారు. వృత్తి నిర్వహణలో భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై సింధు, ఎక్సైజ్ సిబ్బంది, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, కాటమయ్య కిట్ శిక్షకులు పాల్గొన్నారు. గౌడ సంఘం అధ్యక్షుడు ముద్దం శరత్ గౌడ్, మండల గౌడ సంఘం అధ్యక్షుడు మద్యం సత్యనారాయణ గౌడ్, గొట్టిపడత సత్య గౌడ్, పెరుమాండ్ల అర్జున్ గౌడ్, అలాల నరసయ్య, నాయని శేఖర్, ఏపూరి గంగారం, ఆకుల శ్రీనివాస్, గొట్టిపడుత శ్రీనివాస్, లక్ష్మీరాజం, రాజేందర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటిపై పెట్రోల్ పోసుకొని తనకుతాను నిప్పంటించుకొని వ్యక్తి మృతి

- మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ

ధర్మారం, సెప్టెంబర్ 28 : (ప్రజా కలం ప్రతినిధి) మండలంలోని దొంగతుర్తి గ్రామానికి చెందిన జుంజుపల్లి నారాయణ వయస్సు 60 సంవత్స రాలు అను



వ్యక్తి సోమవారం రోజున ఉదయం పూట తన ఇంటిలో తనకు తానుగా ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పు పెట్టుకుని ఆత్మ హత్య చేసుకున్నాడు. మృతుడు యొక్క భార్య 15 సంవత్సరాల క్రితం మనస్పర్ధలతో అతడికి దూరంగా ఉంటుంది మృతుడికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. ఇతడికి మూడు నెలల క్రితం ఆక్సిడెంట్ కాగా అట్టి దాని వలన తన కుడి కాలుకి ఇన్ఫెక్షన్ అయింది, అట్టి నొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు అని అతని కొడుకు అయినా రాజ్ కుమార్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ధర్మారం ఎస్సై ఎంబడి శ్రీకాంత్ తెలిపారు.

వ్యసనాలకు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు

- మైనారిటీ గురుకులంలో నషా ముక్త్ భారత్ అవగాహన సదస్సు

- జిల్లా ఆరోగ్య ప్రచార అధికారి ఏ.మధుసూదన్



పెద్దపల్లి,సెప్టెంబర్ 28:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) యువత ఎలాంటి మత్తు పదార్థాల బారిన పడకుండా దూరంగా ఉంటూ,ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని జిల్లా ఆరోగ్య ప్రచార అధికారి ఏ.మధుసూదన్ పిలుపునిచ్చారు.సోమవారం పట్టణంలోని తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ బాలికల గురుకుల పాఠశాల-1లో నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నివారణపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా ఆరోగ్య ప్రచార అధికారి ఏ.మధుసూదన్,ఎన్‌డీసీ జిల్లా కోఆర్డినేటర్ టీ.రాజేష్,పాఠశాల ప్రిన్సిపాల్ ఐ.భాగ్యలక్ష్మి విద్యార్థినులనుద్దేశించి ప్రసంగించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు చదువు,ఉజ్వల భవిష్యత్తు తీవ్రంగా ప్రభావితమవుతాయని వారు హెచ్చరించారు.విద్యార్థి దశ నుంచే లక్ష్యం వైపు అడుగులు వేయాలని,వ్యసనాలకు దూరంగా ఉంటూ తోటి వారికి కూడా అవగాహన కల్పించే బాధ్యత తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,సిబ్బంది,విద్యార్థినులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి

- సీపీఎం రాష్ట్ర నాయకుడు వీరయ్య

- ఘనంగా భగత్ సింగ్ జయంతి వేడుకలు

పెద్దపల్లి,సెప్టెంబర్ 28:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) చిన్న వయసులోనే దేశ విముక్తి,సమాజ మార్పు కోసం ప్రాణాలర్పించిన భగత్ సింగ్ ఆశయాలు నేటి యువతకు మార్గదర్శకం కావాలని,ఆయన కలలుగన్న ప్రజానుకూల పాలన కోసం ప్రతి ఒక్కరూ సామాజిక చైతన్యంతో ముందుకు సాగాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు వీరయ్య పిలుపునిచ్చారు.సోమవారం స్నేహసాహితీ గ్రంథాలయంలో కేవలం 23 ఏళ్ల పిన్న వయసులోనే దేశ స్వాతంత్ర్యం కోసం ఉరికొయ్యను ముద్దాడిన అమరవీరుడు భగత్ సింగ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి,ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన వీరయ్య మాట్లాడుతూ దేశ పరిస్థితులను,సమాజాన్ని చిన్న వయసులోనే లోతుగా అర్థం చేసుకున్న గొప్ప సామాజిక చింతనాపరుడు భగత్ సింగ్ అని, తాను నమ్మిన విలువల కోసం వెనుకంజ వేయకుండా ప్రాణాలర్పించిన నిజాయితీపరుడు,నిస్వార్థ త్యాగధనుడు ఆయనని కొనియాడారు.దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినప్పటికీ, భగత్ సింగ్ ఆశించిన విధంగా నేటికీ ప్రజల పట్ల పాలన కొనసాగకపోవడం బాధాకరమని పేర్కొంటూ,యువత ఆయన స్ఫూర్తితో సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం వెంకటేశం,పుట్ట రాజన్న,ఎరుకల పోచయ్య,ఎండీ రాజాఅలీ,రాజు,చారి,రవి తదితరులు పాల్గొన్నారు.



రైతుల సమస్యలు పరిష్కరించాలి

- భారతీయ కిసాన్ సంఘ్ డిమాండ్



మల్లాపూర్, సెప్టెంబర్ 28 (ప్రజా కలం ప్రతినిధి) రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో అలువాల శ్రీకాంత్‌కు రైతుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు.రైతులకు హామీ ఇచ్చిన రూ. 2 లక్షల రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, అర్హత ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ వర్తింపజేయాలని కోరారు. బ్యాంకు ఖాతాల మార్పుల కారణంగా రుణమాఫీ నగదు జమకాని రైతుల ఖాతాల్లో వెంటనే డబ్బులు జమ చేయాలని తెలిపారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందించడంతో పాటు అన్ని పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, కౌలు రైతులకు రైతుభరోసా కింద ఎకరాకు రూ. 15 వేల చొప్పున, భూమిలేని రైతు కూలీలకు ఏటా రూ. 12 వేల చొప్పున అందించాలని కోరారు.రైతు బీమా, పంటల బీమా, పశువుల బీమా పథకాలను పటిష్టంగా అమలు చేయాలని, ప్రతి పట్టాదారు రైతుకు రూ. 5 లక్షల బీమా కల్పించి, బీమా మొత్తాన్ని రూ. 10 లక్షలకు పెంచాలని కోరారు. పోడు, అసైన్డ్ భూములకు పట్టా హక్కులు కల్పించడంతో పాటు భూ సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

టీచర్ ఉద్యోగం ఇప్పిస్తానని మహిళకు

రూ.50 వేలు టోకరా..

- జిల్లా ఎస్పీకి బాధితురాలు ఫాతిమా ఫిర్యాదు

గొల్లపల్లి సెప్టెంబర్ 28, ప్రజాకలం, ప్రతినిధి : గొల్లపల్లి మండలంలోని చిల్వకోడూర్ గ్రామానికి చెందిన ఆలియా ఫాతిమాకి మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో టీచర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఓ వ్యక్తి తన వద్ద నుంచి రూ. 50 వేలు తీసుకొని ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేశాడని బాధితురాలు జగిత్యాల జిల్లా ఎస్పీకి సోమవారం ఫిర్యాదు చేసింది. గొల్లపల్లి మండలంలోని, చిల్వాకోడూరు గ్రామానికి చెందిన ఫాతిమా పీజీ, బీఈడీ పూర్తిచేసి ఉద్యోగం కోసం ఎదురు చూస్తుంది. అదే సమయంలో తన భర్త స్నేహితుడి ద్వారా ఉద్యోగం కోసం ఓ వ్యక్తిని సంప్రదించామని తెలిపింది. తన విద్యార్హతలను పరిశీలించిన సదరు వ్యక్తి తనకు మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో టీచర్ ఉద్యోగం ఇప్పిస్తానని దానికి గాను రూ.లక్ష ఖర్చు అవుతుందని తెలిపినట్లు తెలిపింది. అడ్వాన్స్ కింద ముందుగా రూ. 50 వేలు తీసున్నాడని, నాలుగేళ్లు గడిచినా తనకు ఉద్యోగం ఇప్పించలేదని, ఎన్ని సార్లు అడిగిన తాను ఇచ్చిన డబ్బులను తిరిగి చెల్లించకుండా, తనను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని పేర్కొంది. పోలీసులకు ఫిర్యాదు చేసిన, ఎవరికైనా చెప్పిన ఒక్క రూపాయి కూడా తిరిగి ఇవ్వనని బెదిరిస్తున్నాడని ఫాతిమా పేర్కొంది. తాను డబ్బులు చెల్లించిన విషయానికి సంబంధించిన ఫోన్ సంభాషణ రికార్డులు కూడా తన వద్ద ఉన్నాయని తెలిపింది. ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించడంతో డబ్బులు చెల్లించి మోసపోయానని, డబ్బులు ఇప్పించి తనకు న్యాయం జరిగే చూడాలని జిల్లా ఎస్పీకి చేసిన ఫిర్యాదులో పేర్కొనట్లు తెలిపింది.



మత్తుకు నో చెప్పండి.. ఆరోగ్యానికి జై కొట్టండి

తానూర్,సెప్టెంబర్ 28 (ప్రజా కలం): విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తానూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవికిరణ్ పిలుపునిచ్చారు,జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో సోమవారం



కళాశాలలో 'నషా ముక్త్ భారత్' కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా స్థానిక వైద్యురాలు రమ్య గౌడ్ మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యంపై పడే దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో భాగంగా అధ్యాపకులు, విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశ రక్షణతో పాటు దైవభక్తి చాటుకున్న ఆర్మీ జవాన్

ఆలయ నిర్మాణానికి 21,000 విరాళం అందజేసిన గణేష్ పాటిల్

అభినందించిన గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు

తానూర్, సెప్టెంబర్ (ప్రజా కలం):దేశ రక్షణలో భాగస్వామి అవుతూనే, తనలోని ఉదారతను, దైవభక్తిని చాటుకున్నాడు ఓ ఆర్మీ జవాన్. తన కష్టార్జితంలో వచ్చిన తొలి జీతాన్ని సొంత అవసరాలకు వాడుకోకుండా, గ్రామంలో నిర్మిస్తున్న హనుమాన్ ఆలయానికి విరాళంగా ఇచ్చి తోటి యువతకు ఆదర్శంగా నిలిచాడు.



తానూర్ మండలంలోని బోండ్రేట్ గ్రామానికి చెందిన గణేష్ పాటిల్ ఇటీవల ఆర్మీ జవాన్ గా ఎంపికయ్యారు. విధులు చేపట్టిన తర్వాత ఆయనకు వచ్చిన తొలి జీతం నుంచి 21,000 మొత్తాన్ని గ్రామంలోని హనుమాన్ మందిర నిర్మాణానికి కేటాయించారు. సోమవారం తన తాతయ్య అవధూత పాటిల్ చేతుల మీదుగా ఈ చెక్కును ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు.ఈ సందర్భంగా గణేష్ పాటిల్‌ను గ్రామ సర్పంచ్ షిందే రవీందర్ పాటిల్, వార్డు సభ్యులు భోజరాం పాటిల్, నాయకులు నాగేందర్ పటేల్ మరియు గ్రామస్తులు అభినందించారు.

పంచాయతీ నిధులకు గండి.. ప్రజావాణికి చేరిన రచ్చ

సర్పంచ్, ఉపసర్పంచ్, కార్యదర్శిపై చర్యలకు డిమాండ్ - అదనపు కలెక్టర్‌కు రాఘవపూర్ గ్రామస్థుల వినతి



పెద్దపల్లి,సెప్టెంబర్ 28:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)
మండల పరిధిలోని రాఘవపూర్ గ్రామ పంచాయతీలో ప్రజాధనం దారిమళ్లిందంటూ గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనలకు తిలోదకాలు ఇస్తూ నిధులను పక్కదారి పట్టించారని ఆరోపిస్తూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ బి.శ్రీరాములుకు రాతపూర్వక ఆధారాలతో ఫిర్యాదు సమర్పించారు.గ్రామ అభివృద్ధి కోసం ప్రభుత్వం మంజూరు చేసిన వివిధ గ్రాంట్లు,పన్నుల రూపంలో సమకూరిన నిధులను నిబంధనలకు విరుద్ధంగా దుర్వినియోగం చేశారని గ్రామస్థులు పేర్కొన్నారు.ఈ నిధుల గోల్‌మాల్‌పై ఉన్నతాధికారులు తక్షణమే సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను వెలికితీయాలని డిమాండ్ చేశారు. అక్రమాలు రుజువైతే సర్పంచ్ తాడిశెట్టి చామంతి, ఉపసర్పంచ్ కొడపత్రి వినోద్, పంచాయతీ కార్యదర్శితో పాటు బాధ్యులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.నిధులు రికవరీ చేయకుంటే పైస్థాయి పోరాటం పంచాయతీ నిధుల స్వాహాతో గ్రామంలో మౌలిక వసతులు,అభివృద్ధి పనులు పూర్తిగా కుంటుపడ్డాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.అవినీతికి పాల్పడిన వారిని వదవుల నుంచి తొలగించడంతో పాటు దుర్వినియోగమైన ప్రతి పైసానూ వెంటనే రికవరీ చేయాలని కోరారు.జిల్లా యంత్రాంగం నిష్పాక్షిక విచారణ చేపట్టి న్యాయం చేయకపోతే,ఈ వ్యవహారాన్ని పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయపోరాటం చేస్తామని కుమ్మరి తిరుమల్,మౌలుమూరి వంశీ, కుమ్మరి సదయ్య,కుమ్మరి నిరంజన్,కుమ్మరి సది,శ్రవణ్ హెచ్చరించారు.

పేద విద్యార్థులకు పౌష్టికాహారం నాణ్యమైన చదువు

- రూ.70 కోట్లతో నియోజకవర్గంలో బడుల ఆధునీకరణ

- రూ.200 కోట్లతో సమీకృత పాఠశాల నిర్మాణం - అల్పాహార పథకం ప్రారంభించిన ప్రభుత్వ విప్



పెద్దపల్లి:సెప్టెంబర్ 28:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద విద్యార్థులు ఏ ఒక్కరూ ఆకలితో అలమటించవద్దనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఉదయం పూట పౌష్టికాహారంతో కూడిన అల్పాహారాన్ని అందిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పేర్కొన్నారు.జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో హరే కృష్ణ ట్రస్ట్ భాగస్వామ్యంతో చేపట్టిన తెలంగాణ అల్పాహార పథకాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందని తెలిపారు.గత పాలకుల హయాంలో విద్యార్థుల డైట్ ఛార్జీలను విస్మరించగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే డైట్, కాస్మెటిక్ ఛార్జీలను భారీగా పెంచి విద్యార్థులకు అండగా నిలిచిందని గుర్తుచేశారు.ప్రభుత్వ బడుల రూపురేఖలు మారుస్తున్నాం పెద్దపల్లి నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, రూ. 70 కోట్ల వ్యయంతో ప్రభుత్వ పాఠశాలలను సర్వాంగ సుందరంగా ఆధునీకరిస్తున్నామని ఎమ్మెల్యే వివరించారు. కులమతాలకు అతీతంగా విద్యార్థులంతా సమైక్యంగా చదువుకునేలా రూ 200 కోట్లతో నియోజకవర్గంలో అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు.ప్రభుత్వ ఉపాధ్యాయులు అపార ప్రతిభ,ఉన్నత విద్యార్హతలు కలిగిన వారని,తల్లిదండ్రులు ప్రైవేటు వ్యామోహాన్ని వీడి తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, కమిషనర్,తహసీల్దార్, విద్యాశాఖ అధికారులు,స్థానిక కౌన్సిలర్లు,ప్రజాప్రతినిధులు,వ్యవసాయ మార్కెట్ కమిటీ బాధ్యులు,వివిధ గ్రామాల సర్పంచులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు,పాల్గొన్నారు.

ఎన్నికల సంఘం స్వతంత్రతను కాపాడాలి

ప్రభుత్వ విప్ శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి - కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా

కేంద్రం తీరుపై విరుచుకుపడ్డ ఎమ్మెల్యేలు యెన్నం, జి.మధుసూదన్ రెడ్డి



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్ 28:
దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ఎన్నికల సంఘం స్వతంత్రత, విశ్వసనీయతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు, డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ శ్రేణులు భారీ ఎత్తున మహాధర్నా నిర్వహించాయి. ఈ నిరసన కార్యక్రమానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డితోలి పాటు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ లిశ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి లి మాట్లాడుతూ, ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియలో కేంద్ర ప్రభుత్వం మార్పులు తీసుకురావడం రాజ్యాంగ సంస్థల స్వయంప్రతిపత్తిపై తీవ్ర సందేహాలను కలిగిస్తోందని మండిపడ్డారు. గతంలో సుప్రీంకోర్టు తీర్పు మేరకు ప్రధానమంత్రి, లోక్‌సభ ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తితో కూడిన నిష్పక్షపాత ఎంపిక కమిటీ ఏర్పాటవగా, అనంతరం పార్లమెంటు చట్టం ద్వారా న్యాయవ్యవస్థ ప్రాతినిధ్యాన్ని తొలగించి తమకు అనుకూలంగా మార్పులు చేశారని ఆరోపించారు. లిపీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్న కాలంలో టీ.ఎన్. శేషన్ వంటి ప్రధాన ఎన్నికల కమిషనర్లు నిర్భయంగా వ్యవహరించి విప్లవాత్మక సంస్కరణలు తెచ్చారని ఆయన గుర్తుచేశారు. దేశ యువత ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగాలని ఆశిస్తుంటే, కేంద్ర ప్రభుత్వం మాత్రం రాజ్యాంగబద్ధమైన ఎన్నికల సంఘాన్ని తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని విమర్శించారు. ఓటర్ల జాబితా రూపకల్పన, నిర్వహణలో పూర్తి పారదర్శకత ఉండాలని డిమాండ్ చేశారు.
అనంతరం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి లి మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెడుతూ, తమకు నచ్చిన వ్యక్తులకు కీలక పదవులు అప్పగిస్తోందని ధ్వజమెత్తారు. కీలక రాజ్యాంగ, పరిపాలనా వ్యవస్థల్లో అనుకూల వ్యక్తులను చేర్చి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు లాంటి ఎన్నికల సంఘంపైనా రాజకీయ ప్రభావం చూపించే యత్నాలు చేయడం దారుణమన్నారు. ఈ మహాధర్నా కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, టి పిసిసి అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి, టి పిసిసి ప్రధాన కార్యదర్శి మిథున్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, సిరాజ్ ఖాద్రీ, జిల్లా కాంగ్రెస్ ముఖ్య నేతలు సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, బుద్దారం సుధాకర్ రెడ్డి, దోమ పరమేశ్వర్, రాములు యాదవ్, ఎస్సీ సెల్ చైర్మన్ పసుల రాజు, ఎస్టీ సెల్ లింగం నాయక్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, హన్వాడ మండల అధ్యక్షుడు వి మహేందర్. సీనియర్ నాయకులు యాదవ రెడ్డి. జీ నరసింహులు. కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషనర్‌ను తొలగించాలంటూ కాంగ్రెస్ ధర్నా, నిరసన



నాగర్‌కర్నూల్ సెప్టెంబర్ 28 (ప్రజా కలం): ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ఎదుట సోమవారం భారీ నిరసన, ధర్నా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. దేశవ్యాప్తంగా కోట్లాది ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని అన్నారు. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ తీసుకుంటున్న కొన్ని చర్యలు రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉన్నాయని ఆరోపించారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు చేస్తూ, ఆయనను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు కలెక్టరేట్ పరిపాలన అధికారిని కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కతార్‌లో నడికూడ వాసి మృతి..



మల్లాపూర్ , సెప్టెంబర్ 28 (ప్రజా కలం ప్రతినిధి) మల్లాపూర్ నడికూడ గ్రామానికి చెందిన తలారి ముత్తేన్న కతార్‌లో అనారోగ్యంతో మృతి చెందారు. ఉపాధి కోసం కతార్ వెళ్లిన ఆయన అనారోగ్యానికి గురై మృతి చెందడంతో స్వగ్రామంలో విషాదం నెలకొంది. మృతివార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.ముత్తేన్న గతంలో ఎఫ్ఏగా పనిచేయడంతో పాటు సీనియర్ అంబేద్కర్ నాయకుడిగా గ్రామంలో గుర్తింపు పొందారు. సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ అంబేద్కర్ ఆశయాల కోసం పనిచేశారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో వారి ఆవేదన పలువురిని కంటతడి పెట్టించింది. ముత్తేన్న మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం సహకరించాలని, కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి వేడుకలు



మల్లాపూర్ , సెప్టెంబర్ 28 (ప్రజా కలం ప్రతినిధి)
మల్లాపూర్ మండలం కొత్త ధామ్‌రాజ్‌పల్లి గ్రామంలో శివసేన యూత్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఎగ్యరపు లింబాద్రి హాజరై భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఎగ్యరపు లింబాద్రి మాట్లాడుతూ భగత్‌సింగ్ దేశం కోసం చేసిన త్యాగాలు, పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శమని అన్నారు. యువత దేశభక్తి, సమాజ సేవా స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సెక్రటరీ వంశీధర్ రెడ్డి, ఉప సర్పంచ్ బద్దం హరీష్ రెడ్డి, వార్డు సభ్యులు బద్దం రామ్ చందర్, సంతోష్, కాంతయ్య, బద్దం సుధాకర్ రెడ్డి, బద్దం శ్రీనివాస్, శివసేన యూత్ సభ్యులు ఉత్కం శ్రీరామ్, చల్ల రామ్, పోలస ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌తో మాజీ ఎమ్మెల్యే దాసరి భేటీ



పెద్దపల్లి,సెప్టెంబర్ 28:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పెద్దపల్లి మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని ప్రజా సమస్యలు,అభివృద్ధికి సంబంధించిన పలు ప్రధాన అంశాలతో పాటు ప్రస్తుత రాజకీయ పరిణామాలు,పార్టీ కార్యకలాపాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు.నియోజకవర్గంలో పార్టీని మరింత పటిష్టం చేయడం,శ్రేణులను సమన్వయం చేసుకుంటూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి పోరాడడంపై వారు దృష్టి సారించారు.ఈ భేటీ అనంతరం దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తూనే పార్టీ బలోపేతానికి కార్యకర్తలతో కలిసి ఐక్యంగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.

సర్ పై కాంగ్రెస్ నిరసనలో పాల్గొన్న పూదరి రాము గౌడ్



మెట్ పల్లి టౌన్ ప్రతినిధి సెప్టెంబర్ 28 (ప్రజాకలం):– ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు సంరక్షణలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మెట్ పల్లి ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు పూదరి రాము గౌడ్ పాల్గొన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ప్రారంభమైన నిరసనలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి రాము గౌడ్ పాల్గొన్నారు. సర్ ప్రక్రియలో ఓటర్లకు ఎదురవుతున్న సమస్యలు, అభ్యంతరాలు, అవకతవకలపై పార్టీ చేపట్టిన ఆందోళనకు ఆయన సంఘీభావం తెలిపారు.తెలంగాణలో సర్ ప్రక్రియపై పారదర్శకత, ఓటర్ల హక్కుల పరిరక్షణ అంశాలను కాంగ్రెస్ పార్టీ లేవనెత్తుతూ నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తోంది తెలిసిందే.

డబ్బులు అడిగిన వ్యక్తిపై దాడి

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి సెప్టెంబర్ 28 (ప్రజాకలం): డబ్బులు ఇవ్వాలని అడిగిన వ్యక్తిపై కొందరు దాడి చేసి చంపుతామని బెదిరించిన ఘటనపై కేసు నమోదైంది. కోరుట్ల ఎస్ఐ జి. శ్యాం రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. సర్వరాజుపల్లి గ్రామానికి చెందిన కొక్కు రాజు (40) సౌదీలో పనిచేసిన సమయంలో జరిగిన ఆర్థిక లావాదేవీలకు సంబంధించి సింహోల మధు తనకు రూ. 12 లక్షలు ఇవ్వాల్సి ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. పలుమార్లు డబ్బులు అడిగినా మధు వాయిదా వేస్తూ వచ్చాడని తెలిపాడు. ఈ క్రమంలో సెప్టెంబర్ 27 రాత్రి సుమారు 10 గంటలకు సర్వరాజుపూర్ బస్టాండ్ నుంచి బైక్‌పై వెళ్తుండగా గణేష్ (మధు కుమారుడు), దిలీప్, రఘురాం, హరీష్ తదితరులు తనను అడ్డగించి దూషించారని, ముఖం, దవడపై కొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇకపై డబ్బులు అడిగితే చంపుతామని బెదిరించినట్లు తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్యాం రాజ్ తెలిపారు.

108 అంబులెన్స్ పనితీరుపై ఆడిట్ అధికారి పరిశీలన



ఆళ్లపల్లి, సెప్టెంబరు 28,ప్రజాకలం

ఆళ్లపల్లి మండల కేంద్రంలోని 108 అంబులెన్స్‌ను జీవీకే–ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ రాష్ట్ర ఆడిట్ అధికారి ఫకీర్‌దాస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 108 అధికారి కురుమ సతీష్‌కుమార్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్ నిర్వహణ, పనితీరును పరిశీలించారు. వాహనంలోని అత్యవసర వైద్య పరికరాలు, మందులు, ఇతర వైద్య సామగ్రిని తనిఖీ చేశారు. అంబులెన్స్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా గోల్డెన్ అవర్‌లో క్షతగాత్రులకు తక్షణ వైద్య సహాయం అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. తనిఖీల్లో 108 సిబ్బంది భాగ్యమ్మ, శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో మతోన్మాదంపై పోరాడాలి

- రాజ్యాంగ పరిరక్షణ కోసం విద్యార్థులు ఉద్యమాలకు సిద్ధం కావాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్



నాగర్‌కర్నూల్ సెప్టెంబర్ 28 (ప్రజా కలం): భగత్‌సింగ్ స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో విద్యార్థులు మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం. తారాసింగ్ పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భగత్‌సింగ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడి, కేవలం 23 ఏళ్ల వయసులోనే ఉరికంబాన్ని చిరునవ్వుతో ముద్దాడిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్ చేసిన పోరాటం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశంలో ప్రస్తుతం మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ రాజ్యాంగాన్ని మార్చేందుకు పాలకులు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం, మతోన్మాదానికి వ్యతిరేకంగా విద్యార్థులు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. విద్యారంగంలో కాషాయీకరణను ప్రవేశపెట్టి విద్యార్థుల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. కుల, మతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందడం తప్ప విద్య, ఉపాధి అవకాశాల కల్పనపై పాలకులకు శ్రద్ధ లేదని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించేందుకు ప్రయత్నిస్తున్నారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పాలకులు విఫలమయ్యారని అన్నారు.భగత్‌సింగ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని తారాసింగ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, జిల్లా నాయకులు రాకేష్, భరత్, విజయ్, తరుణ్, రామకృష్ణ, సాయితేజ, మణికంఠ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ లోనులిపురుగు నివారణ మాత్రలను పంపిణీ చేసిన కలెక్టర్

ఒంగోలు: జిల్లా వ్యాప్తంగా జాతీయ నలిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఉచితంగా ఒంగోలు లో ఆల్బెండజోల్ లోనులిపురుగు నివారణ మాత్రలను జిల్లా కలెక్టర్ రాజాబాబు పంపిణీ చేశారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు మరియు కౌమార బాల బాలికలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు వేయడం జరుగుతుందని, పాఠశాలలు, కళాశాలలు మరియు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఉచితంగా ఆల్బెండజోల్ 400 మి.గ్రా. మాత్రలను విద్యార్థులకు అందిస్తారని కలెక్టర్ తెలిపారు.

పార్లుకట్టలో మంత్రి నారాయణ పర్యటన

నెల్లూరు : నెల్లూరు,పార్లుకట్టలో పర్యటించి ప్రజల సమస్యలను మంత్రి నారాయణ తెలుసుకున్నారు.వర్షాకాలంలో ఇక్కడి ప్రజల ఇబ్బందులను చూసి ఇచ్చిన హామీ మేరకు 70 లక్షలతో సీసీ రోడ్డు పనులు పూర్తి చేసి ప్రారంభించారు.తాజాగా 48 లక్షలతో కనెక్టివిటీ రోడ్డు, రూ.7 లక్షలతో లైటింగ్ పనులకు శంకుస్థాపన చేశారు.రోడ్డు పనుల వల్ల ఎవరికైనా ఇబ్బంది కలిగితే న్యాయం చేస్తాను. ఇళ్లు పూర్తిగా తొలగించాల్సి వస్తే ప్రత్యామ్నాయ ఇళ్లు కేటాయిస్తామని, మహిళల అభ్యర్థన మేరకు 27 మరుగుదొడ్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.పనులు రేపటి నుంచే ప్రారంభిస్తాని తెలిపారు.

సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

కోతకోట జెడ్పీ హైస్కూల్‌లో సి.బెలగల్ పోలీసుల అవగాహన కార్యక్రమం

సి.బెలగల్ : ప్రస్తుత కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సి.బెలగల్ పోలీసులు సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని కోతకోట గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీ బెలగల్ ఎస్సై వేణుగోపాల రాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సి.బెలగల్ ఎస్ఐ, వేణుగోపాల్ రాజు మహిళా పోలీస్ సిబ్బందితో కలిసి విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. నేటి సమాజంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలనిసూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచివచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని, ఆన్‌లైన్‌లో ఎవరితోనూ బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం కార్డు వివరాలు,ఓటీపీ, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని వివరించారు.ఆన్‌లైన్ మోసాలకు గురైనప్పుడు భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, ముఖ్యంగా ఆర్థిక సైబర్ మోసాలకు సంబంధించి 1930 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సూచించారు.

వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

- 2027 జనాభా లెక్కల్లో 21 రకాల వైకల్యాల వివరాలు నమోదు చేయాలి: ఎన్‌పీఆర్‌డీ డిమాండ్



నాగర్‌కర్నూల్ సెప్టెంబర్ 28 (ప్రజా కలం): ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను గుర్తించి ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) నాగర్‌కర్నూల్ జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2027 జనాభా లెక్కల సేకరణలో 2016 వికలాంగుల హక్కుల చట్టం గుర్తించిన 21 రకాల వైకల్యాల వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను గుర్తించి భర్తీ చేసేందుకు 2026 ఆగస్టు 18న జీఓ నెం.19 విడుదల చేసిందని ఎన్‌పీఆర్‌డీ ప్రతినిధులు తెలిపారు. గత 14 సంవత్సరాలుగా జిల్లాల్లో వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ కాకపోవడంతో అనేక ప్రభుత్వ శాఖల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. జీఓ నెం.19ను సమర్థంగా అమలు చేసి, ఖాళీ పోస్టులను గుర్తించి ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేసి నియామకాలు చేపట్టాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం 2027లో జనాభా లెక్కల సేకరణ చేపట్టనున్న నేపథ్యంలో వికలాంగుల వివరాలను సమగ్రంగా నమోదు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం కొన్ని రకాల వైకల్యాల వివరాలు మాత్రమే సేకరించే విధానం వల్ల ఆటిజం, నిర్దిష్ట అభ్యాసన వైకల్యాలు, మరుగుజ్జుతనం, కుష్ఠువ్యాధి నయమైన వ్యక్తులు, చెవిటితనం, అంధత్వం, బహుళ వైకల్యాలు తదితర వర్గాలకు చెందిన వారి వివరాలు పూర్తిస్థాయిలో నమోదు కాకపోయే అవకాశం ఉందని తెలిపారు. అన్ని రకాల వైకల్యాల వివరాలను సమగ్రంగా నమోదు చేయకపోతే విద్య, ఉపాధి, ఆరోగ్యం, పునరావాసం, సామాజిక భద్రతతో పాటు వికలాంగులకు అందాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సౌకర్యాలపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వికలాంగుల వాస్తవ జనాభా గణాంకాలు అందుబాటులో ఉండేలా 21 రకాల వైకల్యాల వివరాలను జనాభా లెక్కల్లో నమోదు చేసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఎన్‌పీఆర్‌డీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు మీసాల కుర్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పులిజాల బాలీశ్వర్, ఉపాధ్యక్షులు దార్ల శ్రీనివాసులు, ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు వల్లమ్మ, సువర్ణ, లలిత, బంగారయ్య తదితరులు విజ్ఞప్తి చేశారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల - ప్రజావాణికి 130 ఫిర్యాదుల స్వీకరణ



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్ 28:

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల అధికారులకు ఆదేశించారు.సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, అర్జిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జిదారుల సమస్యలను సావధానంగా విన్నారు. ప్రతి సమస్యను జాగ్రత్తగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని డి.ఆర్.ఓ వారికి భరోసా ఇచ్చారు. అధికారులు ప్రజావాణి దరఖాస్తులను క్షుణ్ణంగా చదివి అర్థంచేసుకుని క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని అన్నారు.ప్రజావాణిలో మున్సిపల్, పంచాయతీరాజ్, నీటిపారుదల, జిల్లా సంక్షేమం, వ్యవసాయం, పౌరసరఫరాల శాఖ, భూ సర్వే రికార్డులు, గృహ నిర్మాణం, రోడ్డు రవాణా, పోలీస్, గిరిజన అభివృద్ధి శాఖ, విద్యుత్ శాఖ, విద్య, వైద్య ఆరోగ్యం , మైనింగ్, అటవీ, గ్రామీణ అభివృద్ధి, తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 130 వినతులను అధికారులు స్వీకరించారు.

జిల్లా అధికారుల సమావేశం

ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో డి.ఆర్.ఓ ఎ. నిర్మల మాట్లాడుతూ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9 నుండి అక్టోబర్ 8 వరకు పోష న్ మా లో బాగంగా "మన అంగన్‌వాడీ –మన బాధ్యత" అనే థీమ్‌తో చేపడుతున్న పోషణ కార్యక్రమం లో భాగంగా పిల్లలకు, గర్భిణీలకు పోషకాహారం, ఆహారపు అలవాట్లు, ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కల్పించడం తో పాటు వయోవృద్ధుల సంక్షేమ కార్యక్రమాలను విజయవంతం చేయాలని అన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో నిర్వహించే కార్యక్రమాలకు మహిళా, శిశు సంక్షేమ శాఖకు విద్య, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్ తో పాటి సంబంధిత అన్ని శాఖల అధికారులు పూర్తి సహకారం అందించాలని సూచించారు. అలాగే, ఈ నెల 24వ తేదీ నుంచి నిర్వహిస్తున్న వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా సీనియర్ సిటిజన్ల కోసం పాటల పోటీలు, యోగా తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యాశాఖ సహకారంతో పాఠశాలల్లో గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహించి, తాతలు, అమ్మమ్మలు, నానమ్మలు, తాతయ్యల పట్ల గౌరవం, కుటుంబ, మానవతా విలువలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. మండలస్థాయి అధికారులు, సిబ్బంది ప్రతి పాఠశాలలో ఈ కార్యక్రమాలు విజయవంతంగా జరిగేలా సమన్వయం చేసుకోవాలని డి. ఆర్.ఓ ఎ. నిర్మల సూచించారు. కమానవేశంలో భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్ రెడ్డి, జెడ్. పి. సి.ఈ.ఓ ఇంచార్జి డి. పి.ఓ వెంకట రెడ్డి, డి. ఆర్. డి.ఓ నరసింహులు, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జరీనా బేగం, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడాలి

- రాజ్యాంగ, లౌకిక ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు యువత సిద్ధం కావాలి

- సీపీఎం కొల్లాపూర్ మండల కార్యదర్శి బి. శివవర్మ



నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 28 ప్రజా కలం (ప్రతినిధి): భగత్‌సింగ్ స్ఫూర్తితో మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా రాజ్యాంగ లౌకిక ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం యువత ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఎం కొల్లాపూర్ మండల కార్యదర్శి బి. శివవర్మ పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ 119వ జయంతిని పురస్కరించుకుని సీపీఎం ఆధ్వర్యంలో కొల్లాపూర్ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శివవర్మ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్ చిన్న వయసులోనే బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. భగత్‌సింగ్ ఆశయాలకు అనుగుణంగా నేటి యువత సామాజిక సమస్యలపై చైతన్యంతో పోరాడాలని కోరారు. దేశంలో కులాలు, మతాల మధ్య విభేదాలు సృష్టించే రాజకీయాలను వ్యతిరేకించాలని విద్య, వైద్యం, ఉపాధి వంటి ప్రజా సమస్యలపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే విధానాలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పాలకులు చిత్తశుద్ధి చూపాలని డిమాండ్ చేశారు. భగత్‌సింగ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు రాజ్యాంగ పరిరక్షణ, లౌకిక ప్రజాస్వామ్య విలువల కోసం యువత నిరంతరం ఉద్యమించాలని అయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు బి. బాలపీర్, రామకృష్ణ, బత్తిని రాజు, నాయకులు కదిరే సాయికుమార్, మీసాల శ్రీనివాసులు, సంజు, చందు, పి. రాజు, మనోహర్, సాయికుమార్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శిగా భీంరావ్ పవార్ నియామకం

- మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి సమక్షంలో ఘన సన్మానం

తానూర్, సెప్టెంబర్ 28(ప్రజా కలం): కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శిగా తానూర్ గ్రామానికి చెందిన భీంరావ్ పవార్ నియమితులయ్యారు, ఈ సందర్భంగా దేగాంలోని ముధోల్ మాజీ శాసనసభ్యులు జి. విఠల్ రెడ్డి నివాసంలో భీంరావ్ పవార్‌ను పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు,ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు, తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు భీంరావ్ పవార్ మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు కట్టె శ్యామ్‌కు, జిల్లా కమిటీ సభ్యులకు మరియు నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు,ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాజన్న, మాజీ ఆత్మ చైర్మన్ పోతారెడ్డి, మాజీ ఎంపీటీసీలు లచ్చన్న, పోశెట్టి, బామ్ని ఉప సర్పంచ్ గంగాధర్, నాయకులు ఆసమ్ మాధవ్, గైక్వాడ్ సాయినాథ్, గంగారెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ గ్రామ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



ఆళ్లపల్లి, సెప్టెంబర్ 28, ప్రజాకలం ఆళ్లపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి నూలకతాటి శ్రీను ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షులుగా పరమ శ్రీను, ఉపాధ్యక్షులుగా నిట్ట చిరంజీవి, ప్రధాన కార్యదర్శులుగా కామెల భద్రయ్య, కండె మనోహర్, సహాయ కార్యదర్శిగా బొబ్బిలి సంపత్‌ను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా సంకి నాగరాజు, బొబ్బిలి జీవన్, లకుమల్ల స్టాలిన్, నులకతాటి బాబు, దారం శ్రీనులను ఎంపిక చేశారు.ఈ సందర్భంగా నూలకతాటి శ్రీను మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ఎస్సీ వర్గాల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదు

- జిల్లా ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్



నిర్మల్ సెప్టెంబర్ 27 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదని జిల్లా ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్ అధికారులను ఆదేశించారు.


సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను ఆయనకు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ రాకేష్, ఆర్డీవో దేవీదాస్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చిన్న గోపమ్మ కు నివాళులర్పించిన సర్పంచ్ గొడ్ల ప్రభాకర్

- కార్యక్రమంలో పాల్గొన్న ఉప సర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు

తల్లాడ సెప్టెంబర్ 28, ప్రజా కలం న్యూస్

తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన ముద్దె బోయిన చిన్న గోపమ్మ దశదిన కార్యక్రమం సోమవారం కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ హాజరై చిన్న గోపమ్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గోపమ్మ మృతి గ్రామానికి, కుటుంబ సభ్యులకు తీరని లోటని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కీర్తిశేషులు చిన్న గోపమ్మకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు,స్థానిక వార్డు మెంబర్ రాచబంటి వంశీతో పాటు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కీర్తిశేషులు చిన్న గోపమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.



పనులు వేగంగా.. నాణ్యతతో పూర్తి చేయాలి

- ముధోల్ మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

- శాఖల వారీగా అభివృద్ధి పనులపై సమీక్ష.. సర్పంచుల సమస్యలపై ప్రత్యేక దృష్టి



నిర్మల్ సెప్టెంబర్ 28 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ముధోల్ మండల కేంద్రంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ శాఖల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్పంచులు విన్నవించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.వ్యవసాయ శాఖ పరిధిలో రైతులకు అందుతున్న సేవలు, పంటల పరిస్థితి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. రైతులకు అవసరమైన సేవలు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉద్యాన పంటల సాగు, రైతులకు అందుతున్న ప్రోత్సాహకాలు, శాఖ ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్య, మౌలిక వసతులు, ఉపాధ్యాయుల పరిస్థితిపై సమీక్షించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ వైద్య సేవలు, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలు, ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలపై వివరాలు తెలుసుకుని, ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులో ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. గ్రామాల్లో విద్యుత్ సరఫరా పరిస్థితి, పెండింగ్‌లో ఉన్న సమస్యలు, రైతులకు సంబంధించిన విద్యుత్ సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు, రైతులకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా పరిస్థితిపై సమీక్షిస్తూ, ఎక్కడైనా నీటి సమస్యలు ఉంటే గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో గ్రామపంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి, నిర్మాణ పనుల పురోగతిపై ప్రత్యేకంగా ఆరా తీశారు. గ్రామపంచాయతీ, వీఓ, అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని సూచించారు. నిలిచిపోయిన పనులను గుర్తించి వెంటనే ప్రారంభించాలని, ప్రతి నిర్మాణ పనిలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఇరిగేషన్ శాఖ పరిధిలో సాగునీటి వనరులు, నీటి లభ్యత, పెండింగ్‌లో ఉన్న పనులపై అధికారులతో చర్చించారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలంలోని వివిధ శాఖల పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను వచ్చే సమీక్ష సమావేశం నాటికి గణనీయంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అధికారులను ఆదేశించారు. పనులు కేవలం పూర్తి చేయడమే కాకుండా నాణ్యతా ప్రమాణాలతో, ప్రజలకు ఉపయోగపడే విధంగా చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రతి శాఖకు సంబంధించిన పనుల పురోగతిని తదుపరి సమీక్ష సమావేశంలో పరిశీలిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంపై కూడా సమావేశంలో చర్చించారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు. ఇళ్ల మంజూరు, వెరిఫికేషన్ ప్రక్రియలో సాధారణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకం అందేలా పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అందజేశారు. ప్రజల సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తూ గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ఎక్కువ శాతం యువతీ యువకుల్లో ఛాతీ నొప్పి కేసులు నమోదు

50 ఏళ్లు నిండిన పురుష మహిళలు యోగాసనం చేయాలి

అధిక సంఖ్యలో పురుషుల్లో గుండెపోటు మరణాలు



ఆళ్లపల్లి, సెప్టెంబర్ 28, ప్రజాకలం

తెలంగాణలో రాష్ట్రవ్యాప్తంగా 2025 సంవత్సరంలో 22,699 గుండెసంబంధిత అత్యవసర కేసులు నమోదు కావడంచూస్తుంటే ఎక్కువశాతం యువతీ యువకుల్లో రక్తపోటు ఎక్కువై అనేక గుండెపోటు మరణాలు అధిక సంఖ్యలో నమోదవుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో గుండెసంబంధిత అత్యవసర పరిస్థితులపై ఈఎమ్‌ఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ గణాంకాలు ఆందోళనకర అంశాలను వెల్లడిస్తుండడంతో యువకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి. 2025లో ఈఎంఆర్ఐ జిహెచ్ఎస్ స్పందించిన మొత్తం 8,08,755 కేసుల్లో 22,699 కేసులు గుండె సంబంధిత సమస్యలకు సంబంధించినవిగా నమోదయ్యాయి. వీటిలో ఛాతీ నొప్పికి సంబంధించిన కేసులు నెలకు సగటున 1,892,రోజుకు సుమారు 62 కేసుల చొప్పున గుండె పోటు కేసులు నమోదయ్యాయి.గుండె జబ్బులు వృద్ధులకు మాత్రమే పరిమితమనే అభిప్రాయం మారుతున్నట్లు నివేదిక పేర్కొంది. నమోదైన గుండె సంబంధిత అత్యవసర కేసుల్లో దాదాపు 60 శాతం, అంటే 13,508 కేసులు, 31 నుంచి 60 ఏళ్ల వయసు వారిలోనే నమోదయ్యాయి.వయస్సుల వారీ గణాంకాల్లో 40-50ఏళ్ల వారిలో 4,699 కేసులు, 51-60ఏళ్ల వారిలో 4,670 కేసులు నమోదయ్యాయి 31-40ఏళ్ల వయసు వారిలో 4,139 కేసులు నమోదయ్యాయి.

లింగాల వారీ విశ్లేషణలో

పురుషుల్లో ఎక్కువ శాతం కేసులు నమోదు

12,098 గుండె సంబంధిత అత్యవసర కేసులు (53 శాతం), మహిళల్లో 10,607 కేసులు (47 శాతం) నమోదయ్యాయి. ధూమపానం, అధిక మద్యపానం, అనారోగ్యకరమైన ఆహారం,శారీరక శ్రమ లేక పోవడం వంటి ప్రమాదకర అలవాట్లతో పాటు అధిక రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్ వంటి ఆరోగ్య పరిస్థితులు గుండె జబ్బుల ప్రమాదానికి దోహదపడవచ్చని నివేదికలు పేర్కొన్నాయి.

పట్టణ ప్రాంతాల్లోనే యువత అధికం శాతం

ప్రాంతాల వారీగా చూస్తే పట్టణ ప్రాంతాల్లో అత్యధికంగా 16,198 కేసులు (71 శాతం) నమోదయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో 5,094 కేసులు (23 శాతం), గిరిజన ప్రాంతాల్లో 1,407 కేసులు (6 శాతం) నమోదయ్యాయి. జనాభా సంఖ్యతో పాటు సకాలంలో వైద్య సహాయం కోరే ధోరణి వంటి అంశాలు ఈ వ్యత్యాసానికి కారణాలు కావచ్చని నివేదిక పేర్కొంది.

గోల్డెన్ అవర్‌లో చికిత్స కీలకం

గుండె సంబంధిత అత్యవసర పరిస్థితుల్లో 'గోల్డెన్ అవర్'లో స్పందించడం ప్రాణాలను కాపాడటంలో కీలకమని నివేదిక స్పష్టం చేసింది. తెలంగాణలో సేవలు 24 గంటలూ ఉచిత అత్యవసర సేవలను అందిస్తూ, రోగులకు ప్రీ-హాస్పిటల్ సంరక్షణ అందించి వీలైనంత త్వరగా ఆసుపత్రులకు తరలిస్తున్నాయి.ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ఛాతీలో అసౌకర్యం లేదా గుండె సంబంధిత లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని నివేదిక సూచించింది. ఛాతీ నొప్పి ప్రారంభమైన వెంటనే 108 అంబులెన్స్ సేవలకు కాల్ చేయడం, లక్షణాలను ముందుగానే గుర్తించి వైద్య సహాయం పొందడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా గుండె జబ్బుల ముప్పును తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొంది.

ఒక్క క్షణాన్ని కూడా నిర్లక్ష్యం చేయవద్దు

అనే సందేశంతో ఈఏడాదిలో ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా గుండె ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరాన్ని నివేదిక గుర్తుచేస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో 108కు కాల్ చేయడం ద్వారా సకాలంలో వైద్య సహాయంతో మెరుగైన వైద్య సేవలు పొందాలని సూచించింది.

"మా మట్టి-మా నీరు-మా హక్కు"

- సిపిఎం ఆధ్వర్యంలో అక్టోబర్ 1 నుండి 5 వరకు మోటార్ సైకిల్ యాత్ర

ప్రజాకలం ప్రతినిధి ఎటపాక, సెప్టెంబర్ 28:

పోలవరం నిర్వాసితుల సమస్య ల పరిష్కారం, గ్రామాల అభివృద్ధి కొరకు సిపిఎం ఆధ్వర్యంలో అక్టోబర్ 1 నుండి 5 వరకు జరిగే మోటార్ సైకిల్ యాత్రను జయప్రదం చేయండి అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మోటార్ సైకిల్ యాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్ను సోమవారం మురుమూరులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మర్లపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం తుది దశకు చేరుకున్నప్పటికీ నిర్వాసితుల పునరవాసం మాత్రం ఇంకా ప్రారంభ దశలోనే ఉందని అన్నారు. కాలనీలన్నీ అసంపూర్తిగా ఉన్నాయన్నారు. కాలనీలో ఉండే మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదన్నారు. ఎటపాక మండలంలో ఒక గ్రామం కూడా 41 కాంటూరు లేదని , కానీ ప్రతి ఏటా వరదలకు పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయని అన్నారు. 2022 గోదావరి వరద ముంపును ప్రామాణికంగా తీసుకొని ఆనాడు ముంపు కు గురైన గ్రామాలన్నిటికీ పునరావాసం కల్పించాలని సిపిఎం ఆధ్వర్యంలో మహా పాదయాత్ర చేపట్టి ప్రభుత్వం ముందు ఉంచడం జరిగింది అన్నారు. కానీ నేటికీ మండలంలో 41కాంటూరు ముంపు గ్రామాలను ప్రభుత్వం గుర్తించలేదన్నారు. కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా ఒకే దశలో అందరికీ పునరావసం కల్పించాలని డిమాండ్ చేశారు. అందరికీ పునరావాసం కల్పించిన తర్వాతే ప్రాజెక్టు ప్రారంభించాలని సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు. రైతుల భూములు తీసుకొని 15 సంవత్సరాలు గడిచాయని, కానీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఎప్పటికి వస్తుందో కూడా తెలియని అయోమయ పరిస్థితిలో ఎటపాక మండలం ప్రజలు ఉన్నారన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యలు, పోడు భూముల పట్టాలు, ముంపు రైతుల సమస్యల పరిష్కారం కోసం, గ్రామాల అభివృద్ధి కోసం సిపిఎం చేపట్టే మోటార్ సైకిల్ యాత్రను జయప్రదం చేయాలని వారు కోరారు. "మా మట్టి-మా నీరు-మా హక్కు" నినాదంతో చేపట్టనున్న ఈ మోటార్‌సైకిల్ యాత్ర అక్టోబర్ 1న ఉదయం 10 గంటలకు ఎటపాక మండలం కన్నాయిగూడెం నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. అక్టోబర్ 5న చింతూరు ఐటీడీఏ కార్యాలయం వద్ద మహా ప్రదర్శన, ధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పోలవరం నిర్వాసితుల హక్కుల సాధన కోసం నిర్వహించే ఈ యాత్రలో నిర్వాసితులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమం లో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఐ వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి కాకా అర్జున్ దొర, మండల కమిటీ సభ్యులు పి. బాలకృష్ణ, సోందే రామారావు, పూనెం వెంకట్రావు, జంగిలి సంపత్, నాయకులు సోయం వీరమ్మ, పర్సిక ధర్మరాజు పాల్గొన్నారు.



ఈగ మల్లేశంకు 'కాకతీయ కీర్తి' పురస్కారం

- కళా, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణలో కళామతల్లి సేవలకు కాకతీయ కీర్తి పురస్కారం


- ఓరుగల్లు కళా వైభవం చిరస్థాయిగా నిలవాలి

- కళల పరిరక్షణలో ఈగ మల్లేశం సేవలు అభినందనీయం-ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

- ఓరుగల్లు మట్టి వాసనను భావితరాలకు అందించాలి- పురస్కార గ్రహీత ఈగ మల్లేశం

హన్మకొండ సెప్టెంబర్ 28:- (ప్రజా కలం ప్రతినిధి)

కళా, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణలో ఈగ మల్లేశం సేవలను గుర్తించి "కాకతీయ కీర్తి పురస్కారం" అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.హన్మకొండలోని కాళోజీ కళాక్షేత్రం వేదికగా తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ, శ్రీ శాంతి కృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన 1123వ అంతర్జాతీయ కళా మహోత్సవం-'కాకతీయ కళా వైభవం' 41వ వార్షిక వసంతోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఉభయ తెలుగు రాష్ట్రాల కళాకారుల సంక్షేమ మండలి అధ్యక్షుడు, కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కళారంగం, ప్రజాసేవతో పాటు కాకతీయుల చారిత్రక కళా వారసత్వ పరిరక్షణకు కృషి చేస్తున్న ఈగ మల్లేశంను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఘనంగా సత్కరించి ప్రతిష్టాత్మక 'కాకతీయ కీర్తి పురస్కారం', విశిష్ట ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కళలు సమాజానికి జీవనాడులని, వాటిని కాపాడుకోవడమే భావితరాలకు అందించే గొప్ప ఆస్తి అని అన్నారు. కళాకారుల సంక్షేమం, భారతీయ సంస్కృతి-సంప్రదాయాల పరిరక్షణకు ఈగ మల్లేశం చేస్తున్న నిరంతర సేవలు అభినందనీయమన్నారు. ఓరుగల్లు ఘనమైన కాకతీయ కళా వైభవం, జానపద సంపదను భావితరాలకు అందించడంలో శ్రీ శాంతి కృష్ణ సేవా సమితి చేస్తున్న కృషిని ప్రశంసించారు.




గౌరవం బాధ్యతను మరింత పెంచింది. పురస్కార గ్రహీత ఈగ మల్లేశం మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి 'కాకతీయ కీర్తి పురస్కారం' అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ గౌరవం తన బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు. ఈ పురస్కారం కేవలం వ్యక్తిగత అవార్డు కాదని, చారిత్రక ఓరుగల్లు గడ్డ శిల్పకళా వైభవానికి, మట్టి వాసనలతో ముడిపడిన జానపద సంపదకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానన్నారు.

జానపద కళలను కాపాడుకోవాలి

ఒగ్గుకథ, చిందు యక్షగానం, పెరిణి నృత్యం, బతుకమ్మ, బోనాలు, జానపద గీతాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలని ఈగ మల్లేశం అన్నారు. ఆధునిక కాలంలో అంతరించిపోతున్న జానపద కళారూపాలతో పాటు వాటినే నమ్ముకుని జీవిస్తున్న కళాకారులను ఆదరించడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు. కాకతీయుల శిల్పకళా వైభవాన్ని, జానపద కళలను నిర్లక్ష్యం చేయకుండా పరిరక్షించి రేపటి తరానికి భద్రంగా అందించాల్సిన అవసరం ఉందన్నారు. నేటి యువతకు తెలంగాణ చరిత్ర, జానపద కళలు, సంస్కృతి గొప్పతనాన్ని తెలియజేసి, వాటిని ముందుకు తీసుకెళ్లేలా స్ఫూర్తినివ్వాలని పిలుపునిచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని కళాకారుల సంక్షేమానికి కళాకారుల సంక్షేమ మండలి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

రెసిడెన్షియల్ పాఠశాలలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి



- సి.ఎస్ సంజయ్ జాజు

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్ 28:

జిల్లాలోని బి.సి, ఎస్.సి, ఎస్.టి, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, విద్యార్థులకు మెరుగైన విద్య, నాణ్యమైన ఆహారం, సురక్షితమైన వాతావరణం, అవసరమైన మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో రెసిడెన్షియల్ పాఠశాలల పనితీరుపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.మహబూబ్‌నగర్ జిల్లా నుండి, కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, సంబంధిత అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సంజయ్ జాజు మాట్లాడుతూ, రెసిడెన్షియల్ పాఠశాలల్లో, వసతి గృహాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, ఆహార నాణ్యత, వంటశాలల పరిశుభ్రత, ఆరోగ్య పరిస్థితులు, మౌలిక వసతులను అధికారులు తరచుగా తనిఖీ చేయాలని తెలిపారు. అలాగే విద్యార్థుల హాజరుతో పాటు సిబ్బంది హాజరును కూడా క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, మానసిక స్థితిపై ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరమైన చోట కౌన్సెలింగ్ సదుపాయాలను బలోపేతం చేయాలని సూచించారు. విద్యార్థులకు సంబంధించిన సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించేందుకు నిరంతర పర్యవేక్షణ అవసరమని చెప్పారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో జరుగుతున్న తనిఖీలను ఒకే సమగ్ర యాప్ ద్వారా పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి సంస్థలో నిర్వహించే తనిఖీల వివరాలు, గుర్తించిన లోపాలు, తీసుకున్న చర్యలు, వాటి పురోగతిని ఆన్‌లైన్‌లో నమోదు చేసే విధంగా వ్యవస్థను రూపొందించాలని సూచించారు. సాంకేతికతతో పాటు క్షేత్రస్థాయి మానవ పర్యవేక్షణ కూడా సమాంతరంగా కొనసాగాలని స్పష్టం చేశారు.పాఠశాలల్లో అమలు చేస్తున్న మంచి విధానాలు, ఉత్తమ పద్ధతులను జిల్లాల మధ్య పరస్పరం పంచుకోవాలని, తద్వారా అన్ని రెసిడెన్షియల్ సంస్థల్లో మెరుగైన ప్రమాణాలను అమలు చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. సమస్యలను గుర్తించడమే కాకుండా వాటికి శాశ్వత పరిష్కారాలు చూపే విధంగా అధికారులు పనిచేయాలని సూచించారు.విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వంటశాలలు, ఆహార పదార్థాల నిల్వ, పారిశుద్ధ్యం తదితర అంశాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. క్యాంపస్ పరిసరాల్లో డ్రైనేజీ, పెస్ట్ కంట్రోల్, తాగునీరు, ఇతర మౌలిక వసతులపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్య పరీక్షలు, వైద్య సేవలు, భద్రతా చర్యలు పకడ్బందీగా అమలు చేయాలని, అవసరమైన చోట సంబంధిత శాఖల సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి విజయకుమారి, జిల్లా ఎస్ .సి సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి సునీత, జిల్లా ఎస్.టి సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి ఛత్రు నాయక్, ఆర్.సి.ఓ లు, రెసిడెన్షియల్ పాఠశాలల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజమే లక్ష్యం

టోల్ ప్లాజా వద్ద క్షయ,హెచ్ఐవి-ఎయిడ్స్ అవగాహన సదస్సు -60 మందికి వైద్య పరీక్షలు



పెద్దపల్లి;సెప్టెంబర్ 28:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ చేపట్టిన విద్యా ప్రచార కార్యక్రమం- 2026లో భాగంగా సోమవారం స్థానిక టోల్ ప్లాజా వద్ద క్షయ రహిత సమాజం,హెచ్ఐవి-ఎయిడ్స్ నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.పెద్దపల్లి జిల్లా కలెక్టర్,జిల్లా హెచ్ఐవి-క్షయ నివారణ కార్యక్రమ అధికారి ఆదేశాల మేరకు బసంత్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ సరళి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ శిబిరంలో సుమారు 60 మందికి పైగా సిబ్బందికి,ప్రయాణికులకు ఛాతీ ఎక్స్-రే పరీక్షలతో పాటు వివిధ రక్త పరీక్షలను ఉచితంగా నిర్వహించారు.అలాగే అక్కడి ఉద్యోగులు,యువతతో ప్రమాద స్థాయి అంచనా క్యూఆర్ కోడ్ చరవాణి ద్వారా స్కాన్ చేయించి,వివరాలను నమోదు చేయించారు.ఈ సందర్భంగా వైద్య నిపుణులు మాట్లాడుతూ క్షయ,ఎయిడ్స్ వంటి వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని,ప్రాథమిక దశలోనే గుర్తిస్తే సరైన చికిత్సతో వ్యాధులను నయం చేసుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో టోల్ ప్లాజా నిర్వాహకులు యజ్ఞేశ్వరరావు, రామకృష్ణ,కన్నబాబు,ప్రజా సంబంధాల అధికారి రాము,జిల్లా ఆసుపత్రి ఐసిటిసి సలహాదారు జి.శంకర్,ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ప్రయోగశాల సాంకేతిక నిపుణుడు మధు,ఎక్స్-రే నిపుణుడు రమేష్, పర్యవేక్షకురాలు తులసి,ఏఎన్ఎం దీప,ఆశా కార్యకర్తలు పద్మ,లావణ్య, రాజకుమారి,ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఖమ్మం జయనగర్ కాలనీకి చెందిన డా. జావేద్ ఎం.డి.కి అరుదైన గౌరవం

- గిన్నిస్ వరల్డ్ రికార్డులతో పాటు రైతు సేవలకు గుర్తింపుగా ప్రత్యేక పోస్టల్ స్టాంప్ విడుదల

ఖమ్మం సెప్టెంబర్ 28(ప్రజా కలం న్యూస్)

ఖమ్మం నగరంలోని జయనగర్ కాలనీకి చెందిన డా. జావేద్ ఎం.డి. విద్య , పరిశోధన , సాంకేతిక విజ్ఞానం , సామాజిక సేవ , రైతు సంక్షేమం , రచనా రంగాల్లో విశేష సేవలందిస్తూ జాతీయ , అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు . గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన ఆయన , తాజాగా మరో గిన్నిస్ వరల్డ్ రికార్డ్లో భాగస్వామిగా నిలవడంతో పాటు , రైతుల కోసం చేసిన సేవలకు గుర్తింపుగా తన పేరుతో ప్రత్యేక పోస్టల్ స్టాంప్ లండన్ ఆర్గనైజేషన్ ఆఫ్ స్కిల్స్ డెవలప్మెంట్ సీఈఓ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ పారిన్ సోమాని , యూఓడబ్ల్యూ మలేషియా కేడీయూ పెనాంగ్ యూనివర్శిటీ కాలేజ్ అసోసియేట్ ప్రొఫెసర్ కెప్టెన్ డాక్టర్ జాషువా లూ టెక్ ల చేతుల మీదుగా విడుదల కావడం విశేషంగా నిలిచింది . భూమిబంధన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ద్వారా రైతుల సంక్షేమం కోసం అందించిన సేవలను గుర్తిస్తూ చెన్నై , తమిళనాడు పోస్టల్ విభాగం ద్వారా డా. జావేద్ ఎం.డి. పేరుతో రూ.5 విలువైన ప్రత్యేక పోస్టల్ స్టాంప్ విడుదల చేయబడింది . రైతుల అభివృద్ధి , వ్యవసాయంలో సాంకేతికత వినియోగం , గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాల్లో ఆయన చురుకుగా పాల్గొని 40కి పైగా గ్రామాల్లో రైతులకు మార్గదర్శకత్వం నిలిచాడు . రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరువ చేయడంలో భాగంగా ఆటోమేటిక్ మాన్యూర్ స్ప్రెడర్ , డ్రిప్ ఇరిగేషన్ సాంకేతికతలు , పంటల వ్యాధులను గుర్తించి ముందస్తుగా అంచనా వేసే వ్యవస్థలు వంటి సాంకేతిక పరిష్కారాల అభివృద్ధిలోనూ ఆయన భాగస్వామ్యమయ్యారు మన దేశంతో పాటు మలేషియా , థాయ్లాండ్ , ఇండోనేషియా , దుబాయ్ , నేపాల్ తదితర దేశాల్లో జరిగిన అంతర్జాతీయ సదస్సుల్లో 15కి పైగా కీనోట్ ప్రసంగాలు , పరిశోధనా ప్రదర్శనలు చేశారు . విద్యార్థులు , అధ్యాపకులకు ఆధునిక సాంకేతిక అంశాలపై శిక్షణ , మార్గదర్శకత్వం అందించారు .



దుబాయ్ నుంచి 'రియా'కు ఆర్థిక చేయూత

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధ సెప్టెంబర్ 28:

పత్రికా కథనానికి స్పందించి నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ గ్రామానికి చెందిన చిన్నారి రియా కుటుంబానికి గల్ఫ్ కార్మికుడు ఆపన్నహస్తం అందించారు. కమ్మర్పల్లి మండలం బషీరాబాద్ గ్రామానికి చెందిన బొక్కెన శంకర్ ప్రస్తుతం దుబాయ్లో ఉపాధి పొందుతున్నారు. ఇటీవల పత్రికలో వచ్చిన చిన్నారి రియా దయనీయ పరిస్థితిని చూసి చలించిన ఆయన, తన వంతుగా రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు.



ఈ నేపథ్యంలో సోమవారం దుబాయ్లో ఉన్న శంకర్ తరఫున ఆయన మిత్రులు బైకని మహేష్, గుండోజి నాగేంద్రలు మోర్తాడ్ చేరుకున్నారు. చిన్నారి రియా తండ్రి ఇల్లెందుల శ్రీనివాస్ కుటుంబ సభ్యులను కలిసి రూ. 25 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆపద సమయంలో తమను ఆదుకోవడానికి ముందుకు వచ్చిన బొక్కెన శంకర్తో పాటు ఆయన మిత్రులకు శ్రీనివాస్ కుటుంబం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. సుదూర తీరాల్లో ఉన్నప్పటికీ మానవతా దృక్పథంతో స్పందించిన శంకర్ సేవాభావాన్ని గ్రామస్తులు అభినందించారు.

పాలెం పాఠశాలలో 'నషా ముక్త్ భారత్' ప్రతిజ్ఞ

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబరు 28:

మోర్తాడ్ మండలంలోని పాలెం గ్రామ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం 'నషా ముక్త్ భారత్' (మత్తు పదార్థాలు లేని భారతదేశం) కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా



పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. సమాజంలో, కుటుంబాలలో మత్తు పదార్థాలకు బానిసలైన వ్యక్తులు వివిధ రకాల భయంకరమైన వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్తు అయిన యువత ఇలాంటి వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల వల్ల జరిగే నష్టాల గురించి విద్యార్థులు తమ స్నేహితులకు, తల్లిదండ్రులకు వివరించి అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రాజేందర్, త్రివేణి, రాజేశ్వరి, శ్రీవేణి, నచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

భీంగల్లో అక్రమ ఇసుక ట్రాక్టర్ పట్టివేత : డ్రైవర్పై కేసు నమోదు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబరు 28:

భీంగల్ మండల కేంద్రంలో అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ఒక ట్రాక్టర్ను సోమవారం ఉదయం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... భీంగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బెజ్జొరా బైపాస్ రోడ్డులో ఉదయం సుమారు 7:30 గంటల సమయంలో ఇసుక లోడ్తో వెళ్తున్న ఓ ట్రాక్టర్ను పోలీసులు తనిఖీ చేశారు. ఎటువంటి పత్రాలు, అనుమతులు లేకుండా అనుమానాస్పదంగా ఇసుకను తరలిస్తున్న జాన్ డీర్ కంపెనీకి చెందిన ట్రాక్టర్ (AP15BP1423)ను స్వాధీనం చేసుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్, రాజారం నగర్ కాలనీకి చెందిన సూర రాకేష్ (30)ను విచారించగా అక్రమ రవాణా ఉదంతం వెలుగుచూసింది. ఇసుకతో ఉన్న వాహనాన్ని పోలీస్ స్టేషన్కు తరలించి, డ్రైవర్పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.



యువత భాగస్వామ్యంతోనే బలమైన ప్రజాస్వామ్యం

- బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష

- దాసరి ఉష సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలోకి యువకుల చేరిక



పెద్దపల్లి,సెప్టెంబర్ 28:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) యువతే దేశానికి అసలైన భవిష్యత్తు అని,చైతన్యవంతమైన యువత ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం మరింత పటిష్టమవుతుందని బీఆర్ఎస్ నాయకురాలు,బీసీ జేఏసీ చైర్మన్ దాసరి ఉష స్పష్టం చేశారు. పెద్దపల్లి పట్టణంతో పాటు నియోజకవర్గంలోని పలు వార్డులకు చెందిన యువకులు పార్టీ సిద్ధాంతాలు,నాయకత్వంపై నమ్మకంతో సోమవవారం ఆమె సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా పార్టీలో చేరిన యువతకు ఆమె గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.అనంతరం దాసరి ఉష మాట్లాడుతూ సమాజంలో మార్పు తీసుకురాగల సత్తా ఒక్క యువతకే ఉందని కొనియాడారు.నేటి తరంలో నాయకత్వ లక్షణాలు,సేవా దృక్పథం పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.వార్డులు,గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను గుర్తించి,వాటి పరిష్కారం కోసం నిరంతరం ప్రజల పక్షాన నిలబడి పోరాడాలని దిశానిర్దేశం చేశారు. అధికారంలో ఉన్నా,ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా బీఆర్ఎస్ శ్రేణులు పనిచేస్తాయని,కొత్తగా చేరిన యువకులు పైతం పార్టీ బలోపేతానికి,ప్రజా సంక్షేమానికి తమ శక్తినంతా ధారపోయాలని పిలుపునిచ్చారు. యువతకు పార్టీలో ఎల్లప్పుడూ తగిన గుర్తింపు,సముచిత స్థానం ఉంటాయని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కోఆర్డినేటర్ అబ్దుల్ మాలిక్,నాయకులు అబ్దుల్ ఆదిల్,ఎండి ముఖీత్,అష్ఫల్ పాషా,ఎండి తాజ్,అబ్దుల్ ముజీబ్ తదితరులతో పాటు పెద్దపల్లి పరిధిలోని వివిధ వార్డుల నుంచి యువకులు,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇల్లంద కస్తూర్బా గాంధీ వసతిగృహంలో భద్రత గాలికి??

- మైనర్ రిపేర్లపై నిర్లక్ష్యం ఆరోపణలు.. - గతంలోనూ మిక్సీ బ్లేడ్తో వేలు తెగిన ఘటన!

- సిబ్బంది ప్రాణాలతో చెలగాటమా? - స్పెషల్ ఆఫీసర్ తీరుపై విమర్శలు..

- ఏళ్లుగా ఒకేచోట విధులు నిర్వహిస్తున్నారంటూ ఆరోపణలు

సెప్టెంబర్ 28 వర్ధన్నపేట :- (ప్రజా కలం ప్రతినిధి)

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లందలోని కస్తూర్బా గాంధీ బాలికల వసతిగృహంలో సిబ్బంది భద్రత ప్రశ్నార్థకంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు వేడి నీళ్లు పడి వంట సిబ్బంది నిమ్మనబోయిన విజయలక్ష్మి గాయపడింది. వెంటనే 108కు సమాచారం అందించడంతో సిబ్బంది ఆమెను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో వసతిగృహంలో వంట సిబ్బందికి కల్పిస్తున్న భద్రతా చర్యలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అంతేకాకుండా గతంలోనూ మిక్సీ తోహాహాపనిచేస్తుండగా బ్లేడ్ ఊడిపోయి ఓ సిబ్బంది వేలు తెగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకసారి ప్రమాదం జరిగినా పరికరాల భద్రత, మైనర్ రిపేర్లు, నిర్వహణపై తగిన చర్యలు తీసుకోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వసతిగృహంలో చిన్నచిన్న మరమ్మతులు, వంట పరికరాల నిర్వహణ వంటి అంశాలను ప్రత్యేక అధికారి పట్టించుకోవడం లేదని సిబ్బంది ఆరోపిస్తున్నట్లు సమాచారం.



ప్రమాదం జరిగిన తర్వాతే స్పందించాలా? ముందస్తుగా పరికరాలను తనిఖీ చేసి ప్రమాదాలను నివారించే బాధ్యత అధికారులకు లేదా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

ఈ విషయమై మీడియా ప్రతినిధులు వివరణ కోసం ప్రత్యేక అధికారిని ఫోన్లో సంప్రదించగా, గతంలో మిక్సీ బ్లేడ్ ఎగిరి వచ్చి ఒకరి వేలు తెగిన ఘటనపై ప్రశ్నించగా. నాకేం తెలియదు. మీతో ఆరోపించిన వారిని అడగండి అంటూ సమాధానాన్ని దాటవేసినట్లు తెలిసింది. ఇప్పటికే సంవత్సరాలుగా ఒకేచోట విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, అధికారులపై బదిలీల వ్యవస్థ అమలు కావడం లేదనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ప్రత్యేక అధికారి సిబ్బందితో కఠినంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా వంట సిబ్బందికి గాయాల ఘటన నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి వసతిగృహంలోని వంట పరికరాలు, విద్యుత్ వ్యవస్థ, ఇతర మౌలిక వసతులను పూర్తిస్థాయిలో తనిఖీ చేసి, లోపాలు ఉంటే వెంటనే సరిచేయాలని సిబ్బంది కోరుతున్నారు...

హత్నూరలో రాత్రిపూట బస్సు నిలిపే సదుపాయాన్ని (నైట్ హాల్ట్ బస్ సర్వీస్) పునరుద్ధరించండి: జిల్లా కలెక్టర్కు గ్రామస్తుల విజ్ఞప్తి

హత్నూర, సెప్టెంబర్ 28 (ప్రజా కలం న్యూస్):

హత్నూర మండల కేంద్రం నుండి గతంలో నడిచిన రాత్రిపూట బస్సు నిలిపే సదుపాయాన్ని (నైట్-హాల్ట్ సర్వీస్) వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ, హత్నూర మరియు పరిసర గ్రామాల ప్రజలు జిల్లా కలెక్టర్కు అధికారిక విజ్ఞప్తిని సమర్పించారు. BHEL డిపో నుండి హత్నూర గ్రామానికి గతంలో రాత్రిపూట బస్సు సదుపాయం ఉండేదని, ఉదయం 5 గంటలకు పటాన్చెరుకు వెళ్లాల్సిన స్థానికులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉండేదని గ్రామస్తులు గుర్తుచేశారు. అయితే, ఈ సేవ నిలిపివేయడం వల్ల హైదరాబాద్ మరియు పటాన్చెరుకు నిత్యం ప్రయాణించే ఉద్యోగులు, కార్మికులు మరియు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానికులు ఉదయం 7 గంటలకల్లా పటాన్చెరుకు చేరుకోవాల్సి ఉన్నప్పటికీ, ప్రస్తుత రవాణా సమస్యల కారణంగా వారు సమయానికి అక్కడికి చేరుకోలేకపోతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. నర్సాపూర్ డిపో పరిధిలోని ఈ ప్రాంతం నుండి పటాన్చెరుకు ఉదయం పూట బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రతిపాదిత ప్రత్యామ్నాయం:

దౌల్తాబాద్ నుండి పటాన్చెరుకు వెళ్లే ప్రస్తుత బస్సుల మార్గాన్ని మార్చి, అవి హత్నూర మీదుగా వెళ్లేలా చేయడం ద్వారా తాత్కాలిక పరిష్కారం కనుగొనవచ్చని గ్రామస్తులు సూచిస్తున్నారు. దీనితో పాటు, హత్నూరలో



రాత్రిపూట బస్సు నిలిపే ఏర్పాటు చేయాలని, అలాగే ఉదయం 5 మరియు 6 గంటలకు పటాన్చెరుకు బస్సు సేవలు నడిపేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

విజ్ఞప్తిని సమర్పించిన వారిలో...

తమ రవాణా సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని ఇజ అధికారులతో చర్చించాలని కోరుతూ, హత్నూర మరియు పరిసర గ్రామాల ప్రజల తరపున సంతకాలతో కూడిన విజ్ఞప్తి పత్రాన్ని సమర్పించారు. సంతకాలు చేసిన వారిలో ఎన్. నరసింహులు, నాగేశ, సత్యనారాయణ, అండనగరం రామస్వామి, ఆకుల సంతోష్ కుమార్, ఇదురి పండగ పవన్ కుమార్ మరియు ఇతర గ్రామస్తులు ఉన్నారు. ఈ సమస్యలను పరిష్కరించి, గతంలో అందుబాటులో ఉన్న రాత్రిపూట బస్సు సేవను పునరుద్ధరించాలని వారు జిల్లా కలెక్టర్ను హృదయపూర్వకంగా కోరుతున్నారు.

జగన్ కుటుంబానికి ఆర్ఎంపీ, పిఎంపి డాక్టర్ల ఆర్థిక సాయం



గొల్లపల్లి సెప్టెంబర్ 28 ప్రజాకలం ప్రతినిధి

ఎండపెల్లి మండలంలోని గుళ్లకోట గ్రామానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ సింహాచలం జగన్ కొద్దిరోజుల క్రితం ఆత్మహత్య చేసుకోగా వారి కుటుంబానికి గొల్లపల్లి మండల ఆర్ఎంపీ-పీఎంపీ మిత్రులు మానవతా దృక్పథంతో ఆర్థిక సాయం అందించారు. తమ సహచరుడి మృతితో విషాదంలో ఉన్న అయన కుటుంబానికి తమ వంతు రూ.20 వేల ఆర్థిక సాయాన్ని అందించి అండగా నిలిచారు. జగన్ మృతి ఆర్ఎంపీ-పీఎంపీ మిత్రుల్లో తీవ్ర విషాదాన్ని నింపిందని, ఒక సహచరుడిని కోల్పోవడం చాలా బాధాకరమని ఈ కష్ట సమయంలో జగన్ కుటుంబానికి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మిత్రుడి కుటుంబానికి అందించిన ఈ సహాయం కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాకుండా, ఆప్యాయతకు, మానవత్వానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపి, పిఎంపి అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కుసుమ శంకర్, మండల అధ్యక్షులు గూడా లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి శాతర్ల రవి, గౌరవ అధ్యక్షుడు సాయిని నరహరి, ఉపాధ్యక్షులదు పిట్టల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణికి 140 అర్జీలు

- సత్వర పరిష్కారానికి అధికారులకు డీఆర్వో జయశ్రీ ఆదేశం.

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబరు 28 (ప్రజా కలం ప్రతినిధి) : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ప్రజావాణికి 140 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, వాటిని పరిశీలించారు. సంబంధిత శాఖల అధికారులకు పంపించి నిర్దిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అర్జీదారులకు సకాలంలో పరిష్కారం అందేలా చూడాలన్నారు.

ఆర్డీఓ కార్యాలయాల్లోనూ..

సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి నాలుగు దరఖాస్తులు వచ్చాయి. వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో రెండు అర్జీలు అందాయి. సంబంధిత శాఖల అధికారులకు వాటిని పంపించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో వెంకట మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

బాలాపూర్ గణేష్ నవరాత్రి వేడుకలు ఘనంగా ముగింపు - పోలీసులకు సన్మానం

మహేశ్వరం , సెప్టెంబర్ 27 (ప్రజా కలం):

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం బాలాపూర్ గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా విజయవంతంగా




ముగిసిన సందర్భంగా బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో కృతజ్ఞతా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా శంషాబాద్ జోన్ డీసీపీ రాజేష్, బాలాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ సుధాకర్ ని ఉత్సవ సమితి ఘనంగా సన్మానించింది.ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి చైర్మన్ కల్లెం నిరంజన్ రెడ్డి, కమిటీ పెద్దలు వంగేటి లక్ష్మారెడ్డి, సమ్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కుంట సత్యనారాయణ రెడ్డి, వంగేటి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఉత్సవాలు ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేందుకు సహకరించిన పోలీసు శాఖ, ప్రభుత్వ అధికారులు, కమిటీ సభ్యులు, బాలాపూర్ గ్రామ ప్రజలు, భక్తులు మరియు ప్రతి ఒక్కరికీ బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది.

జెన్నాయి గూడ లక్ష్మీనరసింహా ఆలయంలో ఘనంగా గణేష్ నిమర్జనం

డెవలప్మెంట్ కమిటీ ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జనం ఆలయ మాజీ చైర్మన్ గోనెమోని శివ శంకర్

మహేశ్వరం, సెప్టెంబర్ 28,(ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ జిహెచ్ఎంసి రావిరాల గ్రామం జెన్నాయి గూడ లక్ష్మీనరసింహా ఆలయంలో ఘనంగా గణేష్ నిమర్జన కార్యక్రమం డెవలప్మెంట్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు గణేష్ నిమజ్జనం సందర్భంగా ఆట పాటలతో డప్పు వైద్యాలతో చిన్నపిల్లల



డ్యాన్సులతో నెంబర్ తన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. 11 రోజులపాటు ఘనంగా పూజలు అందుకున్న విఘ్నేశ్వరుడి లడ్డు పొట్టోళ్ల భాస్కర్ లడ్డు కైవసం చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ గోనెమోని శివ శంకర్, రచ్చ లక్ష్మణ్, పిట్టల శ్రీశైలం, పాశం నరసింహ, ఎరుకల సహదేవ్, మునగని నవీన్, ఉప్పునూతల యాదయ్య, ఉప్పునూతల సత్తయ్య, లాలయ్య, పొట్టోళ్ల భాస్కర్, పాలకుర్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ ఒకటి నుండి

ఇర్ఫాని దర్గా 24 వ ఉర్సు ఉత్సవాలు

దర్గా పీఠాధిపతి ఉమర్ బీన్ అహ్మద్.

సంగారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 28 (ప్రజా కలం):

సంగారెడ్డి శివారులోని ఇర్ఫాని దర్గా 24 వ ఉర్సు ఉత్సవాలు అక్టోబర్ 1, 2 వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఇర్ఫాని దర్గా పీఠాధిపతి ఉమర్ బీన్ అహ్మద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 1 వ తేదీన గంధం ఊరేగింపు, అఖిల భారత కవి సమ్మేళనంలో ప్రపంచ ప్రఖ్యాత కవులు పాల్గొంటారని పేర్కొన్నారు. 2 వ తేదీన దీపారాధన, ఖవ్వాలి అన్నదాన కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. భక్తులు వివిధ ప్రాంతాలు ఇతర జిల్లాల రాష్ట్రల నుండి పాల్గొంటారని తెలిపారు.



జర్నలిస్టుల ఇళ్ల కలకు మరింత ఊతం!

- వర్కింగ్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ చైర్మన్‌గా లాయక్ పాషా ఏకగ్రీవం.
- విప్ ఆది శీనన్న సహకారంతో మరింత ముందుకు.



వేములవాడ, సెప్టెంబర్ 28 (ప్రజా కలం ప్రతినిధి) : వేములవాడ ప్రాంతంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు నివేశన స్థలాలు అందించడంతోపాటు ఇప్పటికే మంజూరైన స్థలాలతో ఏర్పడుతున్న జర్నలిన్ట కాలనీ అభివృద్ధికి సమన్వయంతో ముందుకు సాగేందుకు వేములవాడ వర్కింగ్ జర్నలిన్టల హౌసింగ్ సొసైటీకి లాయక్ పాషాను చైర్మన్‌గా ఏకగ్రీవంగా నియమిస్తూ ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది.

మంజూరైన స్థలాల అభివృద్ధిపై దృష్టి..

వేములవాడ మున్సిపల్ పరిధిలోని ఆరో వార్డులో సర్వే నంబర్ 391లో జర్నలిస్టుల కోసం మంజూరైన నివేశన స్థలాలతో కాలనీ రూపుదిద్దుకుంటోంది,అయితే స్థలాలు మంజూరు కావడం ఒక దశ మాత్రమేనని వాటిని నివాసయోగ్యంగా మార్చేందుకు రహదారులు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని జర్నలిస్టులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కాలనీ అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు కొత్తగా బాధ్యతలు స్వీకరిం చిన చైర్మన్ లాయక్ పాషా తెలిపారు.

60 మంది జర్నలిస్టుల స్థలాల కోసం గతంలో ప్రయత్నం..

వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల సాధన ప్రక్రియలో గతంలోనూ లాయక్ పాషా కీలకంగా వనిచేశారు,నుమారు 60 మంది జర్నలిన్టలకు నివేశన స్థలాలు కల్పించేందుకు జరిగిన ప్రయత్నాల్లో ముఖ్య భాగస్వామ్యం కావడంతో పాటు, ప్రస్తుతం ఏర్పడుతున్న కాలనీకి నంబంధించిన వలు అంశాలపై అధికారుల దృష్టికి నమన్యలను తీసుకెళ్లినట్లు తెలిపారు.

కాలనీలో తొలి అడుగులు

జర్నలిన్ట కాలనీలో మొట్టమొదటిసారిగా బొడ్రాయి ఏర్పాటు చేసి నిర్మాణ ప్రక్రియకు శ్రీకారం చుట్టడం, ఇంటి నంబర్ తీసుకోవడం వంటి కార్యక్రమాలు లాయక్ పాషా ఆధ్వర్యంలోనే జరిగాయి. కాలనీకి విద్యుత్ సౌకర్యం కూడా అందుబాటులోకి వచ్చింది

ఇవి కాలనీ నిర్మాణానికి ప్రాథమిక వసతులు

ఏర్పడుతున్నాయనడానికి సంకేతాలుగా నిలుస్తున్నాయి.

నీటి సమస్యకు రెండు బోర్లు..

కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనపై ఇటీవల ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యేను కలిసి వినతివత్రం సమర్పించినట్లు లాయక్ పాషా తెలిపారు. జర్నలిన్ట కాలనీ అవనరాలను వివరించడంతో రెండు బోరుబావులు మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు, నీటి వసతి ఏర్పాటైతే కాలనీలో నిర్మాణ పనులు, భవిష్యత్తులో నివాసం ఏర్పరుచుకునే కుటుంబాలకు కొంతమేర ఇబ్బందులు తగ్గే అవకాశం ఉంది.

మిగిలిన అర్హులకూ స్థలాలే లక్ష్యం..

ప్రస్తుతం మంజూరైన స్థలాలతో పాటు ఇంకా కొంతమంది అర్హులైన జర్నలిస్టులకు నివేశన స్థలాలు అందాల్సి ఉందని లాయక్ పాషా తెలిపారు. అర్హత ఉన్న ప్రతి జర్నలిస్టుకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి స్థలాల సాధనకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

సొసైటీ ముందున్న అసలు సవాలు ఇదే..

హౌసింగ్ సొసైటీకి చైర్మన్ నియామకంతో బాధ్యత పూర్తికాదని, ఇప్పటికే మంజూరైన స్థలాలను పూర్తి స్థాయి జర్నలిస్టు కాలనీగా తీర్చిదిద్దడమే అసలు సవాలన్నారు,

వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో జర్నలిస్టుల హక్కులు, సంక్షేమంపై మరింత ముందుకు సాగుతామన్నారు.భూమి, రహదారులు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలతో పాటు అర్హులైన మిగిలిన జర్నలిస్టులకు స్థలాల సాధన, ప్రభుత్వ శాఖలతో నిరంతర సమన్వయం వంటి అంశాలు సొసైటీ ముందున్న ప్రధాన బాధ్యతలుగా మారనున్నాయి.

ఈ నేపథ్యంలో హౌసింగ్ సొసైటీని నమర్థవంతంగా నిర్వహినన్తా జర్నలిస్టులందరి భాగస్వామ్యంతో కాలనీ అభివృద్ధికి కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉందని పలువురు జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. ఏకగ్రీవ నియామకంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని, జర్నలిన్టల ప్రయోజనాల కోసం అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని లాయక్ పాషా తెలిపారు.హౌసింగ్ సొసైటీ చైర్మన్ గా నియమితులైన లాయక్ పాషకు పుర ప్రముఖులు, న్యాయవాదులు, జర్నలిస్టు సంఘం నాయకులు, సహచర జర్నలిస్టులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజావాణి లో వచ్చిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి .. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.

సంగారెడ్డి, ప్రతినిధి సెప్టెంబర్ 28(ప్రజా కలం): ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన అర్జీలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, అర్హత మేరకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు పాల్గొని ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. వివిధ



ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలను స్వయంగా ఆలకించిన కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులకు దరఖాస్తులను పంపించి, వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు . ప్రజావాణిలో మొత్తం 65 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిలో సంగారెడ్డి డివిజన్‌కు12 , నారాయణఖేడ్ డివిజన్‌కు 05,జహీరాబాద్ డివిజన్‌కు 05,అందోల్ డివిజన్‌కు ఎలాంటి వినతులు అందలేదని , కలెక్టరేట్‌కు 43 దరఖాస్తులు అందాయని, అందోల్ డివిజన్‌కు ఎలాంటి వినతులు అందలేదని వెల్లడించారు. ప్రజావాణిలో ప్రధానంగా రెవిన్యూ, హౌసింగ్,పెన్షన్లు, పంచాయతీరాజ్, ఆర్ డెబ్యూ ఎస్ ,మిషన్ భగీరథ గ్రిడ్, పోలీస్,సోషల్ వెల్ఫేర్ ,సర్వే ఆ ల్యాండ్ రికార్డు , మహిళా ,శిశు, వికలాంగులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, పి సి బి ,ఎల్ డి ఏం ,వైద్య ఆరోగ్య శాఖ .మునిసిపల్ శాఖలకు సంబంధించిన పిర్యాదులు అందాయి . ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, డీఆర్డీఓ జ్యోతి, సంగారెడ్డి ఆర్డీఓ రాజేందర్, బీసీ సంక్షేమాధికారి జగదీష్, సాంఘిక సంక్షేమాధికారి అఖిలేష్ రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షురాలు పారిజాత నర్సింహారెడ్డిని సన్మానించిన మాజీ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి

కందుకూరు, సెప్టెంబర్ 28 (ప్రజా కలం):

కందుకూరు మండల కాంగ్రెస్ నాయకులు రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డిని వారి నివానంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా



జిల్లావ్యాప్తంగా పార్టీని పూర్తిస్థాయిలో బలోపేతం చేయాలని మాజీ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, కందుకూరు హెడ్ క్వార్టర్ సర్పంచ్ సరికొండ పాండు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుమ్మడవెల్లి సర్పంచ్, మురళీనగర్ సర్పంచ్, మాజీ సర్పంచులు, వార్డు మెంబర్లు, నిమ్మ రాజశేఖర్ రెడ్డి, కందడి నరసింహ, మోటి రమేష్, కృష్ణ, మహేశ్వరం మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గాండ్ల ప్రశాంత్, సురేందర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, బీసీ సెల్ మాజీ అధ్యక్షులు సరికొండ జగన్, ఐఎన్టీయూసీ మండల అధ్యక్షులు గాదె కుమార్, ఎన్ఎస్‌యూఐ జిల్లా నాయకులు ప్రభు ఏలేటి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి, రాంరెడ్డి, గుండ్రా సుధాకర్ రెడ్డి, సరికొండ చిన్న జగన్, చిర్ర సాయిలు, నరసింహ, జంగా చారి, కొండల్ రెడ్డి, ఢిల్లీ శ్రీధర్, ఎడ్ల కృష్ణ, పాముల కృష్ణ, వేణుగోపాల్, రవీందర్, వినోద్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బోర్ మోటార్ల చోరీలకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్.
రూ.1.13 లక్షల విలువైన సొత్తు స్వాధీనం.

దుబ్బాక ప్రజాకలం సెప్టెంబర్ 28.

రైతుల వ్యవసాయ బోర్‌వెల్ మోటార్లను చోరీ చేస్తున్న వ్యక్తిని రాయపోల్ పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి మూడు బోర్ మోటార్లు, రూ. 6 వేల నగదు, చోరీలకు ఉపయోగించిన ద్విచక్రవాహనం, రంపం పారా స్వాధీనం చేసుకున్నారు. మొత్తం స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ. 1.13 లక్షలు.తొగుట సీఐ లతీఫ్ తెలిపిన వివరాల ప్రకారం రాయపోల్ పరిధిలో నాలుగు, దౌల్తాబాద్ పరిధిలో ఒకటి చొప్పున మొత్తం ఐదు చోరీలకు పురుషోత్తం బాబు (37) పాల్పడినట్లు గుర్తించారు. వ్యవసాయ భూముల వద్ద బోర్ మోటార్లను రంపంతో కట్ చేసి ద్విచక్రవాహనంపై తరలించి, ఇనుప సామగ్రి కొనుగోలుదారులకు విక్రయించేవాడని విచారణలో తేలింది. లింగారెడ్డిపల్లి శివారులో చోరీ చేసిన మోటారును గజ్వేల్‌కు తరలిస్తుండగా కొత్తపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో నిందితుడు పట్టుబడ్డాడు. అతని నుంచి మోటార్, రంపం స్వాధీనం చేసుకుని విచారించగా గతంలో చేసిన చోరీలను అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. సీపీ రశ్మి పెరుమాళ్ పర్యవేక్షణలో, గజ్వేల్ ఏసీపీ నర్సింలు ఆదేశాలతో సీఐ లతీఫ్, ఎస్ఐ మానస ఆధ్వర్యంలో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

ఘనంగా వినాయకుడి నిమజ్జనం

ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్28 రేగోడులోని గల్లి కా గణేష్ మండపం వద్ద



గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గణేష్ శోభాయాత్రను వైభవంగా చేపట్టారు. శోభాయాత్రలో చిన్నారుల నాట్యాలు, యువకుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం వినాయక విగ్రహాన్ని చెరువులో నిమజ్జనం చేశారు.ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ శ్రీధర్ గుప్తా, మాజీ ఎంపీటీసీ గొల్ల నర్సింలు, కో ఆప్షన్ మాజీ సభ్యుడు చోటు మియా, పిఎసిఎస్ వైస్ చైర్మన్ రాధాకిషన్, డైరెక్టర్ నాగేందర్ రావు కులకర్ణి, బి ఆర్ ఎస్ గ్రామ అధ్యక్షుడు సుభాష్, సంగమేశ్వర్, తెలంగాణ రాష్ట్ర ఉత్తమ సీనియర్ జర్నలిస్ట్ తూర్పు సంతోష్ కుమార్, అనిల్, శేఖర్, సంగప్ప, శివ కుమార్, శంకర్, పవన్, బస్వరాజ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రాక.. ఏర్పాట్లు పకడ్బందీ

- హెలిప్యాడ్ నుంచి సభాస్థలి వరకు భద్రత కట్టుదిట్టం.



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబరు 28 (ప్రజా కలం ప్రతినిధి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 30న రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. సోమవారం రగుడు బైపాస్ రోడ్డులోని బహిరంగ సభాస్థలిని ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్, కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి.గితె, కామారెడ్డి ఎస్పీ రాజేష్‌చంద్ర, ఐఎస్‌డబ్ల్యూఎన్‌సీ ఎస్పీ మాధవరావుతో కలిసి పరిశీలించారు.అంతకుముందు సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల మైదానంలో కొనసాగుతున్న హెలిప్యాడ్ నిర్మాణ పనులను కలెక్టర్, ఎస్పీలు పరిశీలించారు. హెలిప్యాడ్ నుంచి సభాస్థలికి సీఎం చేరుకునే మార్గంలో భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు పకడ్బందీగా చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాలో వలు అభివృద్ధి వనులకు శంకుస్థాపనలు చేయనున్నారని ఆది శ్రీనివాస్ తెలిపారు. అనంతరం రగుడు బైపాస్ రోడ్డులోని మైదానంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఏర్పాట్లపై సమీక్ష...

సీఎం పర్యటన నేపథ్యంలో కలెక్టరేట్‌లో కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి.గితె తదితర అధికారులు వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. హెలిప్యాడ్, సభా వేదిక, పార్కింగ్ ఏర్పాట్లను త్వరితగతిన వూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు, జిల్లా వంచాయతీ అధికారులు పారిశుధ్యం, తాగునీటి వసతి కల్పించాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఎన్‌పీడీసీఎల్ అధికారులకు సూచించారు. ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీధర్‌బాబు, కేఎన్‌బీ కుమారి, ఆర్‌అండ్‌బీ ఈఈ భీమ్లానాయక్, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్, ఎక్సైజ్ అధికారి హిమశ్రీ, డీఎస్పీలు నాగేంద్రాచారి, నర్సిరెడ్డి, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి
రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాది రెడ్డి
బాలాపూర్ మండల కార్యదర్శి ముకుందం గారి చంద్రశేఖర్ రెడ్డి

మహేశ్వరం, సెప్టెంబర్ 27 (ప్రజా కలం):

కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బాలాపూర్ మండల సమితి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ



బీజేపీ ప్రభుత్వ 12 ఏళ్ల పాలన అస్తవ్యస్తంగా ఉందని, పేదవాడికి ఈ దేశంలో నిలువ నీడ లేకుండా చేస్తోందని విమర్శించారు. ఎక్కడ గెలవాలనుకుంటే అక్కడ గెలిచే విధంగా ఎన్నికల కమిషన్‌ను వాడుకుని దేశాన్ని తమ చెప్పుచేతల్లో పెట్టుకుని నడిపిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్నారు. మోడీ బాటలో నడుస్తున్న కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ ఇచ్చిన ఓటు హక్కును కాలరాస్తున్నారని ఆరోపించారు.ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాది రెడ్డి, బాలాపూర్ మండల కార్యదర్శి ముకుందం గారి చంద్రశేఖర్ రెడ్డి, మండల సహాయ కార్యదర్శి రమావత్ రెడ్యా నాయక్, లెనిన్ నగర్ శాఖ గిరిజన సమైక్య కార్యదర్శి కె. శీను నాయక్, ఇంద్రానగర్ శాఖ కామ్రేడ్స్ కృష్ణ, మాసయ్య, బాబురావు, వీరయ్య, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల వికాసానికి భూరీ విరాళం

- రూ. 7 లక్షల సామాగ్రి పంపిణీ చేసిన ఎమ్మెల్యే వేముల
- ముచ్కూర్, ఏర్గట్ల, పచ్చలనడ్కూడ
హైస్కూళ్లకు సైన్స్ ల్యాబ్ మెటీరియల్
- భీంగల్ కస్తూరిబా విద్యాలయానికి 35 డ్యూయల్ డెస్క్‌లు



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబర్ 28: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన విద్యాబోధనే ధ్యేయంగా బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సౌజన్యంతో భారీ విరాళం సమకూరింది. ఆయన వియ్యంకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త ఏనుగు దయానంద్ రెడ్డి సహకారంతో రూ.7 లక్షల విలువైన పాఠశాల సామాగ్రిని సోమవారం వేల్పూర్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఆయా పాఠశాలల ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ముచ్కూర్, ఏర్గట్ల, వచ్చలనడ్కూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ప్రయోగాత్మక విద్యను అందించేందుకు ఒక్కొక్కటి రూ. 1,80,000 విలువైన సైన్స్ ల్యాబ్ మెటీరియల్‌ను వంపిణీ చేసినట్లు తెలిపారు. విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొం దించేం దుకు ఈ ల్యాబ్ పరికరాలు ఎంతగానో దోహదపడతా యని పేర్కొన్నారు. అదేవిధంగా భీంగల్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయానికి రూ. 1,46,650 విలువైన 35 డ్యూయల్ డెస్క్ బెంచీలను అందజేశారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు పారిశ్రామికవేత్త దయానంద రెడ్డి ముందుకు రావడం అభినంద నీయమన్నారు. భవిష్యత్తు లోనూ అవసరమైన చోట విద్యా రంగానికి తమ సహాయ సహకారాలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గ్రామ అభివృద్ధి కమిటీ (వీడీసీ) సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

రాయపోల్ ఎంపీడీవో శ్రీనివాస్ సేవలు మరువలేనివి.

దుబ్బాక ప్రజాకలం సెప్టెంబర్ 28.

రాయపోల్, సెప్టెంబర్ 28: రాయపోల్ మండల ఎంపీడీవోగా ఏడేళ్లపాటు విధులు నిర్వహించి బదిలీపై మద్దూరు మండలానికి వెళ్తున్న సందర్భంగా సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోకు వీడ్కోలు నమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. రాయపోల్ మండలం ఏర్పాటుకు ముందునుంచే ఈ ప్రాంతంతో తనకు అనుబంధం ఉందన్నారు. నారాయణరావుపేటకు డిప్యూటేషన్‌పై వెళ్లి తిరిగి రాయపోల్‌కు రావడం జరిగిందని తెలిపారు. ప్రజలకు సేవ చేయడంలో ఎంతో సంతృప్తి ఉందన్నారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తన కుటుంబ సభ్యుల్లాంటివారని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ప్రత్యేకంగా కృషి చేసినట్లు తెలిపారు. సర్పంచులు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే మండలం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రేకుల నర్సింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరులో షహీద్ భగత్ సింగ్ 119వ జయంతి వేడుకలు

సిపిఐ మండల కార్యదర్శి కొమ్మగళ్ళ రాజు

కందుకూరు, సెప్టెంబర్ 28 (కిరణాలు):

కందుకూరు మండల కేంద్రంలో షహీద్ భగత్ సింగ్ 119వ జయంతి వేడుకలను భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మండల సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ మండల కార్యదర్శి కొమ్మగళ్ళ రాజు హాజరై భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. “భగత్ సింగ్ దేశ స్వాతంత్ర్యం కోసం 23 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణత్యాగం చేసిన మహనీయుడు. ఆయన ఆశయం కేవలం బ్రిటిష్ వారిని తరిమికొట్టడం మాత్రమే కాదు, దోపిడీ లేని సోషలిస్టు సమాజాన్ని నిర్మించడం. నేటి యువత భగత్ సింగ్ స్ఫూర్తితో దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడటానికి ముందుకు రావాలి” అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి ప్రవీణ్, సహాయ కార్యదర్శి కవిత, జంగయ్య, రాములు, మహమ్మద్ సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



సమసమాజ స్థాపనే భగత్ సింగ్‌కు నిజమైన నివాళి

అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా 119వ జన్మదిన వేడుకలు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబర్ 28:

భారత స్వాతంత్ర్య సమరయోధుడు, షహీద్-యే-ఆజమ్ భగత్ సింగ్ 119వ జయంతి వేడుకలు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ సమీపంలోని మామిడిపల్లి చౌరస్తా వద్ద సోమవారం ఘనంగా జరిగాయి. డాక్టర్ అంబేడ్కర్ యువజన



సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో బహుజన నాయకులు పాల్గొని భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బ్రిటీష్ నిరంకుశ పాలన పునాదులను కదిలించిన వీరుడు భగత్ సింగ్ అని కొనియాడారు. దేశంలో దోపిడి భూస్వామ్య, పెట్టుబడిదారీ విధానాలతో పాటు విదేశీ కంపెనీల దోపిడీని అరికట్టి, సమసమాజం నిర్మించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఏవైఎస్ జిల్లా అధ్యక్షులు ఇత్వార్పేట్ లింగం, శ్రీనివాస్ పద్మశాలి, రాము ఓడ్డరన్న, టీచర్ సామ్రాట్ అశోక్ (సంగెం), మాసం రాజయ్య కాపు, మూలనివాసి మాలజీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు 'ఇంక్విలాబ్ జిందాబాద్', 'భగత్ సింగ్ అమర్ రహే', 'సామాజిక న్యాయం వర్ధిల్లాలి' అంటూ చేసిన నినాదాలు హోరెత్తించాయి.

తాళ్ళరాంపూర్ సాంఘిక బహిష్కరణపై 'జేఏసీ', 'ధర్మ సమాజ్ పార్టీ' ఆగ్రహం

బాధ్యులైన వీడీసీ సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబరు 28:

నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలం తాళ్ళరాంపూర్ గ్రామంలో గౌడ గీత కార్మికులు, దళిత కుటుంబాలపై విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ (వీడీసీ) విధించిన సాంఘిక బహిష్కరణపై బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ, ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్‌పీ) మరియు గౌడ కుల సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి.



సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. గత వారం (సెప్టెంబరు 22న) గ్రామానికి చెందిన 39 గౌడ కుటుంబాలను, 10 దళిత కుటుంబాలను బహిష్కరించడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుమన్ మాట్లాడుతూ.. ఆధునిక సమాజంలో ఇంకా సాంఘిక బహిష్కరణలు కొనసాగడం సిగ్గుచేటన్నారు. ఈ ఘటనపై జిల్లా యంత్రాంగం, పోలీసులు సుమోటోగా స్పందించి, బాధ్యులైన వీడీసీ సభ్యులపై కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు రామా గౌడ్, రాష్ట్ర నాయకుడు ప్రేమ్ కుమార్, సుమన్ డీఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ మహారాజ్, కేజీకేఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహులు, డీఎస్‌పీ నాయకులు సుభాష్,ఉమేష్, మురళీ, సాగర్ చారి, శ్రీకాంత్ తదితరులు పాల్గొని బాధితులకు తమ పూర్తి మద్దతు ప్రకటించారు.

ప్రజావాణి కి మూడు దరఖాస్తులు - ఆర్డీఓ ప్రభాకర్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28 ప్రజా కలం : ఎల్లారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారి ఎల్లారెడ్డి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డివిజన్ స్థాయి ప్రజావాణికి మూడు ఫిర్యాదులు వచ్చినట్లు ఆర్డీవో ప్రభాకర్ తెలిపారు. వీటిలో నీటిపారుదల శాఖ కు సంబంధించినది ఒకటి, సివిల్ సప్లయ్ శాఖ కు సంబంధించిది ఒకటి కాగా మరొకటి మున్సిపల్ శాఖ కు సంబంధించినది ఉందన్నారు. అనంతరం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన డిఎల్పిఓ సురేందర్ పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. పదవీకాలంలో సురేందర్ అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తన పదవీకాలంలో ప్రజలకు నిస్వార్థంగా సేవ చేసి వారి మన్ననలను పొందాలన్నారు. అనంతరం ఆయన సురేందర్ ను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ అధికారులు, సిబ్బంది, ఎంపీడీవో కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను అరెస్ట్ చేయాలి

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతారావు డిమాండ్

- కామారెడ్డి జిల్లా కేంద్రంలో సిఈసి దిష్టిబొమ్మ దగ్ధం



కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28 ప్రజా కలం : ఎన్నికల ప్రక్రియను నిర్వీర్యం చేస్తున్న సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను దేశద్రోహిగా ప్రకటించి అరెస్ట్ చేయాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు డిమాండ్ చేశారు. కామారెడ్డి కలెక్టరేట్ వద్ద ఓటు చోరీపై సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా చేపట్టారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత రావు మాట్లాడుతూ.. ఓటు చోరీ అంశాన్ని వెలుగులోకి తెచ్చిన రాహుల్ గాంధీ వెంట దేశం మొత్తం నిలబడుతోందన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఒంటెద్దు పోకడలు పోతున్నారని విమర్శించారు. కుటిల నీతితో ఓట్లను తొలగించి ఫారం-6ను ఏకపక్షంగా తయారు చేసి యువకులను ఓటు హక్కులో పాల్గొనకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మలని పేర్కొన్నారు. ఓటు చోరీపై పూర్తిస్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ ఇలియాస్, మాజీ డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డికి ఘన స్వాగతం



కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28 ప్రజా కలం : కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణానికి విచ్చేసిన తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డికి సోమవారం జిల్లాలోని జర్నలిస్టులో ఘన స్వాగతం పలికారు. ముందుగా బాన్సువాడ పట్టణ పరిధిలోని కొయ్యగుట్ట వద్ద గల అమరవీరుల స్థూపం వద్ద పూలమాల వేసి తెలంగాణ అమరవీరులకు ఆయన నివాళులర్పించారు. బాన్సువాడలోని ఎస్ఆర్ఎన్ కే డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న రెండు రోజుల జర్నలిస్టుల శిక్షణ తరగతులకు ఆయన హాజరయ్యారు. జిల్లాలోని ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల్లో పని చేస్తున్న జర్నలిస్టులకు రెండు రోజులపాటు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు కామారెడ్డి జిల్లా టియుడబ్ల్యూజే ఐజేయు అధ్యక్షులు రజనీకాంత్ తెలిపారు. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర, ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించడంలో మీడియా బాధ్యత, జర్నలిస్టులు వృత్తిపరంగా ఎదుర్కొంటున్న సవాళ్లు, తదితర అంశాలపై శిక్షణా తరగతులలో చర్చించ నున్నట్లు ఆయన తెలిపారు. జర్నలిస్టులలో ప్రతిభనుమరింత మెరుగువరిచేందుకు ఈ శిక్షణ తరగతులు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. రెండు రోజులపాటు జరిగే శిక్షణ కార్యక్రమంలో ఆయా నియోజకవర్గాలకు చెందిన జర్నలిస్టులు పాల్గొననున్నారు. అనంతరం చారిత్రాత్మక నిజాంసాగర్ ప్రాజెక్టును ఆయన జర్నలిస్టులతో కలిసి సందర్శించారు. ప్రాజెక్టు నీటి నిలువ సామర్థ్యం తదితర వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లతీఫ్, ఐజేయు జిల్లా కార్యదర్శి రాజేష్, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ప్రెసిడెంట్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సుధాకర్ గౌడ్, జిల్లా జర్నలిస్టులు పోశిరాం, రాజేశ్వర్ రెడ్డి, మహమ్మద్ మోహినుద్దీన్, సాయ గౌడ్, బర్ల సుధాకర్, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తమ భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి

- కలెక్టరేట్ ముందు హాజీపూర్ తండా గిరిజనుల ధర్నా



కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28 ప్రజాకలం : గత కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్న తమ భూములకు వెంటనే హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముందు సోమవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్ తాండ గిరిజనలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోతి రామ్ నాయక్ మాట్లాడుతూ.... హాజీపూర్ తండాలో 70 కుటుంబాలు గత 60 ఏళ్లుగా సర్వే నంబర్ 66లో 40 ఎకరాలు, 176లో 13 ఎకరాలు, 177లో 40 ఎకరాలు, అదనంగా 40 ఎకరాల పోడు భూమిని సాగు చేసుకుంటు న్నాయని తెలిపారు. ఇప్పటి వరకు ఒక్క గుంట భూమికి కూడా పట్టా ఇవ్వలేదని, అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. రెండు విడతలుగా పోడు భూములకు పట్టాలు ఇచ్చినా హాజీపూర్ తండా వాసులకు ఒక్క సెంటు కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ అధికారులు రోజూ తండాలో తిరుగుతూ గిరిజన రైతులను భయ భ్రాంతులకు గురి చేస్తున్నారని, కేసులు పెడతామని, జైలుకు పంపుతామని బెదిరిస్తూ పది మంది పేర్లు ఇవ్వాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు.

2005 చట్టం ప్రకారం రెవెన్యూ, అటవీ భూమి అయినా సరే సర్వే చేసి హక్కుపత్రాలు ఇవ్వాలని, గిరిజనులను ఇబ్బంది పెట్టడం సరికాదని అన్నారు. వెంటనే సర్వే నిర్వహించి 70 కుటుంబాలకు పట్టా హక్కు పత్రాలు ఇచ్చి ఆదుకోవాలని కలెక్టర్ ను కోరినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు వినోద్, ఎంపీటీసీ కిషన్ నాయక్, నరేష్ నాయక్, శంకర్ నాయక్, దేవుల నాయక్, సురేందర్ నాయక్, దేవిసింగ్ పాల్గొన్నారు.

ప్రజావాణిలో 36 ఫిర్యాదులు స్వీకరించిన నిజామాబాద్ సీపీ పి.సాయి చైతన్య

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) సెప్టెంబర్ 28:

ప్రజలు ఎలాంటి పైరవీకారులను ఆశ్రయించకుండా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా నేరుగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ (సీపీ) శ్రీ పి.సాయి చైతన్య, ఐ.పి.యస్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో ఆయన పాల్గొని, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై బాధితుల నుంచి మొత్తం 36 ఫిర్యాదులను సీపీ స్వీకరించారు. ఆయా సమస్యల తీవ్రతను బట్టి తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో సీపీ ఫోన్ ద్వారా మాట్లాడి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం సీపీ సాయి చైతన్య



మాట్లాడుతూ.. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తోందని, పోలీసు సేవలను ప్రజలకు మరింత దగ్గర చేసేందుకే ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి నేరుగా పోలీసులను సంప్రదించాలని కోరారు.



ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కేటాయించిన 5 ఎకరాల భూమిని పై విచారణ జరపాలి

-బొమ్మలరామారం సర్పంచ్ కట్ట ఉమాదేవి శ్రీకాంత్ గౌడ్

బొమ్మలరామారం, సెప్టెంబర్ 28 (ప్రజా కలం)

మండలంలోని ప్రభుత్వ కళాశాలకు కేటాయించిన 5 ఎకరాల భూమిని మరియు ప్రభుత్వం బీసీ కాలనీకి ఐదు ఎకరాల భూమిని కేటాయించి ప్లాట్లుగా చేసి నిరుపేదలకు మంజూరు చేసిన భూమిని అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ అధికారులతో విచారణ జరిపించాలని బొమ్మలరామారం సర్పంచ్ కట్ట ఉమాదేవి శ్రీకాంత్ గౌడ్ సోమవారం రోజున ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి లో నోడల్ అధికారి అయిన ఎంపీడీవో శ్యామల కు వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలకు కేటాయించిన 5 ఎకరాల భూమిని పూర్తి సర్వే చేసి ఐదు ఎకరాల భూమిని కళాశాలకు కేటాయించాలని అన్నారు దానితో పాటుగా గ్రామంలో ఉన్న బీసీ కాలనీకి ప్రభుత్వం ఐదు ఎకరాల భూమి ని కేటాయించి ప్లాట్లుగా చేసి నిరుపేదలకు ఇవ్వడం జరిగిందని అన్నారు 5 ఎకరాల భూమిలో ఎన్ని ప్లాట్లు చేశారు ఎంతమందికి ఇచ్చారు మిగతా భూమి కబ్జాకు ఏమైనా గురైందా? నిరుపేదలకు ఇచ్చిన భూమిని లో అవతకతలు జరిగాయని వచ్చిన సమాచారం పై పూర్తి విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎలబోయిన జంగయ్య తదితరులు పాల్గొన్నారు



శ్రీశైల శ్రీమల్లికార్జున స్వామిని దర్శించుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య.

శ్రీశైల దేవస్థానం, సెప్టెంబర్ 28 (ప్రజా కలం)

ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు ప్రతి కుటుంబానికి చేరాలని శ్రీ మల్లికార్జున స్వామివారిని ప్రార్థించినట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు సోమవారం రోజున భ్రమరాంబ మల్లికార్జున స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ నందర్భంగా ఆలయానికి చేరుకున్న బీర్ల అయిలయ్యకి ఆలయ అర్చకులు,అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు.అనంతరం శ్రీ మల్లికార్జున స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.అలాగే అమ్మవారి సన్నిధిలో శ్రీ భ్రమరాంబ దేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని,తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు ప్రతి కుటుంబానికి చేరాలని శ్రీ మల్లికార్జున స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.శ్రీశైలం వంటి పవిత్ర పుణ్యక్షేత్రాన్ని సందర్శించడం ఎంతో ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని,స్వామివారి దర్శనం మనసుకు ప్రశాంతతను,ఆధ్యాత్మిక శక్తిని అందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు,అధికారులు,స్థానిక ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బెదిరించిన కేసులో నలుగురు విలేకరుల అరెస్ట్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28 ప్రజా కలం : కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండల పరిధిలో వడ్ల లోడ్ తో ఆగి ఉన్న లారీని అడ్డగించి డ్రైవర్ను డబ్బులు డిమాండ్ చేసిన కేసులో నలుగురు విలేకరులను అరెస్టు చేసినట్లు స్థానిక డిఎస్పి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసు వివరాలు వెల్లడించారు. ఫిర్యాదుదారుడు సకినాల సురేందర్ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం... ఈనెల 26వ తేదీ రాత్రి వడ్ల లోడ్తో వెళ్తున్న టీఎస్ 05 యుడి 4689 లారీని ఎల్లారెడ్డి మండలంలోని మల్లయ్య పల్లి గ్రామ శివారులో అడ్డగించి, తాము విలేకరులమని, వడ్ల రవాణాకు సంబంధించిన పత్రాలు చూపించా లన్నారు. లేకపోతే తాము ఒక్కొక్కరికి 30 వేల చొప్పున 1,20,000 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. లేకపోతే చంపుతామని లారీ డ్రైవర్ ను బెదిరించినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఫిర్యాదు దారుడు సురేందర్ స్థానిక పోలీస్ స్టేషన్లో నలుగురు విలేకరులపై ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఈ ఘటనపై కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు స్థానిక సిఐ, ఎస్ఐల ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. అనంతరం నిందితులు మహమ్మద్ అబ్దుల్ మోసిన్, ఎడ్ల మహేష్ కుమార్, బుద్దే ఆనంద్, గాండ్ల సుధీర్ కుమార్ లను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఆయన తెలిపారు. అనంతరం వ్యాగనర్ కారు, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పి స్పష్టం చేశారు. వృత్తిని అడ్డుపెట్టుకొని చట్టాన్ని ఉల్లంఘించి, నేరాలకు పాల్పడే వ్యక్తులు చట్టం నుంచి తప్పించుకోలేరని తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా దర్యాప్తు చేపట్టే నిందితులను గుర్తించి అరెస్టు చేసిన ఎల్లారెడ్డి పోలీసులను జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర అభినందించారు. ఈ సమావేశంలో స్థానిక సీఐ రాజారెడ్డి, ఎస్సై రాజు, పోలీస్ సిబ్బంది అనిల్ గౌడ్, ఇద్రీస్ పాల్గొన్నారు.



అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు ఘన సన్మానం

సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా అంగన్ మిలాన్ కార్యక్రమం



మెదక్ సెప్టెంబర్ 28 (ప్రజాకలం ప్రతినిధి)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా అంగన్ మిలాన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పట్లోళ్ల మల్లిక అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలు, ఆర్‌పీలను ఘనంగా సన్మానించారు.

పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా విద్య, ఆటపాటలతో పాటు పౌష్టికాహారం అందిస్తూ వారి ఎదుగుదలను నిరంతరం పర్యవేక్షిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది సేవలను కార్యక్రమంలో కొనియాడారు. గర్భిణులు, బాలింతలకు పాలు, గుడ్లు, పౌష్టికాహారం అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

అదేవిధంగా చిన్నారుల ఆరోగ్య పరిస్థితి, గర్భిణుల ఆరోగ్య పర్యవేక్షణ, ప్రసూతికి సంబంధించిన అంశాల్లో ఆశా కార్యకర్తలు కీలకంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. వారి సేవలను గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం తరఫున సన్మాన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, సేవా సంకల్ప్ అభియాన్ జిల్లా కన్వీనర్ మల్లిక, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్‌రెడ్డి, పట్టణ బీజేపీ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, 21వ వార్డు కౌన్సిలర్ పబ్బ రాజమణి లక్ష్మణ్, బాలానగర్ సర్పంచ్, మెదక్ రూరల్ మండలాధ్యక్షుడు బెండవీన, ఎన్‌ఆర్‌ఐ సెల్ జిల్లా కన్వీనర్ సౌజన్య, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు సన్నీ, చైతన్య, కిసాన్ మోర్చా నాయకుడు శేఖర్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్ అక్రమాలపై కదం తొక్కిన కాంగ్రెస్ శ్రేణులు

వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో మేడ్చల్‌లో కాంగ్రెస్ భారీ నిరసన

ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం పోరాటం..

ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మ దహనం



మేడ్చల్ సెప్టెంబర్ 28(ప్రజాకలం న్యూస్)

సర్ ప్రక్రియలో అక్రమాలు, అవకతవకలకు నిరసనగా ఏఐసీసీ ఇచ్చిన పిలుపు మేరకు,టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సూచనలతో మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ నేతృత్వంలో సోమవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. మేడ్చల్ చెక్‌పోస్ట్ వద్ద ఉన్న వైయస్సార్ విగ్రహం నుంచి మేడ్చల్ అంబేద్కర్ విగ్రహం వరకు వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ సర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ప్రతి అర్హుడైన పౌరుడి



ఓటు హక్కును పరిరక్షించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు.సర్ ప్రక్రియపై ప్రజల్లో ఉన్న అనుమానాలు, అభ్యంతరాలను ఎన్నికల సంఘం పరిగణనలోకి తీసుకుని అర్హులైన ప్రతి ఓటరుకు న్యాయం చేయాలని వజ్రేష్ యాదవ్ కోరారు. ఓటర్ల హక్కుల పరిరక్షణ,ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం కాంగ్రెస్ పార్టీ ప్రజల తరఫున నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, అర్హులైన ప్రతి ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి,రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, మల్కాజ్గిరి ఇంచార్జ్ లక్ష్మీ కాంత్ రెడ్డి,టీపీసీసీ ప్రధాన కరదర్శి పీసరి మైపాల్ రెడ్డి, హజ్ కమిటీ మెంబర్ మహమ్మద్ ముజీబ్ ద్దీన్, గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నరసింహులు యాదవ్,డీసీసీ ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్,డీసీసీ అధికార ప్రతినిధి సత్యనారాయణ,డీసీసీ ఉపాధ్యక్షులు బాల్ రెడ్డి,డీసీసీ జనరల్ సెక్రటరీ బీపీటీ రాజు, ఏ బ్లాక్ అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి, కిష్టాపూర్--గుండ్ల పోచంపల్లి--మేడ్చల్, జవహర్ నగర్, కీసర, నాగారం, ఘట్కేసర్,పోచారం, ఎదులాబాద్, పీర్జాదిగూడ, మేడిపల్లి, ఘట్కేసర్, చెంగిచెర్ల డివిజన్ల అధ్యక్షులు చాప రాజు, మల్లేష్ గౌడ్, సురేందర్ ముందిరాజ్,శాంతి కోటేష్ గౌడ్, రామిడి సప్న విజయ్ రెడ్డి, భూమయ్య యాదవ్,ముప్పు రామారావు,బొక్క ప్రభాకర్ రెడ్డి,కర్రె రాజేష్,బండి శ్రీరాములుగౌడ్, తుంగతుర్తి రవి,

పోగుల దిలీప్ రెడ్డి, బొమ్మాక్ కళ్యాణ్, డబిల్‌పూర్ మున్సిపాలిటీ అధ్యక్షులు విఘ్నేశ్వర్ రెడ్డి, మూడు చింతలపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు వెంకటేష్, అలియాబాద్ మున్సిపాలిటీ అధ్యక్షులు తుంకి రమేష్,మేడ్చల్ మాజీ మున్సిపల్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, గుండ్ల పోచంపల్లి మాజీ మున్సిపల్ అధ్యక్షులు సాయిపేట శ్రీనివాస్,మేడ్చల్ మండల మాజీ అధ్యక్షుడు రమణారెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు,యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎస్సీ,బీసీ సెల్ నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



భగత్ సింగ్ 119 జయంతి వేడుకలు

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) భగత్ సింగ్ 119 జయంతి వేడుకల సందర్భంగా షాపూర్ నగర్ ఉషోదయ టవర్స్ వద్ద ఘనంగా జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా ముదిరెడ్డి అశోక్ రెడ్డి మాట్లాడుతూ... భారతదేశ భక్తి కోసం 23 సంవత్సరాలకే బ్రిటిష్ ప్రభుత్వం చే ఉరి కొయ్యలకు వేలాడబడిన యువకిశోరం దేశానికి ఎంతో ఆదర్శం ఈసందర్భంగా భగత్ సింగ్ యొక్క స్ఫూర్తిని తీసుకొని ఎర్రజెండా పార్టీలన్నీ ఒకటి చేయాలని భావిస్తూ జయంతి ఉత్సవం నిర్వహించారని గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో సిపిఐ సిపిఎం, సిపిఐ ఎంఎల్, కమ్యూనిస్టు భావజాలం ఉన్న అభ్యుదయ వాదులందరూ పాల్గొని ఈకార్యక్రమాన్ని జయప్రదం చేశారు. నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని అందరూ ఏకతాటి మీద ఎర్రజెండా పార్టీలో పనిచేస్తున్న అందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సిపిఎం నాయకులు దేవదానం, అంజయ్య, బురాన్, నటరాజ్, కమ్యూనిస్టు నాయకులు టీవీఎస్ రమణ, చిన్నపరెడ్డి, వరప్రసాద్, జానయ్య, కృష్ణారెడ్డి, డప్పు రామస్వామి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, మండల కార్యదర్శి కె.స్వామి సహాయకార్యదర్శి రాములు, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు బాబు ఏఐవైఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు ప్రవీణ్, కీర్తి, కోశాధికారి సురేష్, విజయ్, కొండన్న రామస్వామి, వెంకటేష్ పాల్గొన్నారు

అనుమతులు లేని పాఠశాలపై వెంటనే చర్యలు తీసుకోవాలి

విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలి -అకుల సతీష్



ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) సూరారం పాండు బస్తీలో నిర్వహిస్తున్న శ్రీ వీశివశ్రీ శ్రీఖిష్టశిశిశ్రీకు సంబంధించిన అనుమతులు, గుర్తింపు, పాఠశాల నిర్వహణపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరికి ఫిర్యాదు చేసినట్లు అకుల సతీష్ తెలిపారు. ఫిర్యాదుపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి, సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మేడ్చల్ జిల్లా విద్యాశాఖ అధికారికి (ణజూ) ఫిర్యాదును పంపించి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. పాఠశాలకు చెల్లుబాటు అయ్యే ప్రభుత్వ అనుమతి, గుర్తింపు లేకుండా నిర్వహిస్తున్నట్లు విచారణలో తేలితే పాఠశాలను సీజ్ చేసి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు అకుల సతీష్ పేర్కొన్నారు. అనుమతుల విషయంలో స్పష్టత లేకపోవడం ఇప్పటికే అక్కడ చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తు ఇబ్బందుల్లో పడకూడదని, అవసరమైతే వారిని సమీపంలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చేర్పించి వారి విద్యను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.విద్యార్థులకు TCలు, విద్యా రికార్డులు, బోర్డు రిజిస్ట్రేషన్, SSC/10వ తరగతి పరీక్షల నమోదు విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా విద్యాశాఖ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మహిళా ఉపాధ్యాయురాలి అంశంపై కూడా విచారణ చేయాలి పాఠశాలల్లో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయురాలితో అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణలు, ఆమె బంధువులపై దాడి జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సూరారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు తమకు సమాచారం ఉందని తెలిపారు. మహిళా ఉపాధ్యాయురాలి విషయంలో వచ్చిన ఆరోపణలను తాము అంగీకరించబోమని, ఈ అంశంపై డైరెక్టర్, స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయానికి మరోసారి ఫిర్యాదు చేయడం తో పాటు తెలంగాణ మహిళా కమిషన్‌ను ఆశ్ర యించి చర్యలు కోరుతామని ఆయన తెలిపారు.

తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

పిల్లలను పాఠశాలల్లో చేర్పించే ముందు తల్లిదండ్రులు ఆ పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు, చెల్లుబాటు అయ్యే అనుమతులు, సంబంధిత విద్యాశాఖ రిజిస్ట్రేషన్ ఉన్నాయా లేదా తప్పనిసరిగా నిర్ధారించుకోవాలని సూచించారు. పిల్లల భవిష్యత్తుకు సంబంధించిన విషయంలో కేవలం యాజమాన్యం ఇచ్చే హామీలపై ఆధారపడకుండా, సంబంధిత విద్యాశాఖ అధికారుల ద్వారా పాఠశాల గుర్తింపు వివరాలను నిర్ధారించుకున్న తర్వాతే అడ్మిషన్ తీసుకోవాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన ఈ వ్యవహారంలో అధికారులు జాప్యం చేయకుండా సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను నిర్ధారించి, నిబంధనల ప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈకార్యక్రమంలో అకుల సతీష్, నల్ల జై శంకర్ గౌడ్, కంది శ్రీరాములు, జి. శ్రీనివాస్, అంగడి మల్లేష్, యాదగిరి యాదవ్, వనమాల, నాగరాజ్ గౌడ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తీరుకు వ్యతిరేకంగా మేడ్చల్ లో కాంగ్రెస్ భారీ నిరసన

10 వ డివిజన్ అధ్యక్షుడు బండి శ్రీరాములు గౌడ్ ఆధ్వర్యంలో భారీగా తరలిన కాంగ్రెస్ శ్రేణులు..

మేడిపల్లి సెప్టెంబర్ 28(ప్రజాకలం న్యూస్)

కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష ధోరణికి నిరసనగా ఏఐసిసి ఇచ్చిన పిలుపుమేరకు టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఓటర్ల యొక్క హక్కులు కాపాడడానికి, మేడ్చల్ కేంద్రంలో, నిర్వహించిన భారీ ర్యాలీలో పీర్జాదిగూడ 10 వ డివిజన్ అధ్యక్షులు బండి శ్రీరాములు గౌడ్ ఆధ్వర్యంలో డివిజన్ ఉపాధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు, కార్య దర్శులు, కమిటీ సభ్యులు, యువజన నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



పార్కు స్థలాన్ని కాపాడాలి

- కలెక్టర్‌కు జేఏసీ నాయకుల ఫిర్యాదు

- సాయి లక్ష్మి లేఅవుట్‌లో నిర్మాణాలు నిలిపివేయాలని డిమాండ్

కుత్బుల్లాపూర్ (ప్రజాకలం ప్రతినిధి)

సాయి లక్ష్మి లేఅవుట్‌లో ప్రజల వినియోగం కోసం కేటాయించిన పార్కు, ఓపెన్‌స్పేస్ స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ జేఏసీ నాయకులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సుమారు 1,800 నుంచి 2,000 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ఈ స్థలంలో నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలని కోరారు.

లేఅవుట్ రికార్డులు, 1995 మే 3న జారీ చేసిన జీవో నంబరు 1076తో పాటు సంబంధిత ప్రభుత్వ పత్రాలను పరిశీలిస్తే నదరు స్థలం ప్రజా వినియోగానికి కేటాయించినట్లు తెలుస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రహరీ గోడ నిర్మించి, స్థలాన్ని పార్కుగా ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు.

ప్రస్తుతం కొందరు ప్రైవేటు వ్యక్తులు స్థలాన్ని తమ ఆధీనంలోకి తీసుకునే ప్రయత్నం చేస్తున్నారని, జేసీబీలతో మట్టి తవ్వకాలు చేపట్టి నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారని జేఏసీ నాయకులు ఆరోపించారు. గతంలో ఈ స్థలానికి సంబంధించి హెచ్ఎండీఏ అనుమతుల అంశం తెరపైకి వచ్చిన నేపథ్యంలో అందుబాటులో ఉన్న రికార్డులన్నింటినీ సమగ్రంగా పరిశీలించాలని కోరారు.



అధికారులు వెంటనే స్థలాన్ని పరిశీలించి సర్వే, పంచనామా నిర్వహించి హద్దులను నిర్ధారించాలని, నిర్మాణ పనులను నిలిపివేసి పార్కు స్థలాన్ని రక్షించాలని విజ్ఞప్తి చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు జారీ అయి ఉంటే వాటిని పునఃసమీక్షించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. “ప్రజల కోసం కేటాయించిన పార్కు స్థలాన్ని పరిరక్షించే వరకు పోరాటం కొనసాగిస్తాం” అని జేఏసీ నాయకులు ఆకుల సతీష్, భిక్షపతి గోపాల్ నాయక్, ఎల్ల స్వామి తెలిపారు.

యువతా.. గుండె జాగ్రత్తగా!

- గుండెను కాపాడుకుందాం.. ఆరోగ్యంగా జీవిద్దాం.

- మారుతున్న జీవనశైలితో పెరుగుతున్న గుండె సమస్యలు

- ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా

ముషీరాబాద్ UPHC మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం. మనోజ్ రెడ్డి సూచనలు





హైదరాబాద్ సెప్టెంబర్ 28
(ప్రజాకలం ప్రతినిధి)

గుండె జబ్బులు వృద్ధాప్య సమస్య మాత్రమే కాదని.. మారుతున్న జీవనశైలి కారణంగా యువతలోనూ గుండె సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయని ముషీరాబాద్ UPHC మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం. మనోజ్ రెడ్డి తెలిపారు. అనారోగ్యకరమైన ఆహారం, శారీరక శ్రమ లేకపోవడం, అధిక ఒత్తిడి, నిద్రలేమి, పొగతాగడం వంటి అలవాట్లు గుండె ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు.

సెప్టెంబర్ 29న నిర్వహించే ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ప్రజలు గుండె ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆయన సూచించారు.

రోజూ వ్యాయామం తప్పనిసరి

రోజువారీ జీవితంలో శారీరక శ్రమకు ప్రాధాన్యం ఇవ్వాలని డాక్టర్ మనోజ్ రెడ్డి సూచించారు.

నడక, జాగింగ్, సైక్లింగ్ వంటి వ్యాయామాలను అలవాటుగా మార్చుకోవాలని.. సాధ్యమైనంత వరకు రోజుకు కనీసం 30 నిమిషాల శారీరక శ్రమ చేయడం మంచిదన్నారు. దీనివల్ల శరీర బరువు, రక్తపోటు, కొలెస్ట్రాల్ వంటి ప్రమాద కారకాలను నియంత్రించుకోవచ్చని తెలిపారు.

ఆహారంపై అప్రమత్తత అవసరం

అధిక ఉప్పు, చక్కెర, సంతృప్త కొవ్వులు, జంక్‌ఫుడ్, అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తగ్గించాలని సూచించారు. కూరగాయలు, పండ్లు, సంపూర్ణ ధాన్యాలు, పప్పుధాన్యాలు, గింజలు వంటి పోషకాహారాన్ని ఆహారంలో భాగం చేసుకోవాలని తెలిపారు.

ఒత్తిడి.. నిద్రలేమి వద్దు

అధిక పని ఒత్తిడి, రాత్రివేళల్లో ఎక్కువసేపు మేల్కొని ఉండటం, తగినంత నిద్ర లేకపోవడం ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని డాక్టర్ మనోజ్ రెడ్డి తెలిపారు. పెద్దలు సాధారణంగా 7--8 గంటల నాణ్యమైన నిద్ర పొందేలా చూసుకోవాలని సూచించారు. యోగా, ధ్యానం, శ్వాసాభ్యాసాలు, నడక వంటి కార్యక్రమాలు ఒత్తిడిని నియంత్రించడంలో సహాయపడతాయని చెప్పారు.

పొగాకుకు దూరంగా ఉండాలి

పొగతాగడం, పొగాకు ఉత్పత్తుల వినియోగం గుండె ఆరోగ్యానికి హానికరమని హెచ్చరించారు. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించుకోవడానికి పొగతాగడం పూర్తిగా మానేయడం ముఖ్యమన్నారు.

బీపీ.. షుగర్.. కొలెస్ట్రాల్‌పై నిఘా

అధిక రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, అధిక బరువు వంటి సమస్యలు గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతాయని తెలిపారు. అవసరాన్ని బట్టి వైద్యుల సలహాతో ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర ఉన్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.


లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దు

ఛాతీలో నొప్పి లేదా బిగుతు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అసాధారణంగా చెమటలు పట్టడం, అకస్మాత్తుగా తీవ్రమైన బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య సహాయం పొందాలని డాక్టర్ మనోజ్ రెడ్డి సూచించారు.

"గుండె ఆరోగ్యం.. మన బాధ్యత"

"గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఒక్కరోజు కార్యక్రమం కాదు. ప్రతిరోజూ మనం తీసుకునే ఆరోగ్యకరమైన నిర్ణయాలే మన భవిష్యత్తు ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి. సమతుల్య ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం, తగినంత నిద్ర, ఒత్తిడి నియంత్రణ, పొగాకుకు దూరంగా ఉండటం, అవసరమైన ఆరోగ్య పరీక్షలు--- ఇవే ఆరోగ్యకరమైన హృదయానికి ముఖ్యమైన పునాదులు" అని డాక్టర్ ఎం. మనోజ్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్, ముషీరాబాద్ UPHC తెలిపారు.

ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ గుండె ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ, కుటుంబ సభ్యులు మరియు సమాజంలోనూ గుండె జబ్బుల నివారణపై అవగాహన కల్పించాలని ఆయన పిలుపునిచ్చారు.





సాంఘిక బహిష్కరణలు సిగ్గుచేటు

:మంద కృష్ణ మాదిగ

- వీడీసీల రద్దుకు ఉమ్మడి పోరాటం

- తాళ్ళరాంపుర్ బాధితులకు ఎమ్మార్పీఎస్ పూర్తి మద్దతు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి)సెప్టెంబరు 28 :

ఆధునిక సమాజంలో ఇంకా గ్రామ అభివృద్ధి కమిటీల వీడీసీ పేరిట సాంఘిక బహిష్కరణలు, వివక్షా పూరిత చర్యలకు పాల్పడటం సిగ్గుచేటని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు, మంద కృష్ణ మాదిగ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వీడీసీల అరాచకాలకు, ఆధిపత్య ధోరణులకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ఎమ్మార్పీఎస్ ముందుంటుందని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో సోమవారం వీడీసీ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో తాళ్ళరాంపుర్ గ్రామానికి చెందిన పలువురు బాధితులు మంద కృష్ణ మాదిగను కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో వీడీసీ నాయకులు తమపై విధిస్తున్న ఆంక్షలు, సామాజిక వెలివేత, ఎదుర్కొంటున్న వివక్షను బాధితులు ఆయనకు వివరించి, కన్నీటిపర్యంతమయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో సమాంతర ప్రభుత్వాల ప్రైవేటు సైన్యాల్లా చలామణి అవుతున్న వీడీసీలను శాశ్వతంగా రద్దు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని వారు కోరారు. బాధితుల ఆవేదనను ఆలకించిన మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ.. బాధితులకు ఎమ్మార్పీఎస్‌తో పాటు అన్ని ప్రజాస్వామిక సంఘాల తరఫున పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కొందరి ఆధిపత్య ధోరణులను కూకటివేళ్లతో అణచివేసేందుకు ఉమ్మడి కార్యాచరణతో ముందుకు సాగుతామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ వ్యతిరేక పోరాట సమితి నాయకుడు బట్టు శ్రీధర్, బాధితులు దిబ్బ సుదర్శన్, నర్సా గౌడ్, నారాయణ గౌడ్, గంగాధర్, దేవదాస్, దేవన్న, జనార్దన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ మైనార్టీ విభాగంలో వేములవాడ నేతలకు కీలక పదవులు


- అబ్దుల్ రజాక్‌కు వేములవాడ పట్టణ అధ్యక్ష పదవి..

-షాహీద్ పాషాకు జిల్లా ఉపాధ్యక్ష బాధ్యతలు.

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబరు 28 (ప్రజా కలం ప్రతినిధి) :

కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగంలో వేములవాడకు చెందిన ఇద్దరు నాయకులకు కీలక





బాధ్యతలు అప్పగించారు. వేములవాడ పట్టణ కాంగ్రెస్ మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు మహమ్మద్ అబ్దుల్ రజాక్, రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ షాహీద్ పాషా నియమితులయ్యారు.సోమవారం సిరిసిల్లలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర బీసీ సలహాదారు, మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు, జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు షేక్ రియాజ్ చేతుల మీదుగా ఇద్దరూ నియామక పత్రాలు అందుకున్నారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు పార్టీ నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు,పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ వేములవాడలో మైనార్టీ విభాగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం షాహీద్ పాషా మాట్లాడుతూ జిల్లా మైనార్టీ విభాగాన్ని బలోపేతం చేయడంతో పాటు మైనార్టీ వర్గాల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు షేక్ రియాజ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మధు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి

- పేదల ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదం

- ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం కల్పించాలి: సచిన్ సావంత్

- ప్రమాదంలో పడ్డ భారత రాజ్యాంగం

- ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ కాంగ్రెస్ భారీ ర్యాలీ

-ముఖ్యఅతిథిగా ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ కోఆర్డినేటర్ సచిన్ సావంత్

-రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు పారిజాత నర్సింహా రెడ్డి



మహేశ్వరం, సెప్టెంబర్ 28:(ప్రజా కలం)

కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐసీసీ చైర్మన్ మల్లికార్జున ఖర్గే, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు పారిజాత నర్సింహా రెడ్డి ఆధ్వర్యంలో కందుకూరు మండలంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, నిరసన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ప్రధాన రహదారిపై నిరసన చేపట్టి కేంద్ర ప్రభుత్వం, బీజేపీ, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం అధికారి గ్యానేశ్ కుమార్ దిష్టిబొమ్మలను దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు.

పేదల ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదం:

చిగిరింత పారిజాత నర్సింహా రెడ్డి

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు పారిజాత నర్సింహా రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికల సంఘం కీలకమైనదని, అలాంటి సంస్థ నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరుపై ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆరోపించారు. ప్రజల చిరునామాలు సక్రమంగా ఉన్నప్పటికీ ఓట్లను తొలగిస్తున్నారని విమర్శించారు. పేదలు, సామాన్యులు, అర్హులైన ఓటర్ల ఓట్లను జాబితా నుంచి తొలగించే చర్యలు ప్రజాస్వామ్య హక్కులను దెబ్బతీస్తాయని అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం మోదీ ప్రభుత్వం, బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోందన్నారు.ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం కల్పించాలి:

ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ కోఆర్డినేటర్ సచిన్ సావంత్

ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ మాట్లాడుతూ.. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉండాలంటే ఎన్నికల సంఘం స్వతంత్రంగా, పారదర్శకంగా పనిచేయాలని అన్నారు. ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపు, చేర్పుల విషయంలో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు.ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రజాస్వామ్య హక్కు అని, దానిని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.

అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ

ధర్నా అనంతరం సామ నర్సింహా రెడ్డి ఫంక్షన్ హాల్ నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా అంబేద్కర్ విగ్రహం వరకు వెళ్లారు. ర్యాలీలో కేంద్ర ప్రభుత్వానికి, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎన్నికల సంఘం తీరుపై తమ అభ్యంతరాలను తెలియజేస్తూ అర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు ఉన్నాయనే ఆరోపణలపై సమగ్రంగా పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జ్ భీంభరత్, కాంగ్రెస్ స్పోక్స్‌పర్సన్ సామ రామ్మోహన్ రెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, మాజీ డీసీసీ, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహా రెడ్డి, టీపీసీసీ సభ్యుడు దేపా భాస్కర్ రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ తీగల అనితా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అక్రమ పార్కింగ్‌పై కఠిన చర్యలు

మల్కాజిగిరి, సెప్టెంబరు 28 (ప్రజా కలం ప్రతినిధి): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ వాహనాలను అక్రమంగా పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మల్కాజిగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి.నరసింహ హెచ్చరించారు.



మల్కాజిగిరి మున్సిపల్ జోనల్ కమిషనర్ కార్యాలయం ఇరువైపులా అక్రమంగా నిలిపిన వాహనాలను ట్రాఫిక్ పోలీసులు తనిఖీ చేసి,తొలగించాలని ఆదేశించారు. జోనల్ కార్యాలయానికి సమీపంలో ప్రభుత్వ ఆసుపత్రి ఉండటంతో అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగులు, అంబులెన్స్‌లకు అక్రమ పార్కింగ్ వల్ల ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు.

ప్రధాన రహదారులు, ఆసుపత్రుల పరిసరాల్లో అక్రమంగా వాహనాలు నిలిపితే జరిమానాలతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ స్పష్టం చేశారు. మల్కాజిగిరిలో అక్రమ పార్కింగ్ సమస్యను నియంత్రించేందుకు పలు ప్రాంతాల్లో త్వరలో ట్రాఫిక్ నిర్వహణలో మార్పులు, చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com

పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందించాలి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యం: కలెక్టర్ కె.హైమావతి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి:28 సెప్టెంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ (డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్ ప్రమోషన్



కమిటీ) సమావేశం జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలో పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహం,సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు సంబంధించిన అంశాలపై సమావేశంలో సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ జిల్లాలో యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కొత్త పరిశ్రమల స్థాపనకు అవసరమైన ప్రోత్సాహం అందించాలని అధికారులను ఆదేశించారు. పరిశ్రమలకు సంబంధించిన దరఖాస్తులు,అనుమతులు, సమస్యలను క్షేత్రస్థాయిలో సమీక్షించి సకాలంలో పరిష్కరించాలన్నారు. పెట్టుబడిదారులకు అవసరమైన సహకారం,శాఖల మధ్య సమన్వయం అందిస్తూ జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి గణేష్ రామ్,ఇరిగేషన్ ఈఈ నాగరాజు,ఏంపీఐ శ్రీకాంత్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంత కనిపించడంలేదంటూ ప్రజావాణిలో ఫిర్యాదు

మల్కాజిగిరి, సెప్టెంబరు 28 (ప్రజా కలం ప్రతినిధి): ప్రజాధనంతో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంత ప్రస్తుతం కనిపించడంలేదని, దాని ఆచూకీపై విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని మీర్జాలగూడ డివిజన్ చిన్మయ



మార్గ్ కాలనీకి చెందిన జంగాల శ్రీరామ్ యాదవ్ అధికారులను కోరారు.

సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డికి ఆయన ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై మల్కాజిగిరి పోలీస్ స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాలనీలో వర్షపు నీరు వృథాగా వెళ్లకుండా భూమిలోకి ఇంకేలా గతంలో ఇంకుడు గుంతను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఆ నిర్మాణం కనిపించడంలేదని, దానిని తొలగించారా, తరలించారా అనే విషయంపై అధికారులు విచారణ జరిపి స్పష్టత ఇవ్వాలని కోరారు.

వర్షపు నీటి సంరక్షణతో పాటు భూగర్భ జలాల పెంపుదలకు ఇంకుడు గుంతలు ఎంతో కీలకమని శ్రీరామ్ యాదవ్ అన్నారు. గతంలో ఉన్న ప్రదేశాన్ని గుర్తించి, అదే ప్రాంతంలో తిరిగి ఇంకుడు గుంత ఏర్పాటు చేసి వర్షపు నీటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీలో భవిష్యత్‌లో నీటి సమస్య తలెత్తకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

బహుజన తెలంగాణ సాధనే తెలంగాణ రక్షణ సేన లక్ష్యం

- ఉచిత విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, సామాజిక న్యాయమే పాంచజన్య సూత్రాలు: కొట్టాల యాదగిరి

గజ్వేల్ నియోజకవర్గం:28 సెప్టెంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ నియోజకవర్గం వర్గల్ మండల కేంద్రంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండాను పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ కొట్టాల యాదగిరి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో ఉద్యమకారులకు జరిగిన అవమానాలు,అన్యాయాలను గుర్తించిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీని స్థాపించారని తెలిపారు. బహుజన తెలంగాణ సాధనే లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన ప్రజల్లోకి వెళ్తుందని అన్నారు.ప్రజలకు అవసరమైన ఉచిత విద్య, వైద్యం, వ్యవసాయం,ఉపాధి,సామాజిక న్యాయం వంటి పాంచజన్య సూత్రాల సాధన కోసం పార్టీ పనిచేస్తుందని పేర్కొన్నారు.పార్టీ విధానాలను ప్రజలు గమనిస్తున్నారని,రాబోయే రోజుల్లో తెలంగాణ రక్షణ సేనను క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసి అధికారమే లక్ష్యంగా ముందుకు సాగుతామని కొట్టాల యాదగిరి తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎడ్ల నర్సింహులు,స్థానిక నాయకులు స్వామి,కూరాకుల శ్రీకాంత్,లింగాని రాజు,చందు,కుమార్, నరసింహులు, శ్రావణ్, రమేష్,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



చీఫ్ ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ

సంగారెడ్డి లో కదం తొక్కిన కాంగ్రెస్ శ్రేణులు

భారీ ర్యాలీ, సభ నిర్వహించి , అడిషనల్ కలెక్టర్ కు వినతి పత్రం సమర్పణ

ఓట్ల తొలగింపే లక్ష్యంగా ఎస్ ఐ ఆర్ : ఎంపీ సురేష్ షెట్కార్

అర్హులైన ఒక్క ఓటు కూడా తొలగిపోకూడదు: నిర్మలా జగ్గారెడ్డి

ఓటర్ల హక్కుల పరిరక్షణకు బూత్ స్థాయిలో అప్రమత్తంగా ఉండాలి: చంద్రశేఖర్ రెడ్డి





సంగారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 28 (ప్రజా కలం):

ఓటర్ల జాబితా నుంచి అర్హులైన ఓట్లను తొలగించడమే లక్ష్యంగా ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ఎస్ ఐ ఆర్ ప్రక్రియ కొనసాగుతోందని మెదక్ ఎంపీ సురేష్ షెట్కార్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఓట్ల గల్లంతు, ఎన్నికల కమిషన్‌పై నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. రామ్ నగర్ రామ్ మందిర్ వద్ద గల జగ్గారెడ్డి ఇంటి నుండి మొదలుకుని పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేశారు. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నాయకులు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సభలో ఎంపీ సురేష్ షెట్కార్, డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడారు. అనంతరం జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయం లో అడిషనల్ కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు

ఓట్ చోరీపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పోరాటం: సురేష్ షెట్కార్

ఎంపీ సురేష్ షెట్కార్ మాట్లాడుతూ.. ఓట్ చోరీ అంశంపై కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా పోరాటం చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో పార్లమెంట్‌లో ధర్నాలు, ఆందోళనలు నిర్వహించినప్పటికీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తమ కార్యక్రమాలను కొనసాగించిందని ఆరోపించారు. బీహార్, బెంగాల్ ఎన్నికల్లో భారీగా ఓట్లను తొలగించి బీజేపీ అధికారంలోకి వచ్చిందని ఆయన ఆరోపించారు.

ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల్లోనూ ఎస్ ఐ ఆర్ పేరుతో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ కొనసాగుతోందని, తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ఈ ప్రక్రియపై అప్రమత్తంగా ఉందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడాల్సిన అవసరం ఉందని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎన్నికల వ్యవస్థ చర్యలు తీసుకోవాలని సురేష్ షెట్కార్ కోరారు.

అర్హులైన ఒక్క ఓటు కూడా తొలగిపోకూడదు: నిర్మలా జగ్గారెడ్డి

మాజీ డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో పెద్ద సంఖ్యలో ఓటర్లకు అభ్యంతరాలు, నోటీసులు రావడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ముఖ్యంగా మైనారిటీలు, ఎస్సీలు, పేదలు, బలహీన వర్గాలకు చెందిన అర్హులైన ఓటర్ల ఓట్లు తొలగిపోకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉందన్నారు. ఏళ్లుగా ఒకే ప్రాంతంలో నివసిస్తూ, నిరంతరం ఓటు హక్కును వినియోగించుకుంటున్న వారికి సైతం నోటీసులు రావడానికి కారణమేంటని ఆమె ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో బూత్‌ల వారీగా పరిశీలిస్తే ఓటర్లకు నోటీసులు రావడం, వివిధ రకాల ధ్రువపత్రాలు సమర్పించాలని కోరడం వంటి అంశాలు తమ దృష్టికి వస్తున్నాయని తెలిపారు. ఓటు హక్కుకు సంబంధించిన ఏ అక్రమాన్నైనా ప్రశ్నించాల్సిన అవసరం ఉందని నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఓట్ చోరీ అంశాన్ని దేశవ్యాప్తంగా ప్రజల ముందుకు తీసుకెళ్లారని గుర్తుచేశారు. అర్హులైన ఒక్క ఓటు కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగిపోకుండా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బూత్ స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

బూత్ స్థాయిలో అప్రమత్తంగా ఉండాలి: చంద్రశేఖర్ రెడ్డి

డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ నిశితంగా పరిశీలిస్తోందన్నారు. ప్రతి బూత్‌లో ఓటర్ల వివరాలను పరిశీలించి, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉన్నాయా లేదా అన్నది నిర్ధారించాల్సిన అవసరం ఉందన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన హక్కు అని, అర్హత ఉన్న ఏ ఒక్కరి పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా కాంగ్రెస్ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. నోటీసులు అందుకున్న ఓటర్లకు అవసరమైన సమాచారం, ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు పార్టీ శ్రేణులు సహకరించాలని చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ కంటెస్టెడ్ ఎంపీ నీలం మధు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధారాణి, సంగారెడ్డి జిల్లా నలుమూలల నుండి వచ్చిన కాంగ్రెస్ శ్రేణులు భారీ ఎత్తున పాల్గొన్నారు



మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఖరీఫ్ పత్తి కొనుగోళ్లు పగడ్బందీ చర్యలు.

ఏం ఎస్ పి తో రైతుల నుంచి

పత్తి కొనుగోలు సజావుగా నిర్వహించాలి : అదనపు కలెక్టర్ సంగీత .



సంగారెడ్డి, ప్రతినిధి సెప్టెంబర్ 28(ప్రజా కలం):జిల్లాలో వానాకాలం 2026-27 సీజన్‌లో పత్తి కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంగీత అధికారులను ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం లో పత్తి కనీస మద్దతు ధర కొనుగోళ్లపై మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో సంబంధిత శాఖల అధికారులు, జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ సంగీత మాట్లాడారు.

రాష్ట్రంలో పత్తి సేకరణ ప్రారంభమైన వెంటనే అన్ని అధీకృత జిన్నింగ్ మిల్లులను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా రైతులు తమకు సమీపంలోని మిల్లులకు పత్తిని తరలించుకునే అవకాశం కల్పించాలని సూచించారు. జిల్లాలో ఈ సీజన్‌లో 3,57,246 ఎకరాల్లో పత్తి సాగు కాగా, సుమారు 3,16,520 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసిందన్నారు. 2026-27 సీజన్‌కు పత్తి కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 8,667గా నిర్ణయించబడిందని తెలిపారు. రైతుల నుంచి ఎంఎస్పి తో పత్తి సేకరణలో సిసిఐ కీలకంగా వ్యవహరించనుందని తెలిపారు.

ప్రతిపాదిత కొనుగోలు కేంద్రాలకు కొనుగోలు అధికారులను కేటాయించి, నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం కేంద్రాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. అన్ని జిన్నింగ్ మిల్లుల్లో అవసరమైన సాఫ్ట్‌వేర్‌తో పాటు వెబ్ కెమెరాలు, వేలిముద్ర స్కానర్లు, సక్రమమైన ఇంటర్నెట్ సౌకర్యం, అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మార్కెట్ యార్డులు, జిన్నింగ్ మిల్లుల్లోని వేబ్రిడ్జ్‌లను లీగల్ మెట్రాలజీ శాఖ ద్వారా ధ్రువీకరించి, తూకం ఖచ్చితత్వాన్ని నిర్ధారించాలని సూచించారు. నిబంధనల ప్రకారం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతరం పనిచేసేలా చూడాలని ఆదేశించారు.

తూనిక యంత్రాల్లో ఎలాంటి తేడాలు లేకుండా లీగల్ మెట్రాలజీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. రైతు దిగుబడి 40 క్వింటాళ్లలోపు ఉంటే ఏఈఓ, 40 క్వింటాళ్లకు మించి ఉంటే ఏఓ ధ్రువీకరణ పత్రం జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అక్టోబర్ 1 నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, అంతర్‌జిల్లా మ్యాపింగ్‌కు సంబంధించిన ప్రతిపాదనలు ఉంటే సెప్టెంబర్ 30లోగా ఖరారు చేసి సిసిఐ కి పంపాలని ఆదేశించారు. దీనివల్ల రైతుల రవాణా భారం తగ్గడంతో పాటు స్లాట్‌ల లభ్యత కూడా పెరుగుతుందని అధికారులు తెలిపారు.

జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి శ్రీకాంత్ మాట్లాడుతూ , జిల్లాలో సదాశివపేట, రైకోడ్, నారాయణఖేడ్, జోగిపేట, వట్‌పల్లి, జహీరాబాద్‌లలో ఆరు కాటన్ ఏఎంసీలు ఉన్నాయని, గత సీజన్‌లో 24 జిన్నింగ్ మిల్లులు ఉండగా, ఈ సీజన్‌లో 23 జిన్నింగ్ మిల్లులను ప్రతిపాదించినట్లు వివరించారు. పత్తి కొనుగోళ్లకు ముందే కాపాస్ కిసాన్ యాప్‌లో రైతుల నమోదు, స్లాట్ బుకింగ్, ఎం ఎస్పీ పత్తి నాణ్యతా ప్రమాణాలు, తేమ శాతం, పత్తిని వదులుగా తీసుకురావడం తదితర అంశాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. మండలాల వారీగా పత్తి సాగు విస్తీర్ణం, ఉత్పత్తి వివరాలతో పాటు రైతుల డేటాను సెప్టెంబర్ 30లోగా ఎన్ఐసి ద్వారా కాపాస్ కిసాన్ యాప్‌కు బదిలీ చేయాలని సూచించారు.

ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమం ద్వారా కాపాస్ కిసాన్ యాప్‌లో నమోదు, స్లాట్ బుకింగ్, కొనుగోలు కేంద్రాల వివరాలను రైతులకు తెలియజేయాలని సూచించారు. కౌలు రైతుల వివరాలను ఏఈఓలు, ఏఓలు క్రాప్ బుకింగ్ సైట్‌లో నమోదు చేయాలని సూచించారు.

జిల్లాలో పత్తి కొనుగోళ్లు సజావుగా, పారదర్శకంగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ సంగీత ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి శ్రీకాంత్ , జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్ ,సంబంధిత శాఖల అధికారులు జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు ,సిబ్బంది పాల్గొన్నారు .

మార్కూక్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ రష్మి పెరుమాళ్

క్రమశిక్షణ,ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి: సీపీ

గజ్వేల్ నియోజకవర్గం:28 సెప్టెంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మార్కూక్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్, ఐపీఎస్ సందర్శించి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న సీపీకి ఎస్ఐ యూనుస్ అహ్మద్ అలీ ఆధ్వర్యంలో సిబ్బంది రిపోర్ట్ చేయగా, అనంతరం నిర్వహించిన పరేడ్‌ను సీపీ పరిశీలించారు.ఈ సందర్భంగా సిబ్బంది కిట్ ఆర్టికల్స్,పోలీస్ స్టేషన్ ఆవరణలోని కేసులకు సంబంధించిన వాహనాలను తనిఖీ చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలు,రికార్డులు,వివిధ వర్టికల్స్ పనితీరును క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు,ఆదేశాలు జారీ చేశారు.సీపీ రష్మి పెరుమాళ్ మాట్లాడుతూ ప్రతి పోలీస్ అధికారి,సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ,సమయపాలన పాటించాలని సూచించారు.ప్రజల సమస్యలను ఓపికగా విని,వాటిని త్వరితగతిన పరిష్కరించాలని,గౌరవప్రదంగా, నిబద్ధతతో విధులు నిర్వహించాలని అన్నారు.కమ్యూనిటీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తూ ప్రజల్లో పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని పెంచాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణ,నేరాల నియంత్రణ కోసం 'సిద్దిపేట సురక్ష నేత్ర' కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో సీసీటీవీ కెమెరాల నిఘాను పెంచేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఐని ఆదేశించారు.అలాగే గ్రామీణ యువతకు'సిద్దిపేట పోలీస్ ఉద్యోగ మిత్ర'కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించి,ఉద్యోగ అవకాశాల దిశగా సరైన మార్గనిర్దేశం చేయాలని సూచించారు.విధుల్లో బిజీగా ఉంటూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దని సిబ్బందికి సూచించిన సీపీ.. "నివారణే మేలైన మార్గం"అనే సూత్రాన్ని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. అనంతరం పోలీస్ సిబ్బంది సమస్యలను సీపీ అడిగి తెలుసుకున్నారు.వారి సమస్యలను త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ప్రతి వర్టికల్ ఇన్‌చార్జ్ తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు.ఈ తనిఖీలో గజ్వేల్ ఏసీపీ నరసింహులు,గజ్వేల్ రూరల్ సీఐ రవి రాజు,ఎస్ఐ యూనుస్ అహ్మద్ అలీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

